


సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:174 | Vol-01 ::: Issue-174
హైదరాబాద్ 25 జనవరి 2026, ఆదివారం | Hyderabad 25 January 2026, Sunday
పేజీలు: 8, వెల: రూ. 5/- | Pages: 8, Rs. 5/-




హరీశ్ రావు కు భట్టి విక్రమార్క సవాల్ | సింగరేణి పై విచారణకు సిద్ధమన్న డిప్యూటీ సీఎం | 2014 నుంచి అన్ని టెండర్ల గుట్టు విప్పుదామా?

సైట్ విజిట్ నిబంధన కేంద్రానిదేనని స్పష్టం | సింగరేణి ప్రతిష్టను దిగజార్చొద్దని హితవు | మీడియా కథనాలపై మండిపడ్డ ఉప ముఖ్యమంత్రి

### హరీశ్ ఒప్పుకుంటే...
# సింగరేణిపై 'సిట్' వేస్తా



సింగరేణి సంస్థను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపైన, వ్యక్తిగతంగా తనపైన వస్తున్న ఆరోపణలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఖండించారు. ప్రజాభవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు, ఒక మీడియా సంస్థ అధినేతను లక్ష్యంగా చేసుకుని ధ్వజమెత్తారు.

...::: సమగ్ర కథనం 2వ పేజీలో..



### నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తానంటే...
# నేను రెడీ


సింగరేణి టెండర్ల వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఈ క్రమంలో మాజీ మంత్రి హరీశ్ రావు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మధ్య వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి.

హైదరాబాద్ (ఏడీఎన్‌ఎన్) :

సింగరేణి బొగ్గు గనుల టెండర్ల ప్రక్రియలో భారీ కుంభకోణం జరిగిందని, ఆ పాపంలో ప్రభుత్వ పెద్దలకు భాగస్వామ్యం ఉందని మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపైన, ఆయన బావమరిదిపైన నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తామని భట్టి విక్రమార్క హామీ ఇస్తే, ఆయనకు కూడా లేఖ రాయడానికి తాను సిద్ధంగా ఉన్నానని హరీశ్ రావు స్పష్టం చేశారు.

...::: తరువాయి 2వ పేజీలో..

### ఎనిమిది వేల
# విమానాలు రద్దు!



ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :

అమెరికా చరిత్రలోనే మంచు తుపాను విలయతాండవం చేస్తోంది. టెక్సాస్ నుంచి న్యూ ఇంగ్లాండ్ వరకు దాదాపు 2,000 మైళ్ల విస్తీర్ణంలో ఈ మంచు తుపాను ప్రభావం చూపుతోంది. అగ్రరాజ్యమంతా శీతల వాతావరణంతో గజగజ వణికిపోతోంది. పరిస్థితి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వాషింగ్టన్ డీసీతో పాటు అలబామా, జార్జియా, కెంటకీ, న్యూయార్క్, టెక్సాస్ సహా 16 రాష్ట్రాల్లో 'స్టేట్ ఆఫ్ ఎమర్జెన్సీ' ప్రకటించారు. ఈ వారంలో ఇప్పటి వరకూ 8,000 కు పైగా విమానాలు రద్దయ్యాయి. డెల్టా, అమెరికన్, యునైటెడ్ ఎయిర్‌లైన్స్ ప్రయాణ హెచ్చరికలు జారీ చేశాయి. పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోవచ్చునని ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌ఏఏ) హెచ్చరించింది. దాదాపు 20 కోట్ల మందికి పైగా ప్రజలు మంచు, తీవ్ర చలిగాలుల హెచ్చరికల మధ్య జీవనం సాగిస్తున్నారు.

...::: తరువాయి 2వ పేజీలో..

### జపాన్‌లోనూ
# యూపీఐ మ్యాజిక్

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :

భారతదేశపు అత్యంత విజయవంతమైన డిజిటల్ చెల్లింపుల వ్యవస్థ 'యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్' మరో అంతర్జాతీయ మైలురాయిని చేరుకోనుంది. త్వరలోనే జపాన్ దేశంలో కూడా యూపీఐ సేవలు అందుబాటులోకి రానున్నాయి. ఇందుకోసం జపాన్‌కు చెందిన ప్రముఖ ఐటీ దిగ్గజం ఎన్‌టీటీ డేటా, నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. నిక్కీ ఆసియా నివేదిక ప్రకారం, భారత్–జపాన్ పేమెంట్ నెట్‌వర్క్ లను అనుసంధానించే ప్రక్రియపై రెండు సంస్థలు ఇప్పటికే పని చేస్తున్నాయి.

...::: తరువాయి 3వ పేజీలో..




### ఐఏఎస్, ఐపీఎస్
# రిజిస్టర్ మ్యారేజ్

యాదాద్రి (ఏడీఎన్‌ఎన్) :


ఉన్నత విద్యావంతులైన ఈ జంట నేటి యువతకు ఆదర్శంగా మారారు. ఉన్నత హోదాల్లో ఉన్నప్పటికీ హంగు , ఆడంబరాలకు దూరంగా నిలిచారు. కోట్లాది రూపాయలను నీళ్లప్రాయంగా ఖర్చు చేసే ఆర్భాట వివాహాలకు భిన్నంగా, నిరాడంబరంగా రిజిస్టర్ కార్యాలయంలో వివాహం చేసుకుని సమాజానికి చక్కటి సందేశం ఇచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం శనివారం ఈ అపురూప ఘట్టానికి వేదికైంది. చౌటుప్పల్ మండలం లింగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువ ఐపీఎస్ అధికారి శేషాద్రిని రెడ్డి, కడప జిల్లాకు చెందిన ఐఏఎస్ అధికారి శ్రీకాంత్ రెడ్డి ఎలాంటి హంగులు, హడావిడి లేకుండా చట్టబద్ధంగా వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం శేషాద్రిని రెడ్డి కుత్బుల్లాపూర్ డీసీపీగా విధులు నిర్వహిస్తుండగా, శ్రీకాంత్ రెడ్డి ఐఏఎస్ శిక్షణలో ఉన్నారు. కేవలం కొద్ది మంది కుటుంబ సభ్యులు, సన్నిహితులు, ఉన్నతాధికారుల సమక్షంలో రిజిస్టర్ మ్యారేజ్ పూర్తయింది. రిజిస్ట్రార్ కార్యాలయంలో సంతకాలు చేసి, పూలమాలలు మార్చుకుని ఈ జంట ఒక్కటయ్యారు.



### హెచ్చరికలకు భయపడను..
# ఆధారాలతోనే జవాబిస్తా !



...::: సమగ్ర కథనం 5వ పేజీలో..



# ఉక్రెయిన్‌పై మరోసారి దాడి

ఒకవైపు శాంతి మంత్రం.. మరోవైపు క్షిపణుల వర్షం అన్నట్లుగా ఉక్రెయిన్‌లో రష్యా మరోసారి విధ్వంసం సృష్టించింది. అమెరికా చొరవతో త్రైపాక్షిక శాంతి చర్చలు ప్రారంభమైన తరుణంలోనే, రష్యా తన సైనిక చర్యను ఉద్ధృతం చేయడం ప్రపంచ దేశాలను విస్మయానికి గురిచేస్తోంది. రాజధాని కీవ్, ఖార్కివ్ నగరాలను లక్ష్యంగా చేసుకుని రష్యా జరిపిన డ్రోన్, క్షిపణి దాడుల్లో భారీ ప్రాణ, ఆస్తి నష్టం సంభవించింది. చర్చలు జరుగుతున్న సమయంలోనే రష్యా ఈ స్థాయిలో విరుచుకుపడటం, ఆ దేశ చిత్తశుద్ధిని ప్రశ్నిస్తోందని ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహా మండిపడ్డారు.

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :

అమెరికా, రష్యా , ఉక్రెయిన్ ల మధ్య త్రైపాక్షిక శాంతి చర్చలు జరుగుతున్న తరుణంలో రష్యా మరోసారి ఉక్రెయిన్‌పై దాడులు చేసింది. డ్రోన్లు, క్షిపణులతో ఉక్రెయిన్‌లోని పలు ప్రాంతాలపై విరుచుకుపడింది. ప్రధానంగా రాజధాని కీవ్, ఖార్ఖివ్ నగరాలను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు నిర్వహించడం కలకలం రేపింది. తాజా దాడుల్లో ఒకరు మృతి చెందగా మరో 15 మందికి గాయపడ్డారని ఉక్రెయిన్ అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ లో నివాస ప్రాంతాలకూ నష్టం వాటిల్లిందని, ఆ దేశ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహా చెప్పారు. అమెరికా, రష్యా, ఉక్రెయిన్ దేశాల మధ్య తొలి త్రైపాక్షిక సమావేశాలు యూఏఈలో శుక్రవారం ప్రారంభమైన విషయం తెలిసిందే.రెండు రోజుల పాటు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. 2022లో యుద్ధం ప్రారంభమైన తర్వాత మూడు దేశాల ప్రతినిధులు ఒకే వేదికపై చర్చించనుండటం ఇదే తొలిసారి.

...::: తరువాయి 3వ పేజీలో..




# నాంపల్లిలో భారీ అగ్నిప్రమాదం

హైదరాబాద్‌లోని నాంపల్లిలో శనివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. చిరాగ్ అలీ లేన్‌లోని ఒక ప్రముఖ ఫర్నిచర్ షోరూంలో చెలరేగిన మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడుతుండటంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. చీకటి పడినా మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో నాంపల్లి ఎగ్జిబిషన్‌కు రావాలనుకునే సందర్శకులు తమ పర్యటనను వాయిదా వేసుకోవాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. అబిడ్స్ - నాంపల్లి మార్గంలో ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాలని పోలీసులు సూచించారు.

...::: సమగ్ర కథనం 2వ పేజీలో..



### మేడారంలో
# పోటెత్తిన భక్తులు

ములుగు (ఏడీఎన్‌ఎన్) :

ములుగు జిల్లా మేడారం జాతర పరిసరాలు భక్త జన సంద్రంతో నిండిపోయాయి. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా గుర్తింపు పొందిన మేడారం కుంభమేళా ముగియడానికి ఇంకా ఐదు రోజులే ఉండటంతో తెలంగాణ రాష్ట్రంతో పాటు సరిహద్దు రాష్ట్రాల నుంచి భక్తులు భారీగా తరలివస్తున్నారు. సమ్మక్క–సారలమ్మలకు చీర, సారె, ఎత్తు బంగారం సమర్పిస్తూ ముందస్తు మొక్కులు చెల్లించుకుంటున్నారు. వనదేవతల దర్శనం కోసం శనివారం భక్తుల రాకతో మేడారం పరిసరాలు మహాజాతరను తలపించాయి.

...::: తరువాయి 2వ పేజీలో..


# ఏపీలో స్వచ్ఛ రథాలు

### 26 వేల కిలోమీటర్ల మేర 'మ్యాజిక్ డ్రైన్స్' నిర్మాణం



చిత్తూరు (ఏడీఎన్‌ఎన్) :

మురికినీటి సమస్య పరిష్కారానికి రానున్న నాలుగేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 26 వేల కిలోమీటర్ల మేర 'మ్యాజిక్ డ్రైన్స్' నిర్మించనున్నట్లు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఇకపై స్వచ్ఛ రథాల ద్వారా ఇళ్ల వద్దే ఈవేస్ట్ సేకరణకు కూడా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చిత్తూరు జిల్లా నగరిలో శనివారం జరిగిన 'స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వం వదిలివెళ్లిన 105 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను తాము ఏడాదిన్నరలోనే తొలగించామని గుర్తు చేశారు. సింగపూర్ లాంటి నగరాల స్ఫూర్తితో మన రాష్ట్ర పట్టణాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా ప్రభుత్వం పలు వినూత్న ప్రయోగాలు చేస్తోందని సీఎం వెల్లడించారు. ఇందులో భాగంగా ప్లాస్టిక్ వ్యర్థాలతో ఇటుకలను తయారు చేసే ప్రాజెక్టు కోసం మైసూర్ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. ఈ పైలట్ ప్రాజెక్టును చిత్తూరులో ప్రారంభించనున్నామని, దీని ద్వారా వచ్చే ఆదాయాన్ని మెప్మా మహిళా బృందాలకు అందజేస్తామని చెప్పారు. అలాగే, ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను ప్రభుత్వం అత్యంత విజయవంతంగా అమలు చేస్తోందని చంద్రబాబు నాయుడు చేశారు.



### శబరిమల సన్నిధానంలో
# సినిమా షూటింగ్?


తిరువనంతపురం (ఏడీఎన్‌ఎన్) :

ప్రపంచప్రసిద్ధ పుణ్యక్షేత్రం శబరిమల అయ్యప్ప ఆలయంలో నిబంధనలకు విరుద్ధంగా సినిమా చిత్రీకరణ జరిగిందనే వార్త, కేరళలో దావానలంలా వ్యాపించింది. అత్యంత పవిత్రమైన, భద్రతాపరంగా నిషేధిత ప్రాంతమైన సన్నిధానం వద్ద మలయాళ చిత్ర దర్శకుడు అనురాజ్ మనోహర్ వీడియో చిత్రీకరణ చేశారనే ఆరోపణలపై, ట్రావెన్‌కోర్ దేవస్వం బోర్డు (టీడీబీ) విజిలెన్స్ విభాగం అధికారికంగా దర్యాప్తు ప్రారంభించింది. మకరవిళక్కు పండుగ వంటి రద్దీగా ఉండే సమయంలో దర్శకుడు సన్నిధానంలో షూటింగ్ చేశారని దేవస్వం బోర్డుకు ఫిర్యాదు అందింది. "షూటింగ్ కోసం దర్శకుడు ముందే అనుమతి కోరారు, కానీ ఆలయ నిబంధనల ప్రకారం మేము దానిని నిరాకరించాం. కేవలం గుర్తింపు పొందిన మీడియా ప్రతినిధులకు మాత్రమే పరిమిత అనుమతులు ఉంటాయి. సినిమా చిత్రీకరణలకు ఇక్కడ తావు లేదు," అని టీడీబీ ప్రతినిధి స్పష్టం చేశారు. నిబంధనల ఉల్లంఘనపై విచారణ జరుపుతామని టీడీబీ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ సునీల్ కుమార్ చెప్పారు.

...::: తరువాయి 2వ పేజీలో..



### బండి, అరవింద్‌లకు
# లీగల్ నోటీసులు



...::: సమగ్ర కథనం 5వ పేజీలో..



### భార్యను, బంధువులను కాల్చి చంపిన ఎన్ఆర్ఐ
# అమెరికాలో దారుణం

ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్‌ఎన్) :

క్షణికావేశంలో ఒక వ్యక్తి తన భార్యను, బంధువులను హత మార్చాడు. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో ఈ దారుణం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులతో ఘర్షణకు దిగిన నిందితుడు కోపంలో తన వద్ద ఉన్న తుపాకీతో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ కాల్పుల్లో అతని భార్యతో పాటు, మరో ముగ్గురు బంధువులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన సమయంలో ఇంట్లోనే ఉన్న ముగ్గురు చిన్నపిల్లలు, భయకంపితులై బెడ్రూంలోని అల్మారాలో తలదాచుకున్నారు. ఒక చిన్నారి ధైర్యం చేసి హెల్ప్ లైన్ కు ఫోన్ చేయడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. కాల్పులు జరిపిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.


...::: తరువాయి 2వ పేజీలో..



### నాలుగేళ్ల కుమార్తెపై రోకలిబండతో దాడి...
# తండ్రి కాదు కసాయి

ఫరీదాబాద్ (ఏడీఎన్‌ఎన్) :

విద్య నేర్పించాల్సిన తండ్రే కాలయముడిగా మారాడు. కేవలం అంకెలు లెక్కించలేదన్న కోపంతో తన నాలుగేళ్ల కుమార్తెను రోకలిబండతో బాది ప్రాణాలు తీశాడు. మానవత్వాన్ని మంటగలిపే ఈ దారుణ ఘటన హర్యానాలోని ఫరీదాబాద్ జిల్లా ఝార్సెంటలీ గ్రామంలో వెలుగుచూసింది. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన కృష్ణ జైస్వాల్ అనే వ్యక్తి తన కుటుంబంతో కలిసి ఫరీదాబాద్‌లో నివసిస్తూ ఒక ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. అతనికి ఏడేళ్ల కుమారుడు, నాలుగేళ్ల కుమార్తె , రెండేళ్ల కుమార్తె ఉన్నారు. ఈ నెల 21న కృష్ణ జైస్వాల్ తన నాలుగేళ్ల కుమార్తెకు ఇంట్లోనే పాఠాలు చెబుతూ, 1 నుంచి 50 వరకు అంకెలు లెక్కించమని అడిగాడు.



# నాంపల్లిలో భారీ అగ్ని ప్రమాదం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

హైదరాబాద్‌లోని అత్యంత రద్దీ ప్రాంతమైన నాంపల్లిలో శనివారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. స్థానిక 'బచాస్ ఫర్నిచర్ కాజిల్' అనే నాలుగు అంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో భారీ ఆస్తి నష్టం వాటిల్లింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో ప్రారంభమైన అగ్నికీలలు నిమిషాల వ్యవధిలోనే భవనం మొత్తానికి విస్తరించాయి. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే సుమారు 10 ఫైరింజన్లతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. భవనం లోపల దట్టమైన పొగ కమ్ముకోవడంతో పాటు మంటల తీవ్రత ఎక్కువగా ఉండటంతో, సహాయక చర్యల కోసం అధికారులు మొదటిసారిగా అత్యాధునిక రోబోలను రంగంలోకి దించారు. పోలీసులు, హైడ్రా, విపత్తు నిర్వహణ బృందాలు సంయుక్తంగా రెస్క్యూ ఆపరేషన్ చేపట్టాయి. ఈ పెను ప్రమాద సమయంలో భవనంలో నివసించే మూడు కుటుంబాలకు చెందిన ఆరుగురు సభ్యులు లోపలే చిక్కుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ముఖ్యంగా సెల్లార్‌లో ఉండే వాచ్‌మెన్ దంపతులు బయటకు వెళ్లిన సమయంలో ఈ ప్రమాదం జరగగా, వారి కుమారులు అఖిల్ (11), ప్రణీత్ (7) ఆచూకీ ఇంకా తెలియాల్సి ఉంది. భవనం లోపల గాలిలో దట్టమైన పొగ అలుముకోవడంతో లోపలికి వెళ్లడం రెస్క్యూ సిబ్బందికి పెద్ద సవాలుగా మారింది. ఎవరికైనా గాయాలైతే తక్షణ చికిత్స అందించేందుకు వీలుగా ఘటనా స్థలిలో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, అగ్నిమాపక శాఖ డీజీ ఘటనా స్థలాన్ని సందర్శించి సహాయక చర్యలను స్వయంగా పర్యవేక్షించారు. మంటలు అదుపులోకి వచ్చినప్పటికీ, లోపల పేరుకుపోయిన పొగ వల్ల రెస్క్యూ టీమ్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని సీపీ తెలిపారు. ఈ ప్రమాదం కారణంగా నాంపల్లి స్టేషన్ రోడ్‌లో ట్రాఫిక్ నిలిచిపోవడంతో వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించారు. అగ్నిప్రమాదం మరియు ట్రాఫిక్ ఇబ్బందుల దృష్ట్యా ప్రజలు శనివారం నుమాయిష్ (ఎగ్జిబిషన్) సందర్శనను వాయిదా వేసుకోవాలని సీపీ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## నిష్పక్షపాతంగా విచారణ జరిపిస్తానంటే... నేను రెడీ

మొదటిపేజీ తరువాయి....
సింగరేణి టెండర్ల విషయం లో మాజీ మంత్రి హరీశ్ రావు ఒప్పుకుంటే సిట్ విచారణ కు సిద్ధమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన సవాల్ కు కౌంటర్ గా హరీశ్ ఈ వ్యాఖ్యలు చేశారు . అసలు అవినీతే జరగనప్పుడు నైనీ బొగ్గు గని టెండర్లను ప్రభుత్వం ఎందుకు రద్దు చేసిందో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో బొగ్గు కుంభకోణం జరగడం పచ్చి నిజమని, ఇందులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బావమరిది 'రింగ్ మెన్'గా కీలక పాత్ర పోషించారని హరీశ్ రావు ఆరోపించారు. భట్టి విక్రమార్క తన ప్రెస్ మీట్ లో అసలు విషయాన్ని పక్కన పెట్టి సాకులు చెబుతున్నారని విమర్శించారు. నైనీ టెండర్లను రద్దు చేసిన ప్రభుత్వం, తాను బయటపెట్టిన సోలార్ పవర్ స్కామ్ గురించి ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన నిలదీశారు. నైనీ తరహాలోనే మిగతా అన్ని అనుమానాస్పద టెండర్లను కూడా రద్దు చేయాలని కోరారు. టెండర్లలోని 'సైట్ విజిట్ సర్టిఫికేట్' నిబంధనను బీఆర్ఎస్ ప్రభుత్వంపైకి నెట్టేయడం వల్ల నిజాలు అబద్ధాలు కావని హరీశ్ రావు స్పష్టం చేశారు. ఒకవేళ ఆ నిబంధన తప్పు కాకపోతే, నైనీ టెండర్లను ఎందుకు రద్దు చేశారని ప్రశ్నించారు. సైట్ విజిట్ విధానం అమలు కావడం, ఇప్పుడు నైనీ రద్దు కావడం అంటేనే అక్కడ స్కాం జరిగిందని చెప్పడానికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తులపై విచారణ జరగాలంటే సిట్టింగ్ జడ్జి లేదా సీబీఐతోనే సాధ్యమన్న ఉద్దేశంతో తాను లేఖ రాశానని హరీశ్ రావు వివరించారు

# మేడారంలో పోటెత్తిన భక్తులు

మొదటిపేజీ తరువాయి...
ఈనెల 28 నుంచి 31 వరకు మహాజాతరలో జరిగే ముందస్తు మొక్కులు చెల్లించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున మేడారం చేరుకుంటున్నారు. ప్రధాన కూడళ్లు, గద్దెలు, జంపన్నవాగు స్నాన ఘట్టాలు, తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు, ఆర్టీసీ బస్టాండ్, పార్కింగ్ స్థలాలు, అటవీ ప్రాంతాల్లోని విడిది కేంద్రాలు భక్తజనంతో నిండిపోయాయి. లక్షలాదిగా తరలివచ్చిన జనంతో మేడారం భక్తజన గుడారంగా మారింది. ఇవాళ ఒక్కరోజే 3 లక్షల మందికి పైగా భక్తులు ప్రైవేటు, ఆర్టీసీ వాహనాల్లో మేడారం తరలివచ్చారు. దీంతో రోడ్లపై వాహనాలు బారులు తీరాయి. సమ్మక్క, సారలమ్మలకు మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చిన భక్తులతో మేడారం పరిసరాలన్నీ జనసంద్రంగా మారాయి. వనదేవతలకు మొక్కులు చెల్లించే ముందు భక్తులు జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించారు. అధికారులు ఏర్పాటు చేసిన క్యూలైన్లలో భక్తులు ఎత్తు బంగారం (బెల్లం) నెత్తిన మోస్తూ కాలినడకన తల్లుల గద్దెలకు చేరుకున్నారు. చీరె, సారె, పసుపు, కుంకుమ, పూలు, పండ్లు, కొబ్బరికాయలు, ఒడిబియ్యం సమర్పించి "తల్లీ సల్లంగా చూడు.. మళ్లీ మహాజాతరకు వస్తాం" అంటూ వేడుకున్నారు. మేడారం వైపు వేలాది వాహనాలు రావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తాయి. భక్తుల రద్దీ దృష్ట్యా ములుగు జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. వస్రా, తాడ్వాయి పాయింట్ల వద్ద అదనపు బలగాలను మోహరించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తాగునీరు, మరుగుదొడ్లు, క్యూలైన్ల పర్యవేక్షణ, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. జాతర విజయవంతంగా సాగేందుకు భక్తులు సహకరించాలని ఆలయ సిబ్బంది కోరుతున్నారు.

# శబరిమల సన్నిధానంలో సినిమా షూటింగ్?

మొదటిపేజీ తరువాయి...
తనపై వస్తున్న ఆరోపణలపై దర్శకుడు అనురాజ్ మనోహర్ స్పందించారు. తాను సన్నిధానం వద్ద ఎలాంటి షూటింగ్ చేయలేదని ఆయన వివరణ ఇచ్చారు. "షూటింగ్ కోసం అనుమతి అడిగిన మాట నిజమే, కానీ బోర్డు నిరాకరించడంతో నేను వెనక్కి తగ్గాను. కేవలం పంబ నది వద్ద మాత్రమే వీడియో చిత్రీకరించాను తప్ప, సన్నిధానం వద్ద కాదు," అని ఆయన పేర్కొన్నారు. అయితే విజిలెన్స్ అధికారులు మాత్రం ఆయన ఎక్కడెక్కడ చిత్రీకరణ చేశారనే అంశంపై ఆధారాలు సేకరిస్తున్నారు. శబరిమల ఆలయ పవిత్రతను కాపాడేందుకు సన్నిధానం పరిసరాల్లో ముందస్తు అనుమతి లేకుండా వీడియోలు తీయడం చట్టరీత్యా నేరం. భద్రతా కారణాల దృష్ట్యా కూడా అక్కడ కఠిన ఆంక్షలు అమలులో ఉన్నాయి. సన్నిధానం వంటి పవిత్ర ప్రదేశంలో సినిమా షూటింగ్ వార్తలు రావడంతో అయ్యప్ప భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే సదరు దర్శకుడిపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# సింగరేణిపై సిట్ వేస్తా



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

సింగరేణి టెండర్ల విషయం లో మాజీ మంత్రి హరీశ్ రావు ఒప్పుకుంటే సిట్ విచారణకు సిద్ధమని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సవాల్ విసిరారు. సింగరేణి సంస్థను అడ్డుపెట్టుకుని ప్రభుత్వంపై, వ్యక్తిగతంగా తనపై వస్తున్న ఆరోపణలను భట్టి విక్రమార్క తిప్పికొట్టారు. ప్రజాభవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన ఏబీఎన్ రాధాకృష్ణ, బీఆర్ఎస్ నేత హరీశ్ రావులను లక్ష్యంగా చేసుకుని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సింగరేణి టెండర్లలో అక్రమాలకు తావులేదని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. అనుమానాలుంటే విచారణకు సిద్ధమని ప్రతిపక్షాలకు బంపర్ ఆఫర్ ఇచ్చారు. మాజీ మంత్రి హరీశ్ రావు కేవలం ఒక లేఖ రాస్తే చాలు, 2014 నుంచి సింగరేణిలో జరిగిన అన్ని టెండర్లపై సిట్టింగ్ జడ్జి లేదా సిట్ తో విచారణ జరిపిస్తామని సంచలన సవాల్ విసిరారు. ఏబీఎన్ రాధాకృష్ణ తన ఎడిటోరియల్ 'కొత్తపలుకు'లో రాసినవన్నీ కట్టుకథలేనని భట్టి మండిపడ్డారు. "రాధాకృష్ణ ఎవరి ప్రయోజనాల కోసం ఈ కథనాలు రాస్తున్నారో అందరికీ తెలుసు. కనీస ఇంగితజ్ఞానం లేకుండా, సింగరేణి స్వతంత్ర ప్రతిపత్తిని విస్మరించి రాసిన ఈ కథనాలు సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా ఉన్నాయి. నా 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నో ఆశయాలతో పనిచేశా.. ఇలాంటి చిల్లర పనుల కోసం రాజకీయాల్లోకి రాలేదు" అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు కథనాలకు క్షమాపణ చెప్పకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగరేణి టెండర్లలో 'సైట్ విజిట్' నిబంధన కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదని భట్టి స్పష్టం చేశారు. 2018 లోనే కేంద్ర ప్రభుత్వం, 2021లో కోల్ ఇండియా ఈ నిబంధనను తప్పనిసరి చేశాయని, మహారాష్ట్ర సహా ఇతర రాష్ట్రాలు, ఎన్ఎండీసీ వంటి సంస్థలు ఇదే పద్ధతిని పాటిస్తున్నాయని ఆధారాలతో సహా వివరించారు. తాము పాత పద్ధతినే కొనసాగిస్తున్నామని వెల్లడించారు. నైనీ కోల్ బ్లాక్ టెండర్లను సీఎం రేవంత్ రెడ్డి బావమరిది సృజన్ రెడ్డికి కట్టబెడుతున్నారన్న ఆరోపణలను భట్టి కొట్టిపారేశారు. "నైనీలో 25 టెండర్లలో 20 బీఆర్ఎస్ హయాంలోనే పిలిచారు. అసలు సృజన్ రెడ్డి భార్య దీప్తి రెడ్డి.. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి కుమార్తె కాదా? బీఆర్ఎస్ నాయకుడి అల్లుడిని సీఎంతో ముడిపెట్టి బురద చల్లడం ఏంటి?" అని ప్రతిపక్షాలను ప్రశ్నించారు. సింగరేణి ఆస్తులపై రాబందులు వాలనివ్వబోనని భట్టి విక్రమార్క ప్రతిజ్ఞ చేశారు. హరీశ్ రావుకు సూటిగా సవాల్ విసిరారు. హరీశ్ రావు సీనియర్ మంత్రిగా చేశారని, ఆయనకు ఏం కావాలో చెప్తే, 2014 నుంచి జరిగిన అన్ని టెండర్లపై, ముఖ్యంగా తాడిచర్ల ఓబీ కాంట్రాక్టుపై విచారణ జరిపిస్తామని భట్టి అన్నారు. కిషన్ రెడ్డి కోరినా విచారణకు సిద్ధమేనని భట్టి విక్రమార్క తేల్చిచెప్పారు.



# బిహార్‌లో కాంగ్రెస్ పట్టు బిగించేనా?

పాట్నా (ఏడీఎన్ఎన్) :

బిహార్లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితిపై రాజ్యసభ ఎంపీ రంజీత్ రంజన్ చేసిన వ్యాఖ్యలు పార్టీ హైకమాండ్‌ను గందరగోళంలో పడేసింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పరిస్థితి బాగోలేదని ఆమె చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో, అగ్రనేత రాహుల్ గాంధీ సమక్షంలో న్యూఢిల్లీలో శుక్రవారం ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు. బిహార్లో పార్టీ బలహీనతకు అక్కడి నాయకత్వమే ప్రధాన కారణమని రాహుల్ అభిప్రాయపడినట్లు పార్టీ అంతర్గత వర్గాలు తెలిపాయి. పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర స్థాయి నాయకులదేనని, కీలక విషయాలను ఆలస్యంగా హైకమాండ్ దృష్టికి తీసుకురావడం సరికాదని ఆయన వ్యాఖ్యానించారు. ఇకపై క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని కూడా హైకమాండ్ సూచించింది. గత నవంబర్‌లో జరిగిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ ఘన విజయం సాధించింది. అదే సమయంలో గెలిచిన ఆరుగురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అధికార కూటమిలో చేరిపోతారన్న ప్రచారం ఊపందుకుంది. ఈ పరిణామాల నేపథ్యంలోనే కాంగ్రెస్ హైకమాండ్ అత్యవసరంగా రాష్ట్ర నాయకత్వాన్ని ఢిల్లీకి పిలిపించి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నేరుగా ఆరుగురు ఎమ్మెల్యేలను ప్రశ్నించినట్లు సమాచారం. పార్టీని వీడే ఆలోచనలో ఉన్నారా? అని అడగ్గా... వారంతా "కాంగ్రెస్‌లోనే కొనసాగుతాం" అని స్పష్టంగా హామీ ఇచ్చారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యేలు పార్టీ మారతారన్న ప్రచారం కేవలం మీడియా సృష్టేనని ఖర్గే వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. గత ఏడాది రాహుల్ గాంధీ బిహార్లో నిర్వహించిన హైవోల్టేజ్ 'ఓటరు అధికార్ యాత్ర'కు ప్రజల నుంచి అనూహ్య స్పందన వచ్చినప్పటికీ, ఎన్నికల ఫలితాల్లో ఆ ప్రభావం కనిపించకపోవడం హైకమాండ్‌ను నిరాశకు గురిచేసింది. యాత్రకు వచ్చిన స్పందన ఫలితాలుగా మారకపోవడం పార్టీ నేతలను ఆత్మపరిశీలనలో పడేసింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో బిహార్లో వేలాది మంది ఓటర్ల పేర్లు తొలగించారని, దీనివెనుక కేంద్రంలోని బీజేపీ పాత్ర ఉందని కాంగ్రెస్ అప్పట్లో ఆరోపించింది. ఎన్నికల కమిషన్‌పైనా విమర్శలు చేసింది. అయితే ఈ అంశాలన్నీ ఇప్పుడు రాజకీయంగా ప్రాధాన్యత కోల్పోయినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. బిహార్లో పార్టీ బలహీనతకు అక్కడి నాయకత్వమే బాధ్యత వహించాలని రంజీత్ రంజన్‌కు హైకమాండ్ సూచించినట్లు సమాచారం. గత ఎన్నికల్లో కాంగ్రెస్ ఘోర పరాజయం పాలైన విషయం తెలిసిందే. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేష్ రామ్ కూడా 2015, 2020లో గెలిచిన తన సొంత నియోజకవర్గంలో ఈసారి ఓటమి చవిచూశారు. ఈ కీలక సమావేశంలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (సంస్థ) కేసీ వేణుగోపాల్, రాజేష్ రామ్ పాల్గొన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలపై మీడియా సంప్రదించగా రంజీత్ రంజన్ స్పందించేందుకు నిరాకరించారు. ఇది పార్టీ అంతర్గత వ్యవహారమని మాత్రమే చెప్పారు. బిహార్ అసెంబ్లీలో కాంగ్రెస్ శాసనసభా పక్షం నాయకుడి ఎంపిక అంశం కూడా సమావేశంలో చర్చకు వచ్చింది. ఈ పదవి చాలా కాలంగా ఖాళీగానే ఉంది. నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడమే కారణమని తెలుస్తోంది. ఫిబ్రవరి 2న ప్రారంభం కానున్న బడ్జెట్ సమావేశాలకు ముందే సీఎల్పీ నేతను ప్రకటించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. రాష్ట్రంలో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేయడంతో పాటు ప్రజా సమస్యలపై గట్టిగా పోరాడాలని హైకమాండ్ ఆదేశించినట్లు సమాచారం. నితీష్ కుమార్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, వెనుకబడిన వర్గాలతో పాటు అగ్రవర్ణ కులాలను కూడా కలుపుకుని వెళ్లే రాజకీయ వ్యూహం అవలంబించాలని పార్టీ నేతలు సూచించినట్లు తెలుస్తోంది.

# కర్ణాటకలో బీజేపీ ఎమ్మెల్యే గాలి ఇంటికి నిప్పు





పాట్నా (ఏడీఎన్ఎన్) :

కర్ణాటకలో సంచలన సంఘటన చోటుచేసుకుంది. బీజేపీ ఎమ్మెల్యే గాలి జనార్ధన్ రెడ్డికి చెందిన బళ్లారిలోని మోడల్ హౌస్‌కు దుండగులు నిప్పు పెట్టారు. సంఘటన సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇది రాజకీయ కక్షసాధింపు చర్యేనని, కాంగ్రెస్ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి వర్గీయులే దీని వెనుక ఉన్నారని గాలి జనార్ధన్ రెడ్డి సోదరుడు, మాజీ మంత్రి సోమశేఖర రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఘటనతో బళ్లారి రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. బళ్లారి నగరంలోని కంటోన్మెంట్ పరిధిలోని 'జీ స్క్వేర్ లేఅవుట్'లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇక్కడ గాలి జనార్ధన్ రెడ్డికి చెందిన మోడల్ హౌస్ ఉంది. సుమారు 109 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ నివాస స్థలం గాలి జనార్ధన్ రెడ్డి, శ్రీరాములు పేర్లపై రిజిస్టర్ అయి ఉంది. సుమారు 13-14 ఏళ్ల క్రితం కొనుగోలుదారులను ఆకర్షించేందుకు ఈ మోడల్ హౌస్‌ను నిర్మించారు. ప్రస్తుతం దీని విలువ రూ.3 కోట్లకు పైగానే ఉంటుందని సమాచారం. శుక్రవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో దుండగులు భవనానికి నిప్పు పెట్టినట్లు పోలీసులు నిర్ధారించారు. ఈ ఏడాది ప్రారంభం నుంచే గాలి జనార్ధన్ రెడ్డి తరచూ వార్తల్లో నిలుస్తున్నారు. జనవరి 1న ఆయన ఇంటి వద్ద కాంగ్రెస్ ఎమ్మెల్యే నారా భరత్ రెడ్డి వర్గీయులు కాల్పులకు పాల్పడ్డారన్న ఆరోపణలపై విచారణ కొనసాగుతోంది. ఆ వ్యవహారం సద్దుమణగకముందే ఇప్పుడు ఇంటికి నిప్పు పెట్టడం రాజకీయంగా సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై స్పందించిన సోమశేఖర రెడ్డి.. భవనంపై పెట్రోల్, డీజిల్ పోసి కావాలనే నిప్పు పెట్టారని ఆరోపించారు. దీని వెనుక నారా భరత్ రెడ్డి మద్దతుదారుల ప్రమేయం ఉందని అన్నారు. సమాచారం అందిన వెంటనే సీనియర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పోలీసుల వివరాల ప్రకారం ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో గాలి జనార్ధన్ రెడ్డి బెంగళూరులో ఉన్నారు. ఆయన స్పందిస్తూ, బ్యానర్ల వివాదం జరిగిన కొద్ది రోజులకే అగ్నిప్రమాదం జరగడం అనుమానాలకు తావిస్తోందన్నారు. బళ్లారి ఎస్పీతో మాట్లాడినట్లు, బాధ్యులను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఘటన బళ్లారిలో కొనసాగుతున్న రాజకీయ వైరాన్ని మరింత ముదిరేలా చేసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# మయన్మార్ లో బందీలుగా హైదరాబాదీలు






ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :

థాయిలాండ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నమ్మించి 16 మంది భారతీయులను మయన్మార్-థాయిలాండ్ సరిహద్దుకు తరలించి బానిసలుగా మార్చిన అమానుష ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ బాధితులలో హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు యువకులు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. బాధితులను మయన్మార్ సరిహద్దులోని ఒక రహస్య ప్రాంతానికి తరలించిన ముఠా, వారిని కనీస మానవత్వం లేకుండా బానిసలుగా మార్చి వెట్టిచాకిరీ చేయిస్తోంది. రోజుకు 18 నుంచి 20 గంటల పాటు బలవంతంగా పని చేయిస్తూ నరకయాతన పెడుతున్నట్లు సమాచారం అందుతోంది. ప్రస్తుతం మయన్మార్ సరిహద్దులో బందీగా ఉన్న హైదరాబాద్ చదర్‌ఘాట్ ఉస్మాన్‌నగర్‌కు చెందిన మిర్ సజ్జాద్ అలీ ఈ దారుణ పరిస్థితులను వివరించారు. ఆయనతో పాటు మౌలాలి, బంజారా హిల్స్ ప్రాంతాలకు చెందిన మరో ఇద్దరు కూడా అక్కడ చిక్కుకుపోయారు. బాధితుల నుంచి పాస్‌పోర్టులు, మొబైల్ ఫోన్లను లాక్కున్న ముఠా సభ్యులు, వారికి కనీస వైద్య సదుపాయాలు కూడా అందనీయడం లేదని తెలుస్తోంది. ఎవరైనా మాట వినకపోతే లేదా పని చేయడానికి నిరాకరిస్తే శారీరకంగా తీవ్రంగా హింసిస్తూ భయోత్పాతానికి గురిచేస్తున్నారని బాధితులు వాపోతున్నారు. తమ కుమారుడు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాడని, ఎలాగైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి అతడిని సురక్షితంగా వెనక్కి తీసుకురావాలని మిర్ సజ్జాద్ అలీ తల్లి అధికారులను కన్నీళ్లతో వేడుకుంటున్నారు. విదేశీ ఉద్యోగాల పేరిట అమాయకులను బలితీసుకుంటున్న ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని, అంతర్జాతీయ స్థాయిలో దౌత్యపరమైన చర్చలు జరిపి బాధితులను విడిపించాలని బాధితుల కుటుంబ సభ్యులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ ఘటనతో బాధితుల ఇళ్లల్లో విషాద ఛాయలు అలముకున్నాయి.

# తండ్రి కాదు కసాయి

మొదటిపేజీ తరువాయి...
ఆ చిన్నారి అంకెలు సరిగ్గా చెప్పలేకపోయేసరికి నిందితుడు విచక్షణ కోల్పోయి ఊగిపోయాడు. ఇంట్లోని రోకలిబండను తీసుకుని చిన్నారిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తండ్రి దాడిలో తీవ్రంగా గాయపడిన చిన్నారి స్పృహ కోల్పోవడంతో, కృష్ణ జైస్వాల్ ఆమెను ఆస్పత్రికి తరలించాడు. అయితే అప్పటికే పాప మరణించినట్లు వైద్యులు నిర్ధారించారు. తన నేరాన్ని దాచేందుకు నిందితుడు భార్యకు ఫోన్ చేసి.. పాప ఆడుకుంటూ మెట్ల మీద నుంచి కింద పడిపోయిందని అబద్ధం చెప్పాడు. కానీ, ఆస్పత్రికి చేరుకున్న తల్లి పాప శరీరంపై ఉన్న తీవ్రమైన గాయాలను చూసి అనుమానం వ్యక్తం చేసింది. ఆమె వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు నిజం బయటపడింది. పోలీసుల విచారణలో కృష్ణ జైస్వాల్ తన క్రూరత్వాన్ని అంగీకరించాడు. పాప ఇంకా స్కూల్‌కు వెళ్లడం లేదని, తానే చదువు నేర్పిస్తున్నానని, కానీ అంకెలు చెప్పకపోవడంతో కోపం వచ్చి కొట్టానని వాంగ్మూలం ఇచ్చాడు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి హత్య కేసు నమోదు చేశారు. కేవలం చిన్న కారణంతో కన్న కూతురినే పొట్టనబెట్టుకున్న ఈ కసాయి తండ్రి ఉదంతం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది.



# ముంబైని మింగాలనుకోవద్దు

ముంబై (ఏడీఎన్ఎన్) :

తమ పార్టీ ఉనికిని లేకుండా చేయాలనే బీజేపీ నేతల ఆలోచన కేవలం భ్రమేనని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రే సంచలన వ్యాఖ్యలు చేశారు. "శివసేన (యూబీటీ) ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు, అది ఒక ఆలోచన" అని ఆయన స్పష్టం చేశారు. మహారాష్ట్ర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఎదురైన పరాజయం తర్వాత ఆయన మాట్లాడారు. అవిభక్త శివసేన వ్యవస్థాపకుడు, తన తండ్రి బాల్ ఠాక్రే శత జయంతి ఉత్సవాల సందర్భంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి ఉద్ధవ్ ఈ వ్యాఖ్యలు చేశారు. థాక్రే పేరును చరిత్ర నుంచి చెరిపివేయాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, ఆ పేరు ఎప్పటికీ నిలిచిపోతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. శివసేన లేకపోతే బీజేపీ బీఎంసీ గడప కూడా దాటేది కాదన్నారు. ఉద్ధవ్ ప్రసంగానికి ముందు మహారాష్ట్ర నవనిర్మాణ సేన (ఎంఎన్ఎస్) చీఫ్ రాజ్ ఠాక్రే మాట్లాడారు. ప్రస్తుత మహారాష్ట్ర రాజకీయాలను "బానిసల మార్కెట్"తో పోల్చిన ఆయన.. కళ్యాణ్-డోంబివ్లి మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు రాష్ట్రంలోని పౌర సంస్థల ఎన్నికలను "వేలం"గా అభివర్ణించారు. జనవరి 15న జరిగిన బీఎంసీ ఎన్నికల్లో మొత్తం 227 స్థానాలున్న సభలో బీజేపీ 89 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన (29 సీట్లు)తో కలిసి బీజేపీ, బీఎంసీపై థాక్రే కుటుంబానికి ఉన్న దశాబ్దాల ఆధిపత్యానికి ముగింపు పలికింది. అయితే ఈ ఎన్నికల్లో శివసేన (యూబీటీ)-ఎంఎన్ఎస్ కూటమి ఊహించినదానికంటే గట్టి పోటీ ఇచ్చిందని ఉద్ధవ్ తెలిపారు. శివసేన (యూబీటీ) 65 సీట్లు, ఎంఎన్ఎస్ 6 సీట్లు గెలుచుకున్నట్లు గుర్తు చేశారు. 'వారు ముంబైని మింగాలనుకుంటున్నారు' అంటూ ఉద్ధవ్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ ఎన్నికల్లో తొలిసారి ధనబలాన్ని విపరీతంగా ఉపయోగించారని విమర్శించారు. ఫలితాలు అనుకూలంగా లేకపోయినా, బీఎంసీలో బలమైన ప్రతిపక్షంగా శివసేన కొనసాగుతుందని స్పష్టం చేశారు. సేన అధికారం కోసం కాదు.. మరాఠాల హక్కుల కోసం పుట్టిందని గుర్తు చేశారు. మహారాష్ట్రపై మరాఠీయేతర సంస్కృతిని రుద్దే ప్రయత్నాలు జరుగుతున్నాయని, పాఠశాలల్లో హిందీని తప్పనిసరి చేయాలనే నిర్ణయమూ అదే కుట్రలో భాగమని ఆరోపించారు. "జై మహారాష్ట్ర" నినాదాన్ని ప్రతి ఒక్కరూ గర్వంగా ఉపయోగించాలని ఉద్ధవ్ పిలుపునిచ్చారు.

# ఎనిమిది వేల విమానాలు రద్దు!

మొదటిపేజీ తరువాయి...
ఆర్కిటిక్ ప్రాంతం నుంచి దూసుకొస్తున్న పోలార్ వోర్టెక్స్ ప్రభావంతో అతిశీతల గాలులు శక్తివంతమైన తుపానుగా మారాయి. దీంతో దేశ తూర్పు ప్రాంతమంతా భారీ హిమపాతం, గడ్డకట్టే వర్షం, స్లీట్ తో అల్లకల్లోలంగా మారింది. సదరన్ ప్లెయిన్స్, లోయర్ మిసిసిపీ వ్యాలీ, టెన్నెస్సీ వ్యాలీ, ఆగ్నేయ రాష్ట్రాల్లో 'విపత్తు స్థాయి'లో మంచు పేరుకుపోయే ప్రమాదముందని జాతీయ వాతావరణ శాఖ హెచ్చరించింది. ఇది అత్యంత తీవ్రమైన తుపాను అని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. మంచు తుపాను కారణంగా జనజీవనం పూర్తిగా స్తంభించింది. గడ్డకట్టే వర్షంతో విద్యుత్ తీగలపై మందపాటి మంచు పేరుకుపోయే ప్రమాదం ఉంది. టెక్సాస్‌లో ఇప్పటికే 20 వేల మంది విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు ఫీమా సహాయక బృందాలు, నేషనల్ గార్డ్ దళాలను మోహరించారు. ఈ తుపాను సోమవారం వరకు కొనసాగుతుందని, అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.



# ...అమెరికాలో దారుణం

మొదటిపేజీ తరువాయి...
పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం ,జార్జియాలోని లారెన్స్ విల్లే పట్టణంలోని బ్రూక్ ఐవీ కోర్ట్ నివాసంలో అమెరికా కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో ఒక్కసారిగా తుపాకీ కాల్పుల శబ్దాలు వినిపించాయి. విజయ్‌కుమార్ (51) కుటుంబ తగాదాల నేపథ్యంలో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు తేలింది. ఆవేశంలో అతడు తన భార్య మీను డోగ్రా (43)తో పాటు బంధువులు గౌరవ్‌కుమార్ (33), నిధి చందర్ (33), ఆమె భర్త హరీష్ చందర్ (38)పై కాల్పులు జరిపినట్లు వెల్లడైంది. ఈ ఘటనపై అట్లాంటాలోని భారత కాన్సులేట్ జనరల్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. బాధిత కుటుంబ సభ్యులతో సంప్రదింపుల్లో ఉన్నామని, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన సహాయం అందిస్తున్నామని తెలిపింది. మృతదేహాలను భారత్‌కు తరలించే అంశంపై ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం.

సంక్షేమ
మనసర్కార్
Follow: manasarkar





## బ్రిటన్ రాజకీయాల్లో వేడెక్కిన 'మాంచెస్టర్'

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

గ్రేటర్ మాంచెస్టర్ మేయర్ ఆండీ బర్న్‌హామ్ రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు బ్రిటన్ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గోర్టన్ , డెంటన్ ని యోజకవర్గానికి జరగనున్న ఉపఎన్నికలో ఆయన పోటీ చేస్తారా లేదా అనే విషయంపై ఆయన తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఒకవేళ ఆయన ఈ పార్లమెంటు స్థానం నుంచి గెలిస్తే, భవిష్యత్తులో లేబర్ పార్టీ నాయకత్వం కోసం ప్రస్తుత ప్రధాని కైర్ స్టార్మర్‌కు బలమైన సవాలు విసిరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే, ఆయన పోటీ చేయాలంటే లేబర్ పార్టీకి చెందిన నేషనల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ అనుమతి తప్పనిసరి తీసుకోవాలి. ప్రధాని స్టార్మర్ అనుచరులు కొందరు ఈ కమిటీ ద్వారా బర్న్ హామ్‌ను అడ్డుకోవాలని చూస్తున్నట్లు సమాచారం.ఒకవేళ ఆయన మేయర్ పదవికి రాజీనామా చేసి ఎంపీగా పోటీ చేస్తే, మళ్ళీ మేయర్ ఎన్నిక నిర్వహించడానికి దాదాపు 4.7 మిలియన్ల (సుమారు రూ. 50 కోట్లు) ప్రజా ధనం ఖర్చవుతుందని, ఇది పార్టీకి , ప్రభుత్వానికి భారమని వ్యతిరేక వర్గం వాదిస్తోంది.మరోవైపు బర్న్ హామ్‌కు పార్టీలో మద్దతు కూడా గట్టిగానే లభిస్తోంది. లండన్ మేయర్ సాదిక్ ఖాన్ మాట్లాడుతూ, ఆండీ బర్న్ హామ్ పార్లమెంటు సభ్యుడు కావాలనుకుంటే ఆయనను అనుమతించాలని, ప్రతిభ ఉన్నవారందరూ జట్టులో ఉండాలని మద్దతు పలికారు. మాజీ ఉప ప్రధాని ఏంజెలా రేనర్ కూడా బర్న్ హామ్ దరఖాస్తును అడ్డుకోవద్దని కమిటీని కోరనున్నట్లు తెలుస్తోంది. ఉప నాయకురాలు లూసీ పావెల్ సైతం ఆయనను "అత్యంత ప్రజాదరణ ఉన్న నాయకుడు" అని అభివర్ణించడమే కాకుండా, పార్టీకి మేలు చేసే ఉత్తమ అభ్యర్థిని ఎంపిక చేయాలని సూచించారు. మే నెలలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో లేబర్ పార్టీకి ఆశించిన ఫలితాలు రాకపోతే, స్టార్మర్ నాయకత్వానికి ముప్పు వాటిల్లే అవకాశం ఉందన్న ఊహాగానాల నేపథ్యంలో, ఈ ఉపఎన్నిక ప్రాధాన్యత సంతరించుకుంది.ఈ ఉత్కంఠకు తెరదించుతూ ఎన్ఈసీ కమిటీ ఆదివారం నాడు బర్న్ హామ్‌కు తన నిర్ణయాన్ని వెల్లడిస్తుంది. ఆదివారం అర్ధరాత్రిలోపు అభ్యర్థుల దరఖాస్తులకు గడువు ముగియనుంది. ఒకవేళ బర్న్ హామ్‌ను పోటీకి అనుమతించకుండా అడ్డుకుంటే, పార్టీలో అంతర్గత పోరు మొదలై ప్రధాని స్టార్మర్ ప్రతిష్టకు భారీ నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని సీనియర్ నాయకుడు జాన్ మెక్‌డొన్నెల్ హెచ్చరించారు. గోర్టన్ , డెంటన్ స్థానం లేబర్ పార్టీకి కంచుకోట వంటిది కావడంతో, అక్కడ అభ్యర్థి ఎవరన్నది ఇప్పుడు దేశవ్యాప్త చర్చకు దారితీసింది.



## పెళ్లింట ఆత్మాహుతి దాడి.. పదిమంది మృతి

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

దాయాది దేశం పాకిస్తాన్‌లో సంచలన ఘటన చోటు చేసుకుంది. వివాహ వేడుక నడుస్తుండగానే ఆత్మాహుతి బాంబు దాడి జరగడం తీవ్ర కలకలం రేపింది. ఈ దాడిలో పది మంది మృతి చెందగా, మరో 25 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రభుత్వానికి మద్దతిచ్చే కమ్యూనిటీ నాయకుడి ఇంట్లో ఈ దారుణం జరగడం దేశవ్యాప్తంగా షాక్‌కు గురిచేసింది. ఘటన నేపథ్యంలో పాకిస్తాన్‌లో హై అలర్ట్ ప్రకటించారు. పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్ లో శుక్రవారం ఈ ఘటన చోటు చేసుకుంది. దెరా ఇస్మాయిల్ ఖాన్ జిల్లాలోని ప్రభుత్వ అనుకూల కమ్యూనిటీ నాయకుడు నూర్ ఆలం మెహసూద్ ఇంట్లో వివాహ వేడుక జరుగుతోంది. ఈ వేడుకలో బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అతిథులు డాన్స్ చేస్తుండగా ఓ ఆత్మాహుతి బాంబర్ అకస్మాత్తుగా తన ఒంటిపై ఉన్న బాంబును పేల్చుకున్నాడు. శక్తివంతమైన పేలుడు ధాటికి ఇంటి పైకప్పు కూలిపోయింది. దీంతో అక్కడున్న వారంతా భయాందోళనకు గురయ్యారు. శిథిలాల కింద పలువురు చిక్కుకుపోవడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మృతుల్లో 'గుడ్ తాలిబ్'గా పిలిచే వ్యక్తి కూడా ఉన్నాడని అధికారులు తెలిపారు. గుడ్ తాలిబ్ అంటే ప్రభుత్వానికి లొంగిపోయిన మాజీ మిలిటెంట్ అని అర్థం. మిగతా మృతులంతా అతని బంధువులేనని పోలీసులు వెల్లడించారు. పేలుడులో గాయపడిన వారిని వెంటనే సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎవరైనా ఈ దాడికి సహకరించారా అనే కోణంలో గాలింపు చర్యలు చేపట్టారు. ఈ దాడికి ఇప్పటివరకు ఏ ఉగ్రసంస్థ బాధ్యత వహించలేదు. అయితే నిషేధిత ఉగ్రవాద సంస్థ తెహ్రీక్‌ఎతాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) హిట్ లిస్ట్ లో బాధితులు ఉన్నట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి. గతంలోనూ టీటీపీ ఇలాంటి దాడులకు పాల్పడిన నేపథ్యంలో ఈ ఘటన వెనుక అదే సంస్థ ఉండవచ్చని అనుమానిస్తున్నారు. ఖైబర్ పఖ్తుంఖ్వా రెస్క్యూ విభాగం ప్రతినిధి మాట్లాడుతూ.. సమాచారం అందగానే సహాయక బృందాలు రంగంలోకి దిగాయని, గాయపడిన వారికి చికిత్స అందిస్తున్నామని తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


## ఉక్రెయిన్‌పై మరోసారి దాడి

**మొదటిపేజీ తరువాయి...**

మరోవైపు దావోస్ సదస్సులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జెలెన్‌స్కీ భేటీ అయ్యారు. ఈ భేటీ తర్వాత ట్రంప్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మూడేళ్లకుపైగా కొనసాగుతున్న ఈ యుద్ధం త్వరగా ముగియాలని ఆకాంక్షించారు. ఈ యుద్ధంలో వేలాది మంది ప్రాణాలు కోల్పోయారని పేర్కొంటూ, శాంతియుత పరిష్కారం అవసరమని ఆయన స్పష్టం చేశారు. రష్యా-ఉక్రెయిన్ మధ్య మూడేళ్లకు పైగా భీకర యుద్ధం కొనసాగుతూనే ఉంది. చర్చలు, మధ్యవర్తిత్వ ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ మరోవైపు దాడులు ఆగడం లేదు. తాజాగా రష్యా సైన్యం ఉక్రెయిన్ ప్రధాన నగరాలైన కీవ్, ఖార్కివ్‌లపై డ్రోన్ దాడులు చేపట్టింది. ఒకవైపు శాంతి చర్చలు జరుగుతున్నా, మరోవైపు ఉక్రెయిన్ ప్రజలకు ఇది మరో నిద్రలేని రాత్రిగా మారిందని వ్యాఖ్యానించారు.

## డ్రాగన్ మిమ్మల్ని నమిలి మింగేస్తుంది


**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



గ్రీన్‌లాండ్‌కు సంబంధించి తాను ప్రతిపాదించిన 'గోల్డెన్ డోమ్' క్షిపణి రక్షణ ప్రాజెక్టును కొన్ని దేశాలు తిరస్కరించడాన్ని ట్రంప్ తీవ్ర ఆసహనం వ్యక్తం చేశారు. చైనా ఎవరినీ బతకనివ్వదని , ఈ రక్షణ వ్యవస్థ లేకపోతే ఆయా దేశాలను నమిలి మింగేస్తుందని ఆయన హెచ్చరించారు. అమెరికా అందించే భద్రతా అండను విస్మరిస్తే డ్రాగన్ నుంచి తీవ్ర ముప్పు తప్పదన్నారు. ఆ దేశంతో స్నేహం చేస్తే ఏడాది లోపే కెనడాను పూర్తిగా కబళించి వేస్తుందని, వారి ఉనికినే లేకుండా చేస్తుందని సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ విషయాన్ని ట్రూత్ సోషల్‌లో చేసిన ఒక పోస్ట్‌లో ట్రంప్ పేర్కొన్నారు. చైనా ఎలక్ట్రిక్ కార్లపై 100 శాతం సుంకాన్ని తగ్గించేందుకు కెనడా అంగీకరించిన విషయాన్ని గుర్తు చేస్తూ, చైనాతో వ్యాపార సంబంధాలు మెరుగుపర్చుకోవడం మంచిది కాదని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. కెనడాకు గోల్డెన్ డోమ్ రక్షణ కల్పించినప్పటికీ, గ్రీన్‌లాండ్‌ను ఈ భద్రతా పరిధిలోకి తీసుకురావడాన్ని కెనడా వ్యతిరేకిస్తోందని దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా ట్రంప్ విమర్శించారు. వివిధ దేశాలపై ఒంటి కాలితో లేచిన ఆయన, గ్రీన్‌లాండ్ వివాదం సహా పలు అంతర్జాతీయ అంశాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. తమకు బదులుగా చైనాతో వ్యాపారం చేసేందుకే కెనడా మొగ్గు చూపుతోందని ట్రంప్ పేర్కొన్నారు. చైనాతో వాణిజ్య బంధాలు కొనసాగితే సరిగ్గా ఏడాది లోపే డ్రాగన్ కంట్రీ కెనడాను మింగేస్తుందని హెచ్చరించారు. దావోస్‌లో ముగిసిన ప్రపంచ ఆర్థిక సదస్సులో కెనడా ప్రధాని మార్క్ కార్నీ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలోనే ట్రంప్ ఈ స్పందన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. దీంతో అమెరికా - కెనడా మధ్య సత్సంబంధాలు ఆశించిన స్థాయిలో లేవని స్పష్టమైంది. సుదీర్ఘకాలంగా అమెరికా అందిస్తున్న భద్రతా, రక్షణ సహకారం కారణంగా కెనడా తమకు రుణపడి ఉండాలని, మరింత కృతజ్ఞత చూపాలని మార్క్ కార్నీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తమ వల్లే కెనడా మనుగడ సాగిస్తోందని ట్రంప్ అన్నారు. ఈ వివాదం ముగియకముందే మరోసారి అదే అంశాన్ని ట్రంప్ లేవనెత్తారు. అమెరికాను కాదని చైనాతో స్నేహం చేస్తే మనుగడే ఉండదని హెచ్చరించారు.

## భారత్ తో ట్రేడ్ డీల్... యూఎస్ మంత్రి గ్రీన్ సిగ్నల్

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



భారత్‌కు వాణిజ్య ఒప్పందంపై అమెరికా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గతేడాది భారత్‌పై విధించిన 50 శాతం సుంకాల్లో సగం వరకు తగ్గించే ఆలోచనలో ట్రంప్ ఉన్నట్లు యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బ్రెస్సెంట్ వెల్లడించారు. రష్యా నుంచి చమురు దిగుమతులను భారత్ గణనీయంగా తగ్గించుకోవడం ఈ నిర్ణయానికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. పొలిటికోకు ఇచ్చిన ఇంటర్వ్యూలో బ్రెస్సెంట్ ఈ విషయాన్ని వెల్లడించారు. రష్యా చమురు కొనుగోళ్లు తగ్గించాలనే భారత్ చర్య వల్ల ప్రస్తుతం విధిస్తున్న మొత్తం 50 శాతం సుంకాల్లో కనీసం 25 శాతం పాయింట్లను తగ్గించడానికి అనుకూల పరిస్థితులు ఏర్పడ్డాయని అన్నారు. ఉక్రెయిన్‌పై యుద్ధానికి రష్యాకు భారత్ డిస్కౌంట్ చమురు కొనుగోళ్ల ద్వారా ఆర్థికంగా మద్దతు ఇస్తోందని ఆరోపిస్తూ గతేడాది అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. ఇందులో 25 శాతం ప్రత్యక్ష సుంకాలు కాగా, మరో 25 శాతం జరిమానా సుంకాలుగా ఉన్నాయి. వీటిని తగ్గించాలని భారత్ పలుమార్లు విజ్ఞప్తి చేసినా ట్రంప్ అప్పట్లో సానుకూలంగా స్పందించలేదు. ప్రధాని మోదీ నేరుగా తనతో ఈ అంశంపై మాట్లాడలేదని, తన ఫోన్లు లిఫ్ట్ చేయలేదని ట్రంప్ వ్యాఖ్యలు చేయడం అప్పట్లో సంచలనంగా మారింది. అయితే , తాజాగా ట్రంప్ ఏర్పాటు చేసిన గాజా శాంతి బోర్డులో చేరాలన్న ఆహ్వానాన్ని భారత్ మౌనంగా పక్కన పెట్టడం, అదే సమయంలో రష్యా నుంచి చమురు దిగుమతులను తగ్గించుకోవడం కీలకంగా మారింది. ఈ పరిణామాలు ట్రంప్‌ను పునరాలోచనకు నెట్టినట్లు తెలుస్తోంది. మరోవైపు భారత్‌తో వాణిజ్య ఒప్పందం కుదర్చేందుకు చేస్తున్న ప్రయత్నాలు ముందుకు సాగకపోవడం కూడా ప్రభావం చూపినట్లు సమాచారం. "భారత్‌పై విధించిన 25 శాతం సుంకం భారీ ప్రభావం చూపింది. భారీ సుంకాల అమలు కొనసాగుతున్నప్పటికీ, వాటిని తొలగించే మార్గం ఇప్పుడు కనిపిస్తోంది" అని స్కాట్ బ్రెస్సెంట్ వ్యాఖ్యానించారు. ఇదే క్రమంలో ట్రంప్ కూడా భారత్‌తో త్వరలోనే భారీ వాణిజ్య ఒప్పందం కుదరబోతున్నట్లు సంకేతాలు ఇచ్చారు. ఈ ఒప్పందంలో భాగంగానే సుంకాల తగ్గింపు నిర్ణయం తీసుకునే అవకాశముందని రాజకీయ, ఆర్థిక వర్గాలు అంచనా వేస్తున్నాయి.

## అక్షరాలపై తూటాల వర్షం

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



బాంబు దాడిలో 13 మంది విద్యార్థినుల మృతి

సూడాన్‌లో కొనసాగుతున్న భీకర అంతర్యుద్ధం పసి ప్రాణాలను బలితీసుకుంటోంది. ఉత్తర కోర్డోఫాన్ రాష్ట్రంలోని ఎల్‌ఒబెద్ నగరంలో ఉన్న 'అబూ సిత్తా' బాలికల పాఠశాలపై జరిగిన బాంబు దాడులు గగుర్పాటుకు గురిచేస్తున్నాయి. ఈ ఘోర ఘటనలో 13 మంది విద్యార్థినులు, ఒక ఉపాధ్యాయురాలు అక్కడికక్కడే విగతజీవులయ్యారు. ఈ దాడి నుంచి ప్రాణాలతో బయటపడిన మకరేమ్, ఇక్రామ్ అనే కవల సోదరీమణులు ఒక ప్రముఖ అంతర్జాతీయ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆనాటి భయానక దృశ్యాలను వివరించారు. దాడి జరిగిన సమయంలో మకరేమ్, ఇక్రామ్ వేర్వేరు తరగతి గదుల్లో ఉన్నారు. ఒక్కసారిగా పేలుళ్ల శబ్దాలతో పాఠశాల దద్దరిల్లగా, మకరేమ్ భుజానికి తీవ్ర గాయమైంది. నగరంలో కనీసం అంబులెన్స్ సౌకర్యం కూడా లేకపోవడంతో, స్థానికులు ఆమెను జంతువులు లాగే బండ్లు, ప్రైవేట్ వాహనాల్లో ఆసుపత్రికి తరలించారు. తన సోదరి ఏమైందో తెలియక ఇక్రామ్ పడిన ఆవేదన వర్ణనాతీతం. ఆ రోజు మకరేమ్ ఆసుపత్రి నుంచి క్షేమంగా తిరిగి వచ్చేవరకు ఆ కుటుంబం నరకం చూసింది. ఈ దాడి మకరేమ్ జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేని చేదు జ్ఞాపకాన్ని మిగిల్చింది. దాడిలో ఆమె తలలోకి ఒక చిన్న బాంబు తునక దూసుకెళ్లింది. శస్త్రచికిత్స చేయడం ప్రాణాపాయమని వైద్యులు చెప్పడంతో, ఆమె నిరంతరం ఆ నొప్పితోనే జీవిస్తోంది. ముఖ్యంగా చలికాలంలో ఆ నొప్పి మరింత తీవ్రమవుతుందని ఆమె వాపోయింది. "నా స్నేహితుల్లో సగం మంది చనిపోయారు, మిగిలిన సగం మంది గాయపడ్డారు," అని ఆమె చెబుతున్న మాటలు అక్కడ జరిగిన మారణకాండ తీవ్రతను చాటిచెబుతున్నాయి. దాడి జరిగిన మూడు నెలల తర్వాత పాఠశాల తెరిచినా, ఆ భయంకర దృశ్యాలను చూడలేక ఇక్రామ్ కళ్లు మూసుకుని క్లాస్ రూమ్‌కు వెళ్లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఐక్యరాజ్యసమితి లెక్కల ప్రకారం సూడాన్ ప్రస్తుతం ప్రపంచంలోనే అతిపెద్ద మానవీయ సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. 2023 ఏప్రిల్ నుంచి సాగుతున్న ఈ యుద్ధంలో 1.5 లక్షల మందికి పైగా చనిపోగా, సుమారు 1.3 కోట్ల మంది పిల్లలు చదువుకు దూరమయ్యారు. ఎల్‌ఒబెద్ నగరం పారామిలిటరీ దళాల ముట్టడిలో ఉండటంతో, అనేక పాఠశాలలు శరణాలయాలుగా మారిపోయాయి. కనీస మరుగుదొడ్లు, నీటి సౌకర్యం లేక విద్యార్థినులు ఇబ్బంది పడుతున్నారు. ఇన్ని కష్టాల మధ్య కూడా ఆ సోదరీమణులు తమ ఆశను వదులుకోలేదు. తన ప్రాణాలు కాపాడిన వైద్యులలాగే తాను కూడా డాక్టర్ కావాలని మకరేమ్, తన టీచర్ లాగే ఇంగ్లీష్ ప్రొఫెసర్ కావాలని ఇక్రామ్ పట్టుదలతో చదువుతున్నారు. చనిపోయిన తమ స్నేహితుల ఆశయాలను నెరవేర్చడమే తమ లక్ష్యమని వారు గట్టిగా నమ్ముతున్నారు.

## ఆకాశంలో ఆత్మాహుతి దాడి

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



విమానాన్ని పేల్చేయాలన్న ఉద్దేశంతో భద్రతా సిబ్బందికి చిక్కకుండా విమానం ఎక్కాడు ఒక సూసైడ్ బాంబర్. ఎక్కడ కూర్చుంటే ఎక్కువ మంది టార్గెట్ అవుతారో చూసుకుని మరీ సీటు సంపాదించాడు. విమానం గాల్లోకి లేవగానే వెంట తెచ్చుకున్న బాంబులతో తనను తాను పేల్చుకున్నాడు. అయితే ఊహించని విధంగా అక్కడ సీన్ మొత్తం రివర్స్ అయింది. పదేళ్ల క్రితం సోమాలియాలో చోటుచేసుకున్న ఈ సంచలన ఘటన తాజాగా సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 2016 ఫిబ్రవరి 2న సోమాలియా జాతీయుడు అబ్దులాహి అబ్దిసలామ్ బోర్లే దాల్లో ఎయిర్‌లైన్స్ కు చెందిన ప్రయాణికుల విమానాన్ని ఎక్కాడు. ఆ విమానం సోమాలియా రాజధాని మొగదిషు నుంచి జిబౌటీకి బయల్దేరింది. పేలుడు పదార్థాలు ఉన్న ల్యాప్‌టాప్‌ను వెంట తెచ్చుకున్న బోర్లే విమానం మధ్య భాగంలోని సీటులో కూర్చున్నాడు. ఆ సమయంలో విమానంలో 70 మందికిపైగా ప్రయాణికులు, ఏడుగురు సిబ్బంది ఉన్నారు. సరైన సమయం కోసం వేచిచూస్తోన్న అతడు, టేకాఫ్ అయిన 15 నిమిషాలకే బాంబు బటన్‌ను నొక్కాడు. అప్పటికే విమానం సుమారు 11 వేల అడుగుల ఎత్తులో ఉంది. పేలుడు ధాటికి అతడి సీటు పక్కన సుమారు ఒక మీటర్ పరిమాణంలో రంధ్రం పడింది. బాంబర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ రంధ్రం గుండా అతడి శరీరం భూమ్మీద పడిపోయింది. పేలుడుతో ప్రయాణికులు ఏమైందో అర్థంకాక ప్రాణాలు అరచేత పట్టుకుని భయాందోళనకు గురయ్యారు. మరోవైపు పేలుడు జరిగిన ప్రదేశం ఇంధన ట్యాంకులకు అత్యంత సమీపంలో ఉండటంతో పెను ప్రమాదం ముప్పుగా మారింది. అయితే విమాన సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించారు. ఫ్లైట్ అటెండెంట్స్ ప్రయాణికులను వెంటనే వెనక భాగానికి తరలించారు. పైలట్లు మొగదిషు టవర్‌ను అప్రమత్తం చేసి అంతర్జాతీయ విమానాశ్రయంలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. టేకాఫ్ అయిన 15-20 నిమిషాల్లోనే ఘటన జరగడం, అప్పటికి క్యాబిన్‌లో పూర్తి స్థాయిలో పీడనం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని నిపుణులు తెలిపారు. అందుకే ఈ ఘటనను 'మిరాకిల్'గా పేర్కొంటారు. ఈ ప్రమాదంలో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. విమానం నుంచి పడిపోయిన బాంబర్ మృతదేహం సోమాలియాలోని బలాద్ ప్రాంతంలో లభ్యమైంది. ఈ దాడికి ఉగ్రవాద సంస్థ అల్ షబాబ్ బాధ్యత వహించింది. పాశ్చాత్య దేశాల అధికారులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి చేసినట్లు అప్పట్లో ప్రకటించింది. ఘటనపై 2016లో విచారణ జరిపిన సోమాలియన్ మిలిటరీ కోర్టు ఇద్దరికి జీవిత ఖైదు విధించగా.. మరో ఎనిమిది మందిని దోషులుగా తేల్చింది.

## ట్రంప్ కు ఆస్పిరిన్ తెచ్చిన తంటా

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**



అగ్రరాజ్య అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ నిత్యం వార్తల్లో హల్ చల్ చేస్తుంటారు. చేతిపై కనిపించిన కమిలిన మచ్చలతో అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం వేదికగా ట్రంప్ పాల్గొన్న సందర్భంగా, ఆయన ఎడమ చేతిపై నల్లటి-నీలం రంగు మచ్చలు కనిపించాయి. దీంతో ఒక్కసారిగా సోషల్ మీడియాలో ఆయన ఆరోగ్యంపై రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. దావోస్‌లో జరిగిన 'బోర్డ్ ఆఫ్ పీస్' సంతకాల కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. ఆ సమయంలో సంతకం చేస్తుండగా కెమెరాలు ఆయన చేతిని క్లోజప్‌లో చూపించడంతో ఈ మచ్చలు స్పష్టంగా కనిపించాయి. దీనిపై విలేకరులు ప్రశ్నించగా ట్రంప్ తనదైన శైలిలో బదులిచ్చారు. సంతకం చేసే సమయంలో టేబుల్ కోన తన చేతికి బలంగా తగిలిందని, అందుకే ఈ మచ్చ వచ్చిందని తెలిపారు. తాను గుండె ఆరోగ్యం కోసం ప్రతిరోజూ 325 మిల్లీగ్రాముల ఆస్పిరిన్ తీసుకుంటానని చెప్పారు. ఆస్పిరిన్ వల్ల రక్తం పలచబడుతుందని, చిన్న గాయం తగిలినా త్వరగా మచ్చలు పడతాయని వివరించారు. "నా గుండెల్లోకి చిక్కటి రక్తం వెళ్లడం నాకు ఇష్టం లేదు" అని వ్యాఖ్యానించారు. వైద్య నిపుణుల ప్రకారం, వృద్ధాప్యంలో చర్మం పలుచబడటం సహజం. దీనికి తోడు అధిక మోతాదులో ఆస్పిరిన్ వాడితే రక్తనాళాలు సులభంగా పగిలి ఇలాంటి మచ్చలు ఏర్పడతాయి. దీనిని వైద్య పరిభాషలో 'సెనైల్ పర్పురా'గా పేర్కొంటారు. గత ఏడాది నుంచి ట్రంప్ కుడి చేతిపై కూడా ఇలాంటి మచ్చలు కనిపిస్తున్నాయని, కొన్నిసార్లు వాటిని మేకప్‌తో కప్పిపుచ్చుతున్నారని పరిశీలకులు చెబుతున్నారు. 79 ఏళ్ల వయసులో ట్రంప్ ఆరోగ్యంపై వస్తున్న వార్తలు ఆయన మద్దతుదారుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. అయితే వైట్ హౌస్ మాత్రం ఆయన పూర్తిగా ఆరోగ్యంగానే ఉన్నారని స్పష్టం చేస్తోంది. రాజకీయాల్లో చిన్న విషయం కూడా పెద్ద చర్చకు దారి తీస్తుందనడానికి, ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన నేత ఆరోగ్యానికి సంబంధించిన ఈ చిన్న మచ్చే నిదర్శనంగా మారింది.



## ఆస్ట్రేలియా తీరంలో 'షార్క్' పంజా

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

ఆస్ట్రేలియా తూర్పు తీర ప్రాంతం ప్రస్తుతం షార్క్ దాడులతో దడలెత్తిపోతోంది. కేవలం 48 గంటల వ్యవధిలో నలుగురిపై షార్క్ లు దాడి చేయడం అంతర్జాతీయంగా సంచలనం సృష్టించింది. గత 20 ఏళ్లలో ఇంత తక్కువ సమయంలో, ఇంత దగ్గర ప్రాంతాల్లో వరుస దాడులు జరగడం ఇదే మొదటిసారి అని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 18న సిడ్నీ హార్బర్‌లో ఈతకు వెళ్లిన 12 ఏళ్ల బాలుడు షార్క్ దాడిలో మరణించగా, ఆ మరుసటి రోజే 'డీ వై' బీచ్‌లో ఒక బాలుడి సర్ఫ్ బోర్డును షార్క్ కొరికింది. అదే రోజు మ్యాన్లీ బీచ్‌లో మరో వ్యక్తిపై దాడి జరగగా, ఈ నెల 20న తీరానికి 300 కిలోమీటర్ల దూరంలో నాలుగో దాడి నమోదైంది. సాధారణంగా షార్క్ లు మనుషులపై దాడి చేయవు, కానీ ప్రస్తుతం ఆస్ట్రేలియాలో ఏర్పడిన 'పర్ఫెక్ట్ స్టార్మ్' (అనుకూల పరిస్థితులు) ఈ దాడులకు ప్రధాన కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. సిడ్నీలో గత 38 ఏళ్లలో లేనంత భారీ వర్షం కురవడంతో, ఆ వరద నీరు సముద్రంలో కలవడం వల్ల తీర ప్రాంతంలో ఉప్పు శాతం తగ్గింది. ఇది ముఖ్యంగా బుల్ షార్క్ లు సంచరించడానికి అనువైన వాతావరణాన్ని కల్పించింది. అంతేకాకుండా, వరద నీటితో పాటు మురుగు నీరు, ఇతర వ్యర్థాలు సముద్రంలో చేరడంతో చిన్న చేపలు భారీగా తీరానికి వచ్చాయి. ఈ చేపలను వేటాడే క్రమంలో షార్క్ లు కూడా తీరం వైపుకు దూసుకొచ్చి మనుషులపై దాడులకు దిగుతున్నాయి. గత 30 ఏళ్లలో షార్క్ దాడుల సంఖ్య 8 నుంచి 20కి పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నప్పటికీ, దీనికి కారణం షార్క్ ల సంఖ్య పెరగడం కాదని పరిశోధకులు స్పష్టం చేస్తున్నారు. సముద్ర తీరాల్లో జనాభా పెరగడం, ఎక్కువ మంది వాటర్ స్పోర్ట్స్ , ఈతకు ఆసక్తి చూపడం వల్ల షార్క్ లతో తలపడే అవకాశాలు పెరిగాయని వారు పేర్కొంటున్నారు. షార్క్ లను చంపడం దీనికి సరైన పరిష్కారం కాదని, ప్రజలే అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. భారీ వర్షాలు పడిన వెంటనే సముద్రంలోకి వెళ్లకపోవడం, సముద్రాన్ని ఒక అడవిలా భావించి తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారా ఈ ప్రమాదాల నుండి తప్పుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

## జపాన్‌లోనూ యూపీఐ మ్యాజిక్

**మొదటిపేజీ తరువాయి...**

జపాన్‌ను సందర్శించే భారతీయ పర్యాటకుల సంఖ్య ఏటేటా గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, వారికి చెల్లింపులను సులభతరం చేయడమే ఈ చర్య ప్రధాన ఉద్దేశం. గణాంకాల ప్రకారం, 2025లో సుమారు 3.15 లక్షల మంది భారతీయులు జపాన్‌ను సందర్శించారు, ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 35 శాతం అధికం. ఈ క్రమంలో, పర్యాటకులు కరెన్సీ మార్పిడి ఇబ్బందులు లేకుండా, నేరుగా తమ యూపీఐ యాప్‌ల ద్వారా అక్కడి దుకాణాల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి చెల్లింపులు చేయవచ్చు. ఈ మొత్తం నేరుగా వారి భారత బ్యాంకు ఖాతాల నుంచే డెబిట్ అవుతుంది. 2026 ఆర్థిక సంవత్సరంలో జపాన్‌లో యూపీఐ ట్రయల్స్ నిర్వహించాలని ఎన్‌టీటీ డేటా, ఎన్‌పీసీఐ ప్రణాళికలు రచిస్తున్నాయి. 2016లో ప్రారంభమైన యూపీఐ ఇప్పటికే భూటాన్, సింగపూర్, ఫ్రాన్స్, యూఏఈ సహా 8 దేశాల్లో విజయవంతంగా కొనసాగుతోంది. ప్రపంచంలోనే అతిపెద్ద రియల్ టైమ్ పేమెంట్ సిస్టమ్‌గా అంతర్జాతీయ ద్రవ్య నిధి యూపీఐని అభివర్ణించిన విషయం తెలిసిందే. జపాన్‌తో కుదిరిన ఈ తాజా ఒప్పందం రెండు దేశాల మధ్య వాణిజ్యాన్ని, పర్యాటకాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.



## న్యూజిలాండ్‌లో ప్రకృతి ప్రకోపం

**ఇంటర్నేషనల్ (ఏడీఎన్ఎన్):**

న్యూజిలాండ్‌లోని ఉత్తర ద్వీపంలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు పెను విషాదాన్ని నింపాయి. ప్రసిద్ధ పర్యాటక ప్రాంతమైన మౌంట్ మాంగనుయ్‌లోని 'బీచ్‌సైడ్ హాలిడే పార్క్' క్యాంప్‌సైట్‌పై గురువారం ఉదయం ఒక్కసారిగా కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘోర ఘటనలో ఆరుగురు గల్లంతయ్యారు. అయితే, వారు సజీవంగా ఉండే అవకాశాలు లేవని నిర్ధారించిన పోలీసులు,సహాయక చర్యలను శనివారం నిలిపివేసి, మృతదేహాల వెలికితీత ప్రక్రియను ప్రారంభించారు. శిథిలాల కింద మానవ అవశేషాలను గుర్తించినట్లు పోలీస్ సూపరింటెండెంట్ టిమ్ అండర్సన్ ధృవీకరించారు. గల్లంతైన వారిలో 15 ఏళ్ల ఇద్దరు టీనేజర్లు ఉండటం అందరినీ కలచివేస్తోంది. ఈ విపత్తులో గల్లంతైన ఆరుగురి వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించారు. వీరిలో లిసా అన్నే మెక్లెనన్ (50), స్వీడన్ దేశస్థుడు మాన్స్ లోకే బెర్న్ హార్డ్ సన్ (20), జాక్వాలిన్ సుజానే వీలర్ (71), సుసాన్ డోరీన్ నోలెస్ (71) ఉన్నారు. వీరితో పాటు ఆక్లాండ్‌కు చెందిన షారన్ మెక్కానికో (15), మాక్స్ ఫర్సీకీ (15) అనే ఇద్దరు విద్యార్థులు కూడా మృత్యువాత పడ్డారు. మౌంట్ మాంగనుయ్‌కు సమీపంలోని వెల్‌కమ్ బే వద్ద జరిగిన మరో ప్రమాదంలో చైనీస్ మూలాలున్న ఒక నానమ్మ ,ఆమె మనవడు ప్రాణాలు కోల్పోవడం ఆ ప్రాంతంలో విషాద ఛాయలను నింపింది. నిరంతరం కురుస్తున్న వర్షాల కారణంగా నేల వదులై, సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. న్యూజిలాండ్ ప్రధాన మంత్రి క్రిస్టోఫర్ లక్సన్ శుక్రవారం ప్రమాద స్థలాన్ని సందర్శించి బాధితులను పరామర్శించారు .ఈ ఘటనను ఆయన ఒక "తీరని విషాదం"గా అభివర్ణించారు.మౌంట్ మాంగనుయ్ అనేది మావోరీ తెగకు పవిత్రమైన ప్రాంతం,పర్యాటకులకు ఎంతో ఇష్టమైన ప్రదేశం. అయితే, ఇటీవలి కాలంలో ఇక్కడ తరచూ కొండచరియలు విరిగిపడుతుండటం స్థానికులలో ఆందోళన కలిగిస్తోంది. మృతదేహాలను వెలికితీసి, కుటుంబ సభ్యులకు అప్పగించే ప్రక్రియ చాలా సంక్లిష్టంగా, సమయం తీసుకునేలా ఉంటుందని అధికారులు తెలిపారు.



# రెడ్ బుక్ అరాచకాలతో ఏపీ ఇమేజ్ ఖతం

**అనంతపురం (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై మాజీ మంత్రి సాకే శైలజానాథ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో పెట్టుబడులు రాకపోవడానికి, పారిశ్రామికవేత్తలు భయపడటానికి 'రెడ్ బుక్' అరాచకాలే ప్రధాన కారణమని విమర్శించారు. ఏపీ బ్రాండ్ ఇమేజ్‌ను ఈ ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసిందని మండిపడిన ఆయన, రెడ్ బుక్ ద్వారా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు దిగుతోందని ఆరోపించారు. ఇందులో కేవలం వైసీపీ నేతలే కాకుండా జనసేన నేతల పేర్లు కూడా ఉన్నాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దావోస్ పర్యటనపై శైలజానాథ్ ఎద్దేవా చేస్తూ, ఆయన ఉత్తి చేతులతో తిరిగి వచ్చారని విమర్శించారు. స్పెషల్ ఫ్లైట్లలో వెళ్లి రావడం తప్ప రాష్ట్రానికి ఆయన సాధించింది శూన్యమని, చంద్రబాబు పరిస్థితి ఇప్పుడు 'అప్పు చేసి పప్పు కూడు' తిన్నట్లుగా ఉందని వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ఫోటో కోసం చంద్రబాబు విఫలయత్నం చేశారని ఆరోపిస్తూ, "అందరినీ ట్రంప్ భయపెడితే.. చంద్రబాబుతో ఫోటో దిగడానికి ట్రంప్ భయపడ్డారు" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. దావోస్ నుంచి తాము 'జీరో' ఫలితంతో వచ్చామని చంద్రబాబు, లోకేశ్ అంగీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఎమర్జెన్సీని మించిన పరిస్థితులు ఉన్నాయని శైలజానాథ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో చిన్న లైక్ చేసినా, కామెంట్ చేసినా ప్రభుత్వం సహించలేకపోతోందని, ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. పోలీసు శాఖను ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసిందని దుయ్యబట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగులకు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ, వైసీపీ హయాంలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం పరుగులు పెట్టాయని ఆయన స్పష్టం చేశారు.




# మోదీ.. గ్లామర్‌కు మించిన గ్లోబల్ స్టార్

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఛరిష్మా ముందు సినీ గ్లామర్ ఏమాత్రం సాటిరాదని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. విశాఖపట్నంలో శనివారం పర్యటించిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిస్థితులు , సినీ గ్లామర్‌పై పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దివంగత నేత ఎన్టీఆర్ తర్వాత రాజకీయాల్లో సినీ గ్లామర్ పెద్దగా వర్కౌట్ కావడం లేదు. ప్రజలు ఇప్పుడు కేవలం గ్లామర్‌ను చూసి ఓట్లు వేయడం లేదు, నాయకత్వ పటిమను చూస్తున్నారు," అని పేర్కొన్నారు. అయితే, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కేవలం సినీ నటుడు మాత్రమే కాదని, ఆయన ఒక బలమైన ప్రజా నాయకుడని కేంద్రమంత్రి ప్రశంసించారు. బీజేపీ, టీడీపీ , జనసేన పార్టీలు కలిసికట్టుగా పోటీ చేయడం వల్లే చారిత్రాత్మక విజయం సాధ్యమైందని చెప్పారు. ఈ ఐక్యత రాష్ట్ర ప్రజలకు బలమైన భరోసానిచ్చిందన్నారు. దేశ ప్రజలు ఇప్పటికీ మోదీ నాయకత్వాన్నే కోరుకుంటున్నారని, అభివృద్ధి చూసి ప్రజలు మళ్లీ మద్దతు పలుకుతున్నారని తెలిపారు. త్వరలో మూడు రాష్ట్రాల్లో జరగనున్న ఎన్నికలపై శ్రీనివాస వర్మ ధీమా వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మోదీ హవా కొనసాగుతోందని, ఆయా రాష్ట్రాల్లో బీజేపీ కచ్చితంగా విజయం సాధిస్తుందని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమం అనే రెండు అజెండాలతో తాము ప్రజల్లోకి వెళ్తున్నామని ఆయన వెల్లడించారు.



# చంద్రబాబు అబద్ధాలు వినలేక ప్రజలు పరార్

**నగరి (ఏడీఎన్ఎన్) :**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నగరి పర్యటనపై మాజీ మంత్రి ఆర్కే రోజా తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వంపై, స్థానిక టీడీపీ ఎమ్మెల్యేపై ఘాటు విమర్శలు చేశారు. సీఎం చెబుతున్న అబద్ధాలను భరించలేక ప్రజలు సభల నుంచి పారిపోయారని ఆమె ఎద్దేవా చేశారు. నగరి నియోజకవర్గంలో ప్రస్తుతం ఉన్న అభివృద్ధి అంతా వైసీపీ హయాంలోనే జరిగిందని, తాము అధికారంలో ఉన్నప్పుడు కల్యాణ మండపం, సబ్ స్టేషన్, పాలిటెక్నిక్ కాలేజీ, పార్క్, షాదీ మహల్ వంటి నిర్మాణాలు పూర్తి చేశామని గుర్తు చేశారు. పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు కట్టించి ఇచ్చింది కూడా తమ ప్రభుత్వమేనని, ఇప్పుడు వచ్చి టీడీపీ నేతలు క్రెడిట్ తీసుకోవాలని చూడటం హాస్యాస్పదమని మండిపడ్డారు. నగరి నియోజకవర్గానికి కూటమి ప్రభుత్వం వల్ల కలిగిన ప్రయోజనం ఒక్కటి కూడా లేదని రోజా విమర్శించారు. నియోజకవర్గంలో చేనేత కార్మికులు ఎక్కువగా ఉన్నారన్న కారణంతో ఎన్నికల ముందు టెక్స్‌టైల్ పార్క్ పెడతామని హామీ ఇచ్చి, ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. అలాగే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మామిడి రైతులను సర్వనాశనం చేశారని ఆమె ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ, అవసరమైన సదుపాయాలు అందించడంలోనూ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. ప్రభుత్వం గొప్పగా చెప్పుకుంటున్న 'సూపర్ సిక్స్' పథకాలు క్షేత్రస్థాయిలో ఎక్కడా అమలు కావడం లేదని రోజా విమర్శించారు. మహిళలకు నెలకు రూ. 1,500 ఇస్తామన్న 'ఆడబిడ్డ నిధి' పథకాన్ని ప్రభుత్వం ఎగ్గొట్టిందని, 'తల్లికి వందనం' పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులకు పంగనామం పెట్టారని ఎద్దేవా చేశారు. ఇప్పటివరకు ఒక్క నిరుద్యోగికి కూడా భృతి అందలేదని, పరిస్థితి ఇలా ఉంటే 'సూపర్ సిక్స్' పథకాలు ఎలా సక్సెస్ అయ్యాయో ముఖ్యమంత్రి చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం కేవలం మాటలకే పరిమితమైందని ఆమె దుయ్యబట్టారు.

# స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర'లో పాల్గొన్న హోంమంత్రి

**చిన్న పొరపాట్లతో జీవితాలను నాశనం చేసుకోవద్దు..**

**అనకాపల్లి (ఏడీఎన్ఎన్) :**

జాతీయ బాలికా దినోత్సవం, స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత కశింకోట మండలంలోని తేగాడ మోడల్ స్కూల్‌ను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థినుల మధ్య హోంమంత్రి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "విద్యార్థి దశలో చిన్న చిన్న



పొరపాట్లు చేసి జీవితాలను నాశనం చేసుకోవద్దు. ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలి," అని సూచించారు. ఆపదలో ఉన్నప్పుడు రక్షణ కోసం ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. మంత్రితో ముచ్చటించే క్రమంలో విద్యార్థులు పాఠశాలకు ఒక క్రీడా మైదానం కావాలని విన్నవించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన అనిత, త్వరలోనే మైదానాన్ని ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే, విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ప్రోత్సహించారు. రాష్ట్ర విద్యా వ్యవస్థలో విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నారని అనిత కొనియాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. స్వర్ణాంధ్రస్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# అమరావతి వేదికగా రిపబ్లిక్ డే వేడుకలు..

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్ర విభజన తర్వాత నవ్యాంధ్ర రాజధాని అమరావతి మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కాబోతోంది. ఈ ఏడాది గణతంత్ర దినోత్సవ వేడుకలను రాజధాని కోర్ ఏరియాలో నిర్వహించాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. అమరావతి సీడ్ యాక్సెస్ రోడ్డులోని పరేడ్ గ్రౌండ్‌లో అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాజధాని హోదాలో అమరావతిలో రిపబ్లిక్ డే వేడుకలు జరగడం ఇదే తొలిసారి కావడంతో అటు ప్రజల్లో, ఇటు రాజధాని రైతుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ వేడుకల కోసం సుమారు 13 వేల మంది కూర్చునేలా గ్యాలరీలను సిద్ధం చేయగా, 22 ఎకరాల్లో వాహనాల పార్కింగ్ సదుపాయం కల్పించారు. జనవరి 26న జరగనున్న ప్రధాన కార్యక్రమం కోసం శనివారం ఉదయం ఫైనల్



రిహార్సల్స్ ను విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, జీఏడీ ప్రిన్సిపల్ సెక్రటరీ స్వయంగా పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ పోలీసు విభాగాలు, ఎన్సీసీ క్యాడెట్ల మార్చ్‌పాస్ట్‌తో పాటు ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రతిబింబించేలా పలు శాఖల శకటాలు ఈ పరేడ్‌లో కనువిందు చేయనున్నాయి. భద్రత మరియు ఏర్పాట్లపై అధికార యంత్రాంగం ఎప్పటికప్పుడు సమీక్షిస్తోంది. రాజధాని కోసం భూములిచ్చిన అమరావతి రైతులకు గౌరవసూచకంగా ఈ వేడుకల్లో ప్రత్యేక వీఐపీ గ్యాలరీని కేటాయించారు. గవర్నర్ జాతీయ జెండాను ఆవిష్కరించే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు మరియు ఇతర ఉన్నతాధికారులు పాల్గొంటారు. రాజధాని నిర్మాణ పనులు వేగవంతం చేసిన తరుణంలో, అమరావతిలో ఈ జాతీయ వేడుకలు నిర్వహించడం ద్వారా రాజధాని వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. పరేడ్ గ్రౌండ్ పరిసరాల్లో పోలీసులు ఇప్పటికే పటిష్టమైన భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశారు.

# ఏపీకి రెండో ఎయిమ్స్ అవసరం

**మంగళగిరి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మరో ఎయిమ్స్ మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. మంగళగిరి ఎయిమ్స్‌లో శనివారం జరిగిన 8వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వైద్యులను ఉద్దేశించి ప్రసంగిస్తూ రాష్ట్ర వైద్య రంగ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. బిహార్, జమ్మూ కశ్మీర్ వంటి రాష్ట్రాలకు అదనపు ఎయిమ్స్‌లను కేటాయించినట్లుగానే, ఏపీకి కూడా మరో సంస్థను మంజూరు చేయాలని కేంద్రాన్ని కోరినట్లు మంత్రి తెలిపారు. "వెనుకబడిన రాష్ట్రాలకు ఇస్తున్న ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని, ప్రత్యేక పథకం కింద ఏపీకి మరో ఎయిమ్స్‌ను కేటాయిస్తామని కేంద్రం నుంచి సానుకూల హామీ లభించింది," అని ఆయన పేర్కొన్నారు. అలాగే మంగళగిరి ఎయిమ్స్‌కు ఇవ్వాల్సిన మిగిలిన 10 ఎకరాల భూమిని త్వరలోనే కేటాయిస్తామని హామీ ఇచ్చారు. మెడికల్ కాలేజీల నిర్వహణలో పీపీపీ విధానంపై జరుగుతున్న ప్రచారాన్ని మంత్రి ఖండించారు. పీపీపీ విధానం అందరికీ ఆమోదయోగ్యమని, దీనిపై కొందరు కావాలనే విషప్రచారం చేస్తున్నారని ఆయన విమర్శించారు. చంద్రబాబు ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల గత 19 నెలల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీ , ఐపీ , ల్యాబ్ టెస్టుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎయిమ్స్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ కనీస నీటి సదుపాయం కోసం ఇబ్బందులు పడాల్సి వచ్చిందని సత్యకుమార్ విమర్శించారు. కేంద్ర సంస్థల పట్ల గత పాలకులు వ్యవహరించిన తీరును ఆయన తప్పుబట్టారు. ప్రస్తుత ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం



చేసుకుంటూ అన్ని వసతులు కల్పిస్తోందని చెప్పారు. వైద్య విద్యార్థులకు దిశానిర్దేశం చేస్తూ, "జీవితంలో వినోదం ఒక భాగమే కానీ, వినోదమే జీవితం కాదని గుర్తించాలి," అని మంత్రి హితవు పలికారు. చదువుపై దృష్టి సారించి ఉత్తమ వైద్యులుగా ఎదగాలని కోరారు.

# తీరానికి కొట్టుకొచ్చిన ఆలివ్ రిడ్లే తాబేళ్ల కళేబరాలు!

**శ్రీకాకుళం (ఏడీఎన్ఎన్) :**

శ్రీకాకుళం జిల్లా సముద్ర తీరంలో అరుదైన ఆలివ్ రిడ్లే తాబేళ్లు భారీ సంఖ్యలో ప్రాణాలు కోల్పోవడం పర్యావరణ ప్రేమికులను కలవరపెడుతోంది. వజ్రపుకొత్తూరు మండలం దోకులపాడు సముద్ర తీరానికి శనివారం 150 తాబేళ్ల కళేబరాలు కొట్టుకువచ్చాయి. సంతానోత్పత్తి కోసం ప్రతి ఏటా ఈ సమయంలో ఆలివ్ రిడ్లే తాబేళ్లు సముద్ర తీరానికి వస్తుంటాయి. అయితే, ఈసారి భారీ సంఖ్యలో తాబేళ్లు మృత్యువాత పడటం ఆందోళన కలిగిస్తోంది. తీరం వెంబడి చెల్లా



చెదురుగా పడి ఉన్న వీటి కళేబరాలను గమనించిన స్థానికులు అధికారులకు సమాచారం అందించారు. తీరంలో కుళ్ళిపోతున్న తాబేళ్ల కళేబరాల వల్ల దుర్వాసన రాకుండా ఉండేందుకు స్నేహ కళామండలి సభ్యులు మానవతా దృక్పథంతో స్పందించారు. వారి ఆధ్వర్యంలో తీరానికి కొట్టుకువచ్చిన తాబేళ్లను సేకరించి, అక్కడే గొయ్యి తీసి పూడ్చివేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా వారు చేసిన ఈ పనిని స్థానికులు అభినందించారు. సముద్రంలో వేట సాగిస్తున్న మెకనైజ్డ్ బోట్ల ఇంజిన్ ఫ్యాన్‌లు తగలడం వల్ల లేదా వేటగాళ్ల వలల్లో చిక్కుకోవడం వల్లే ఈ అరుదైన తాబేళ్లు ప్రాణాలు కోల్పోయి ఉండవచ్చని పర్యావరణ వేత్తలు భావిస్తున్నారు.

# ఇంజనీరింగ్ విద్యార్థినిపై అఘాయిత్యం..

**అసభ్యకర వీడియోలతో బ్లాక్‌మెయిల్!**

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

విశాఖలోని ఒక ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతున్న ఓ విద్యార్థినికి తీవ్ర చేదు అనుభవం ఎదురైంది. తోటి విద్యార్థి చేతిలో ఆమె భౌతిక, మానసిక వేధింపులకు గురవ్వడమే కాకుండా, అఘాయిత్యానికి బలైంది. ఈ ఘటన స్థానికంగా , విద్యా వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతోంది. సదరు విద్యార్థిని అదే కాలేజీలో ఎంసీఏ చదువుతున్న దిలీప్ అనే యువకుడితో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పరిచయమైంది. జనవరి 21న దిలీప్ ఆమెకు ప్రపోజ్ చేశాడు. అదే రోజు సాయంత్రం మాట్లాడాలని చెప్పి విద్యార్థిని హాస్టల్ వద్దకు వెళ్లిన దిలీప్, ఆమెను బలవంతంగా తన బైక్‌పై తీసుకెళ్లాడు. మొదట భీమిలి బీచ్ వద్ద ఆమెపై దాడికి యత్నించిన నిందితుడు, ఆపై హాస్టల్ వద్ద దించుతానని నమ్మించి రాళ్లవలసలోని ఒక లాడ్జికి తీసుకెళ్లాడు.



అక్కడ బాధితురాలిని భౌతికంగా హింసించడమే కాకుండా, ఆమెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. అంతేకాకుండా, ఆ సమయంలో అసభ్యకరమైన రీతిలో ఫోటోలు, వీడియోలు తీసి పైశాచికం ప్రదర్శించాడు. "ఎవరికైనా చెబితే ఈ వీడియోలను కాలేజీ గ్రూపుల్లో పెడతాను," అని బెదిరించి, అదే రోజు రాత్రి 11:30 గంటలకు ఆమెను తిరిగి హాస్టల్ వద్ద వదిలేశాడు. ఘటన జరిగిన మరుసటి రోజు దిలీప్ తన అసలు స్వరూపాన్ని చూపిస్తూ.. తనకు, ఆమెకు ఎలాంటి సంబంధం లేదని, మళ్లీ కనిపిస్తే వీడియోలు వైరల్ చేస్తానని హెచ్చరించాడు. దిక్కుతోచని స్థితిలో బాధితురాలు భీమిలి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనపై విశాఖపట్నం సీపీ స్పందిస్తూ, కేసు దర్యాప్తు వేగంగా కొనసాగుతోందని, నిందితుడు దిలీప్‌ను త్వరలోనే అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**అన్నవరం (ఏడీఎన్ఎన్) :**

ప్రముఖ పుణ్యక్షేత్రం అన్నవరం దేవస్థానం ప్రసాదం నాణ్యత మరోసారి వివాదాస్పదమైంది. ఇటీవల ప్రసాదంలో నత్త వచ్చిందన్న వార్త మరవకముందే, తాజాగా ప్రసాదం విక్రయించే కౌంటర్లలో ఎలుకలు స్వైరవిహారం చేస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. భక్తుల మనోభావాలతో ముడిపడి ఉన్న ఈ అంశంపై దేవస్థానం అధికారులు కఠిన చర్యలు చేపట్టారు. విశాఖపట్నానికి చెందిన ఓ భక్తుడు అన్నవరం హైవేపై ఉన్న ప్రసాదం కౌంటర్‌కు వెళ్లిన సమయంలో ఈ విస్తుపోయే దృశ్యం వెలుగుచూసింది. ప్రసాదం నిల్వ ఉంచిన బుట్టల్లో ఎలుకలు దూరుతూ, పరుగులు పెడుతుండటాన్ని గమనించిన భక్తుడు దానిని వీడియో తీశారు. ప్రసాదం వంటి పవిత్రమైన పదార్థాల వద్ద పారిశుధ్యం లోపించడంపై భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కౌంటర్లో ఎలుకలు తిరుగుతున్న విషయాన్ని అక్కడి సిబ్బంది దృష్టికి తీసుకెళ్లగా, వారు బాధ్యతారాహిత్యంగా సమాధానం ఇచ్చారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. "ప్రసాదం కావాలంటే కొనుక్కోండి.. లేదంటే వెళ్ళిపోండి," అంటూ సిబ్బంది భక్తులపై దురుసుగా ప్రవర్తించినట్లు సమాచారం. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో భక్తుల




నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈ ఘటనపై దేవస్థానం ఈఓ తక్షణమే స్పందించారు. ప్రాథమిక విచారణ అనంతరం, విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు మరియు భక్తులతో అసభ్యంగా ప్రవర్తించినందుకు గాను ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రసాదం తయారీ నుంచి విక్రయం వరకు అన్ని చోట్లా పారిశుధ్య ప్రమాణాలు పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా, కొద్దిరోజుల క్రితం ప్రసాదంలో నత్త వచ్చిందంటూ ఒక జంట చేసిన ప్రచారంపై అధికారులు ఇప్పటికే స్పందించారు. అది కావాలని దేవస్థానం ప్రతిష్టను దెబ్బతీయడానికి చేసిన కుట్రగా పేర్కొంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం ఆ జంటపై కేసు నమోదై దర్యాప్తు కొనసాగుతోంది. వరుసగా ఇలాంటి ఘటనలు వెలుగులోకి వస్తుండటంతో అన్నవరం ప్రసాదం తయారీ కేంద్రంలో నిఘాను మరింత పెంచాలని భక్తులు కోరుతున్నారు.



# ఖండాంతరాలు దాటిన 'లేపాక్షి' ఖ్యాతి

**సింగపూర్ నుంచి 400 గిఫ్ట్ బాక్సులకు ఆర్డర్!**

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్ హస్తకళల వైభవం రాష్ట్రం, దేశం దాటి విదేశాలకు సైతం విస్తరిస్తోంది. సింగపూర్‌లోని భారత హైకమిషన్ ఏకంగా 400 గిఫ్ట్ బాక్సుల కోసం ఏపీ ప్రభుత్వ సంస్థ 'లేపాక్షి'కి ఆర్డర్ ఇవ్వడం విశేషం. ఏ నెల 26న సింగపూర్‌లోని భారత దౌత్య కార్యాలయంలో జరగనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు హాజరయ్యే ముఖ్య అతిథులకు ఈ ప్రత్యేక కానుకలను అందజేయనున్నారు. ఈ ఆర్డర్‌లో సీతాదేవి లెదర్ పప్పెట్రీ (తోలుబొమ్మలాట), ఏనుగు ఆకారపు బ్యాగేజ్ ట్యాగ్, హ్యాండ్ పెయింటెడ్ కోస్టర్లు వంటి అద్భుతమైన కళారూపాలను పొందుపరిచారు. గత ఏడాది ఢిల్లీ రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏపీ శకటానికి లభించిన గుర్తింపు ఇలాంటి అంతర్జాతీయ ఆర్డర్లు రావడానికి దోహదపడిందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత హర్షం వ్యక్తం చేశారు. ఏపీ హస్తకళలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు రావడం గర్వకారణమని, కూటమి ప్రభుత్వం కళాకారులకు పూర్తి అండగా నిలుస్తోందని ఆమె తెలిపారు. కళారూపాల తయారీలో ఆధునిక హంగులు అద్దేలా కళాకారులకు శిక్షణ ఇస్తున్నామని, అలాగే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 ప్రధాన లేపాక్షి షోరూంలను ఆధునికీకరించామని వెల్లడించారు. త్వరలోనే ఇతర దేశాల్లో కూడా లేపాక్షి షోరూంలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని మంత్రి ప్రకటించారు. ఈ అంతర్జాతీయ గుర్తింపుతో రాష్ట్ర హస్తకళల రంగానికి కొత్త ఊపు లభించినట్లయింది.



# విశాఖ భూములు మీ జాగీరా?

**విశాఖపట్నం (ఏడీఎన్ఎన్) :**

ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ పాలన ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం లేదని, విశాఖపట్నంలోని విలువైన ప్రభుత్వ భూములను ప్రైవేట్ వ్యక్తులకు దారదత్తం చేస్తున్నారని మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. విశాఖలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ఘాటు విమర్శలు చేశారు. విశాఖపట్నంలో అత్యంత విలువైన 57 ఎకరాల భూములను 'ఉర్సా' అనే కంపెనీకి ప్రభుత్వం అప్పనంగా అప్పగించిందని అమర్‌నాథ్ ఆరోపించారు. "ఎన్నికల ముందు భూములను కాపాడతామని అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు, ఇప్పుడు అవే భూములను దోచుకుంటున్నారు. ఎకరం రూ. 50 కోట్ల పైచిలుకు విలువ చేసే భూములను కారుచౌకగా ఎలా కట్టబెడతారు?," అని ఆయన ప్రశ్నించారు. ఈ భూ కేటాయింపుల వెనుక భారీ కుంభకోణం దాగి ఉందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. విశాఖలోని గీతం సంస్థ ఆధీనంలో సుమారు రూ. 5 వేల కోట్ల విలువైన భూములు ఉన్నాయని, ప్రైవేట్ వ్యక్తులకు ఇలాంటి విలువైన ఆస్తులను కట్టబెట్టడం ఏంటని ఆయన నిలదీశారు. దీనిపై ప్రజలకు ప్రభుత్వం కచ్చితంగా సమాధానం చెప్పి తీరాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యతను విస్మరించి, బినామీలకు మేలు చేసేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.




# ప్రకాశం జిల్లాలో భారీ ప్రమాదం

**రెండు బస్సులు,ఆటో ఢీ..**

**ఒకరు మృతి, 12 మందికి గాయాలు!**

**మార్కాపురం (ఏడీఎన్ఎన్) :**

ప్రకాశం జిల్లా కొనకనమిట్ల మండల పరిధిలోని చిన్నారికట్ల సమీపంలో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రెండు బస్సులు, ఒక ఆటో ఒకదానికొకటి ఢీకొన్న ఈ త్రిముఖ ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోగా, సుమారు 12 మంది ప్రయాణికులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా వేంపల్లి నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సు, మార్గమధ్యంలో చిన్నారికట్ల వద్ద ఆగి ఉన్న ఒక ఆటోను బలంగా ఢీకొట్టింది. అదే సమయంలో, ఎదురుగా విజయవాడ నుంచి కనిగిరి వైపు వస్తున్న మరో బస్సు అదుపుతప్పి, ప్రమాదానికి గురైన ప్రైవేట్ ట్రావెల్ బస్సును ఢీకొట్టింది. ఈ వరుస ప్రమాదాల ధాటికి బస్సుల్లో ప్రయాణిస్తున్న వారు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనలో కడప జిల్లా మైదుకూరు మండలంలోని చిన్నయ్య గారిపల్లి గ్రామానికి చెందిన అన్నపురెడ్డి జనార్ధన్ రెడ్డి (50) అక్కడికక్కడే మృతి చెందారు. రెండు బస్సుల్లో ప్రయాణిస్తున్న మరో 12 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని వెంటనే చికిత్స నిమిత్తం కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొనకనమిట్ల ఎస్ఐ శ్రీకాంత్ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు. తెల్లవారుజామున దట్టమైన మంచు లేదా అతివేగం ఈ ప్రమాదానికి కారణమై ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రస్తుతం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## అధికార మత్తులో సీఎం.. మద్యం మత్తులో క్యాడర్

### కాంగ్రెస్ నాయకులపై కేటీఆర్ సెటైర్లు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో కాంగ్రెస్ శ్రేణులు మద్యం మత్తులో వీర్రవీగుతూ విధ్వంసం సృష్టిస్తున్నాయని, శాంతిభద్రతలు గాలికి వదిలేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. 'ఎక్స్' వేదికగా శనివారం స్పందించిన ఆయన, ముఖ్యమంత్రి అధికార మత్తులో విదేశీ పర్యటనల్లో ఉంటే, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ గుండాలు వీధి రౌడీల్లా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. జనగామలో మంత్రి సీతక్క సమక్షంలోనే ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిపై జరిగిన దాడిని కేటీఆర్ ఖండించారు . అధికారిక శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాల వద్ద కూడా ఇకపై "డ్రంక్ అండ్ డ్రైవ్" టెస్టులు పెట్టాల్సిన దౌర్భాగ్య స్థితి తెలంగాణలో నెలకొందని ఎద్దేవా చేశారు. సీఎం స్వయంగా నేరాలను ప్రోత్సహించేలా వ్యవహరించడం వల్లే ఇలాంటి ఫ్యాక్షన్ సంస్కృతి వేళ్లూనుకుంటోందని, ఈ అరాచక పర్వానికి రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తప్పకుండా చరమగీతం పాడుతారని కేటీఆర్ హెచ్చరించారు.



## తప్పు చేయకుంటే భయమెందుకు

### కేటీఆర్, హరీశ్‌లకు మంత్రి జూపల్లి ప్రశ్న

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణ ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ అగ్రనేతలు కేటీఆర్, హరీశ్ రావులపై మంత్రి జూపల్లి కృష్ణారావు విమర్శనాస్త్రాలు సంధించారు. అధికారంలో ఉన్నప్పుడు అప్రజాస్వామిక చర్యలకు పాల్పడి, ఇప్పుడు విచారణను ఎదుర్కోవాల్సి వచ్చేసరికి 'రాజకీయ కక్ష' అంటూ బుకాయించడం బీఆర్ఎస్ నేతల ద్వంద్వ నీతికి నిదర్శనమని ఆయన ధ్వజమెత్తారు. ప్రజాభవన్ వేదికగా ఆయన శనివారం మాట్లాడుతూ, అసలు తప్పు చేయని పక్షంలో కేవలం సాక్షులుగా నోటీసులు ఇస్తేనే ఇంతలా ఎందుకు వణికిపోతున్నారని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఫోన్ ట్యాపింగ్ జరగకపోతే, రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ప్రభాకర్ రావు దేశం విడిచి విదేశాలకు ఎందుకు పారిపోయారో చెప్పాలని నిలదీశారు. గతంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్, మాజీ గవర్నర్ తమిళిసై వంటి వారే ఫోన్ ట్యాపింగ్ జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఈ అక్రమాల్లో పాత్రధారులు, సూత్రధారులు ఎవరనేది విచారణలో నిగ్గు తేలుతుందని జూపల్లి స్పష్టం చేశారు.



## మహిళా కానిస్టేబుల్‌పై గంజా బ్యాచ్ వీరంగం

**నిజామాబాద్ జిల్లా (ఏడీఎన్ఎన్) :**

నిజామాబాద్ జిల్లాలో గంజాయి అక్రమ రవాణాను అడ్డుకోబోయిన పోలీసులపై స్మగ్లర్లు క్రూరంగా దాడికి పాల్పడ్డారు. కారులో భారీగా గంజాయిని తరలిస్తున్నారన్న సమాచారంతో తనిఖీలు చేపట్టిన మహిళా కానిస్టేబుల్ సౌమ్యను నిందితులు తమ వాహనంతో ఢీకొట్టి పారిపోయే ప్రయత్నం చేశారు. విధుల్లో ఉన్న సౌమ్య అనుమానిత కారును ఆపాలని రోడ్డుపైకి వెళ్లగా, నిందితులు మరింత వేగంతో ఆమెను ఢీకొట్టడంతో ఆమె గాల్లోకి ఎగిరి పడి తీవ్రంగా గాయపడ్డారు. కానిస్టేబుల్ రక్తసిక్తం కావడాన్ని కూడా పట్టించుకోకుండా స్మగ్లర్లు అక్కడి నుంచి పరారయ్యారు. సౌమ్యను వెంటనే ఆసుపత్రికి తరలించగా, ప్రస్తుతం ఆమె పరిస్థితి స్థిరంగా ఉన్నప్పటికీ గాయాలు తీవ్రంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ఘటన జరిగిన వెంటనే అప్రమత్తమైన పోలీసులు జిల్లావ్యాప్తంగా నాకాబంధీ నిర్వహించి, ట్రాఫిక్ విభాగం సహాయంతో గంటల వ్యవధిలోనే నిందితులను కారుతో సహా అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి పెద్ద మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. యూనిఫామ్‌లో ఉన్న సిబ్బందిపై దాడికి పాల్పడిన వారిని వదిలిపెట్టబోమని, నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు స్పష్టం చేశారు.

## అధికారం పోయినా అహంకారం తగ్గలేదు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ వాడుతున్న భాష ఏమాత్రం సరిగా లేదని, ఆయన మతిలేకుండా మాట్లాడుతున్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. గత పదేళ్ల తమ పాలనలో అక్రమాలు జరిగినట్లుగానే ఇప్పుడు కూడా జరుగుతున్నాయని కేటీఆర్ భ్రమపడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలు ఇంకా తాము అధికారంలోనే ఉన్నామన్నట్లుగా వ్యవహరిస్తున్నారని, మళ్లీ అధికారంలోకి వస్తామని పగటి కలలు కంటున్నారని విమర్శించారు. కేవలం ప్రభుత్వంపై బురదజల్లడమే ప్రతిపక్ష పార్టీ పనిగా పెట్టుకుందని ఆయన ధ్వజమెత్తారు. వచ్చే మున్సిపల్ ఎన్నికలను తాను వ్యక్తిగతంగా ఒక 'రిఫరెండం'గా భావిస్తున్నట్లు పొంగులేటి స్పష్టం చేశారు. గతంలో రెండుసార్లు కేటీఆర్ వీటిని రిఫరెండం అని అన్నారని, ఇప్పుడు మళ్లీ అదే మాట అంటున్నారని, అయితే గత ఎన్నికల్లో జరిగిన ఫలితమే ఈ ఎన్నికల్లోనూ పునరావృతమవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఎలాంటి శాస్త్రీయత లేకుండా ఇష్టం వచ్చినట్లు జిల్లాలను ఏర్పాటు చేసిందని, ఇప్పుడు వాటిని అగ్నిగుండం చేస్తామంటూ బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ప్రజల ఆమోదానికి అనుగుణంగా, శాస్త్రీయ పద్ధతిలో జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపడతామని మంత్రి వెల్లడించారు.

## దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ మద్దతు

### కేంద్ర కార్మిక విధానాలపై వినోద్ కుమార్ ధ్వజం




**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

కేంద్ర ప్రభుత్వ కార్మిక విధానాలను నిరసిస్తూ వివిధ కార్మిక సంఘాల పిలుపు మేరకు వచ్చే నెల ఫిబ్రవరి 12న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శనివారం జరిగిన బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర స్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సమ్మెలో బీఆర్ఎస్ శ్రేణులు ప్రత్యక్షంగా పాల్గొంటాయని, కార్మికుల హక్కుల కోసం జరిగే ఈ పోరాటాన్ని విజయవంతం చేయాలని పార్టీ పిలుపునిచ్చింది. సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే పనిచేస్తోందని విమర్శించారు. ప్రస్తుత పెట్టుబడిదారీ వ్యవస్థలో కార్మికుల హక్కులు కాలరాయబడుతున్నాయని, గతంలో ఉన్న అనేక వెసులుబాటులను యాజమాన్యాలు క్రమంగా తొలగిస్తున్నాయని వినోద్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ ఉన్నా, కాంగ్రెస్ ఉన్నా కార్మికుల పట్ల అనుసరిస్తున్న విధానాల్లో ఎలాంటి మార్పు లేదని దుయ్యబట్టారు. శ్రమను హక్కుగా కాకుండా ధర్మంగా పరిగణించాలని ఇటీవల ప్రభుత్వం చేసిన వ్యాఖ్యలను ఆయన తప్పుబట్టారు. యాజమాన్యాల దోపిడీ ఉన్నంత వరకు కార్మిక సంఘాల పోరాటాలు కొనసాగుతూనే ఉంటాయని, లేబర్ కోడ్ ల పేరుతో తీసుకువచ్చిన కొత్త చట్టాల వల్ల కార్మికులకు జరిగే అన్యాయాన్ని ప్రజలందరికీ వివరించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా గిగ్ వర్కర్ల పట్ల ఉన్న 10 నిమిషాల డెలివరీ నిబంధనపై వినోద్ కుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అశాస్త్రీయమైన ఇటువంటి నిబంధనల వల్ల ఎంతో మంది గిగ్ వర్కర్లు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోయారని గుర్తు చేశారు. తాజాగా ఈ నిబంధనను ఎత్తివేసినప్పటికీ, ఇలాంటి ప్రాణాంతక నిబంధనలను అసలు ఎలా ప్రవేశపెడతారని ఆయన ప్రశ్నించారు. ఈ సమావేశంలో కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌తో పాటు పలు కార్మిక సంఘాల నాయకులు పాల్గొని, ఫిబ్రవరి 12 నాటి సమ్మెకు సన్నద్ధం కావాలని క్యాడర్‌కు దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం తన మొండి వైఖరిని వీడే వరకు ఈ పోరాటం ఆగదని సమావేశం స్పష్టం చేసింది.

## జీహెచ్ఎంసీలో కంటోన్మెంట్ విలీనం చేయండి...

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సికింద్రాబాద్ కంటోన్మెంట్‌ను జీహెచ్ఎంసీలో విలీనం చేయాలనే డిమాండ్‌తో ఎమ్మెల్యే గణేష్ చేపట్టిన దీక్షకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తన పూర్తి మద్దతు తెలిపారు. కంటోన్మెంట్ ప్రాంతంలో జరుగుతున్న వివక్షను పోగొట్టి, అభివృద్ధిని సమానంగా అందించాలనే లక్ష్యంతో ఈ దీక్షకు మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. విలీన ప్రక్రియను వేగవంతం చేయాలని కోరుతూ కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్‌తో పాటు తెలంగాణ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లకు ఆయన లేఖలు రాశారు. కంటోన్మెంట్ విలీనం అనేది కేంద్ర ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయమని, ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. అభివృద్ధిలో వెనుకబాటుతనం మరియు వివక్షపై ఎమ్మెల్యే చేస్తున్న పోరాటం సరైనదేనని, రాష్ట్ర ప్రభుత్వం తరపున విలీన ప్రక్రియ త్వరగా పూర్తి కావాలని కోరుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు.




## ఫోన్ ట్యాపింగ్ కేసు ఒక పొలిటికల్ డ్రామా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



తెలంగాణలో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు తీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ పేరుతో పెద్ద డ్రామా నడుస్తోందని, ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి రాజకీయ కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ఫోన్ ట్యాపింగ్ అనేది రాజ్యాంగ ఉల్లంఘన అని, అయినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే విచారణను సాగదీస్తోందని మండిపడ్డారు. పాలక, ప్రతిపక్ష పార్టీలు పరస్పర సహకారంతో ఈ విచారణను ఒక ప్రహసనంగా మార్చాయని, ట్యాపింగ్ వల్ల నష్టపోయిన బాధితులకు న్యాయం జరగాలంటే విచారణను వేగవంతం చేసి అసలైన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## హెచ్చరికలకు భయపడను.. ఆధారాలతోనే జవాబిస్తా

### సీపీ సజ్జనార్ నోటీసులపై ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందన

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



ఫోన్ ట్యాపింగ్ కేసులో విచారణాధికారి, సీపీ సజ్జనార్ జారీ చేసిన నోటీసులపై బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ స్పందించారు. సజ్జనార్ ఇచ్చిన నోటీసులకు తన వద్ద ఉన్న పక్కా సమాచారంతోనే జవాబు ఇస్తానని, ఆ తర్వాత వారు ఏ చర్యలు తీసుకున్నా ఎదుర్కోవడానికి సిద్ధమని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్' వేదికగా ఆయన శనివారం సమాధానమిచ్చారు . ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావులకు ఎటువంటి సంబంధం లేకపోయినా, సిట్ అధికారులు గంటల తరబడి విచారణ పేరిట వేధిస్తున్నారని ప్రవీణ్ కుమార్ విమర్శించారు. ఈ వేధింపులను తాను ఖండించిన కేవలం 12 గంటల్లోనే పోలీసులు తన ఇంటికి వచ్చి నోటీసులు ఇవ్వడం ప్రభుత్వ కక్షసాధింపు చర్యలకు నిదర్శనమని ఆయన మండిపడ్డారు. ప్రజా సమస్యలపై గొంతెత్తడం తన హక్కని, ఇటువంటి వార్నింగ్‌లకు భయపడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు.తాను ఎన్నడూ వ్యక్తిగత దూషణలకు పాల్పడనని, చిల్లర భాష వాడనని ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. సజ్జనార్ సహా ఏ అధికారిని లేదా రాజకీయ నాయకుడిని వ్యక్తిగతంగా దూషించే సంస్కృతి తనకు లేదన్నారు. అయితే, వాస్తవాలను దాచబోనని, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తన పోరాటం ఆపబోనని స్పష్టం చేశారు. గతంలో ఏపీలో నమోదైన కేసుల నేపథ్యంలో సజ్జనార్‌పై తాను చేసిన వ్యాఖ్యలు వాస్తవ విరుద్ధమని నోటీసులో పేర్కొనడాన్ని ఆయన తోసిపుచ్చారు. పోలీస్ అధికారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ ఆడుతున్న రాజకీయ క్రీడలో పావులుగా మారవద్దని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ హితవు పలికారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ తీరును తప్పుబడుతూ, నాటి డీజీపీ, హోం సెక్రెటరీ, సీఎస్ వంటి కీలక ఉన్నతాధికారులను వదిలేసి, కేవలం విశ్రాంత ఐపీఎస్ ప్రభాకర్ రావు, ఆయన కుటుంబ సభ్యులు , కింది స్థాయి సిబ్బందిని లక్ష్యంగా చేసుకుని వేధించడం అన్యాయమని ఆయన ప్రశ్నించారు. రెండు రోజుల్లో ఆధారాలతో సమాధానం ఇవ్వకపోతే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్న హెచ్చరికలపై స్పందిస్తూ, తన వద్ద ఉన్న సమాచారంతోనే ఈ నోటీసులకు ధీటుగా బదులిస్తానని ఆయన పునరుద్ఘాటించారు. రాజ్యాంగం కల్పించిన భావప్రకటనా స్వేచ్ఛతో తాను వాస్తవాలను ప్రజల ముందు ఉంచుతున్నానని, ఈ వ్యవహారాన్ని చట్టపరంగానే ఎదుర్కొంటానని ప్రవీణ్ కుమార్ స్పష్టం చేశారు.

## నైనీ టెండర్లపై కేంద్రం విచారణ

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



నైనీ బొగ్గు గని టెండర్ల ప్రక్రియలో చోటుచేసుకున్న వివాదంపై కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. టెండర్ల ఖరారులో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉన్నత స్థాయి సాంకేతిక కమిటీ రంగంలోకి దిగింది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో ఈ బృందం టెండర్ల ప్రక్రియకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. కేంద్ర బొగ్గు శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ చేతనా శుక్లా, టెక్నికల్ డైరెక్టర్ మారపల్లి వెంకటేశ్వర్లుతో కూడిన ద్విసభ్య కమిటీ సింగరేణి సీఎండీ కృష్ణ భాస్కర్‌తో భేటీ అయింది. శుక్రవారం రాత్రి సుమారు ఏడు గంటల పాటు సాగిన ఈ విచారణలో టెండర్ నిబంధనలు, సీఎస్ఆర్ నిధుల వినియోగం, కాంట్రాక్టుల కేటాయింపులో అనుసరించిన పద్ధతులపై అధికారులు ఆరా తీశారు. శనివారం కూడా విచారణ కొనసాగింది. నిబంధన ప్రధానంగా నైనీ బొగ్గు బ్లాక్ టెండర్ నోటిఫికేషన్‌లో పొందుపరిచిన 'సైట్ విజిట్ సర్టిఫికేట్' నిబంధనపైనే ఈ వివాదం రాజుకుంది. ఈ నిబంధన వల్ల పారదర్శకత లోపించి, అక్రమాలకు ఆస్కారం ఏర్పడిందనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క టెండర్లను రద్దు చేయాలని ఆదేశించారు. అసలు టెండర్ల రద్దుకు దారితీసిన పరిస్థితులు, వాస్తవ కారణాలను కేంద్ర బృందం సాంకేతికంగా విశ్లేషిస్తోంది కేంద్ర మంత్రి ఆదేశాల మేరకు సింగరేణిలో పర్యటిస్తున్న ఈ బృందం విచారణను వేగవంతం చేసింది. క్షేత్రస్థాయిలో, రికార్డుల పరంగా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి, వచ్చే సోమవారం నాటికి సమగ్ర నివేదికను కేంద్రానికి సమర్పించనుంది. ఈ నివేదిక ఆధారంగా కేంద్రం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



## ఎర్రవల్లిలో గులాబీ దళం అత్యవసర భేటీ

### ఫోన్ ట్యాపింగ్ సెగపై కేసీఆర్ దిశానిర్దేశం

రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణ వేగవంతమైన వేళ, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ రంగంలోకి దిగారు. శనివారం మధ్యాహ్నం ఎర్రవల్లిలోని తన ఫామ్ హౌస్‌లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుతో పాటు పలువురు కీలక నేతలతో ఆయన భేటీ అయ్యారు. దాదాపు రెండు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో కేసు పూర్వాపరాలతో పాటు భవిష్యత్ రాజకీయ వ్యూహాలపై చర్చించినట్లు తెలుస్తోంది. ఇటీవలే ఈ కేసులో కేటీఆర్, హరీశ్ రావులను 'సిట్' సుదీర్ఘంగా విచారించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో అధికారులు అడిగిన ప్రశ్నలు, విచారణా సరళిని కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. ఈ వ్యవహారాన్ని కేవలం రాజకీయ వేధింపులుగానే కాకుండా, చట్టపరంగా ఎలా తిప్పికొట్టాలనే అంశంపై నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. అధికార పక్షం ఇస్తున్న 'లీకుల'పై వ్యూహాత్మకంగా స్పందించాలని సూచించినట్లు సమాచారం.కేవలం కేసులకే పరిమితం కాకుండా, రాబోయే మున్సిపల్ ఎన్నికలపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి సారించారు. మున్సిపల్ పోరు పార్టీకి జీవన్మరణ సమస్యని , క్షేత్రస్థాయిలో కేడర్‌లో ధైర్యం నింపండని నేతలకు హితబోధ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇందుకోసం జిల్లా స్థాయి ఇన్ ఛార్జ్ ల నియామకం, ప్రచార అస్త్రాల రూపకల్పనపై చర్చించారు. సమావేశం తర్వాత బయటకు వచ్చిన నేతలు నేరుగా స్పందించనప్పటికీ, కేసీఆర్ సూచనలతో వారు కొత్త ఉత్సాహంతో కనిపిస్తున్నారు. ఈ భేటీతో అటు విచారణను ఎదుర్కోవడానికి, ఇటు ఎన్నికల రణక్షేత్రంలోకి దూకడానికి బీఆర్ఎస్ ఒక స్పష్టమైన రోడ్ మ్యాప్ సిద్ధం చేసుకున్నట్లు రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.



## ఫోన్ ట్యాపింగ్ విచారణ అంతా డ్రామా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

ఫోన్ ట్యాపింగ్ విచారణ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఆడుతున్న డ్రామాలతో అభాసుపాలవుతోందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ధ్వజమెత్తారు. హకీంపేటలో మీడియాతో శనివారం మాట్లాడిన ఆయన, ఫోన్ ట్యాపింగ్‌తో అందరి కొంపలు ముంచిన కేటీఆర్‌ను సాక్షిగా పిలిచి వాంగ్మూలం తీసుకోవడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఫాంహౌస్‌కు, ఏఐసీసీకి మధ్య రాజకీయ డీల్ కుదిరే వరకు ఈ విచారణ ప్రహసనాన్ని ఇలాగే కొనసాగిస్తారని ఆయన ఆరోపించారు. సిట్‌లో సమర్థవంతమైన, నిజాయితీ గల అధికారులు ఉన్నప్పటికీ, ప్రభుత్వం వారిని స్వేచ్ఛగా పనిచేయనివ్వడం లేదని సంజయ్ మండిపడ్డారు. తాము చెప్పినట్లే విచారణ జరగాలని అధికారులపై ఒత్తిడి తెస్తూ, బెదిరింపులకు పాల్పడుతోందని విమర్శించారు. ప్రస్తుత విచారణ తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు.రాష్ట్రంలో నిరుద్యోగులు ఉద్యోగాల్లేక అల్లాడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బండి సంజయ్ విమర్శించారు. టీజీపీఎస్సీ అంటేనే లీకేజీలు, పైరవీలు, కోర్టు కేసులకు నిలయంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి విరుద్ధంగా ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం ఒక్క పైరవీకి కూడా తావులేకుండా జాబ్ క్యాలెండర్ ప్రకారం పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేస్తోందని గుర్తుచేశారు. నిరుద్యోగులు ఆందోళన చెందాల్సిన పనిలేదని, కేంద్రం ప్రవేశపెట్టిన స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా వంటి పథకాల ద్వారా యువత సొంతంగా ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.



## బండి, అరవింద్ లకు కేటీఆర్ లీగల్ నోటీసులు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాజకీయాల్లో మరోసారి లీగల్ నోటీసుల పర్వం కలకలం సృష్టిస్తోంది. తనపై నిరాధారమైన ఆరోపణలు చేశారంటూ కేంద్రమంత్రి బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ లకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ న్యాయవాదుల ద్వారా నోటీసులు పంపించారు. తన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా, ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని సడలించేలా బాధ్యతాయుత పదవుల్లో ఉన్న వ్యక్తులు అడ్డగోలుగా మాట్లాడటంపై కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఐదు రోజుల్లోగా తాము చేసిన ఆరోపణలపై వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనియెడల పరువునష్టం దావా వేస్తానని కేటీఆర్ హెచ్చరించారు. బండి సంజయ్‌కు పంపిన నోటీసులో ప్రధానంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై ఆయన చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. కేటీఆర్ కుటుంబం ఫోన్ ట్యాపింగ్ ద్వారా వేల కోట్లు సంపాదించిందని, సెలబ్రిటీల ఫోన్లు ట్యాప్ చేశారంటూ జనవరి 23న బండి సంజయ్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని కేటీఆర్ న్యాయవాదులు స్పష్టం చేశారు. సాక్ష్యాధారాలు లేకుండా కేవలం దురుద్దేశపూర్వకంగా, రాజకీయ లబ్ధి కోసమే ఇటువంటి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు. ఇప్పటికే బండి సంజయ్ గతంలో చేసిన వ్యాఖ్యలపై కోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, మరోసారి చట్టవ్యతిరేకంగా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. మరోవైపు ఎంపీ ధర్మపురి అరవింద్‌కు పంపిన నోటీసులో ఆయన చేసిన వ్యక్తిగత దూషణలను తప్పుబట్టారు. కేటీఆర్ డ్రగ్స్ సేవించడంతో పాటు సరఫరా చేస్తున్నారంటూ అరవింద్ చేసిన వ్యాఖ్యలు అత్యంత ఆక్షేపణీయమని పేర్కొన్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా ఒక వ్యక్తిపై డ్రగ్స్ ఆరోపణలు చేయడం రాజకీయ కక్షసాధింపేనని న్యాయవాదులు నోటీసులో వివరించారు. కేవలం రాజకీయాల కోసం సాక్ష్యాధారాలు లేని ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని, తక్షణమే ఈ వ్యాఖ్యలపై సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## రాశి ఫలాలు

**25-01-2026 ఆదివారం**

**మేషం:**
రాదనుకున్న డబ్బు చేతికి అందుతుంది. వ్యాపారంలో దూసుకుపోతారు. ఆదాయం బాగానే వృద్ధి చెందుతుంది. షేర్లు, స్పెక్యులేషన్లు బాగా లాభిస్తాయి. ఆస్తి వివాదానికి సంబంధించి శుభవార్త వింటారు. బంధువుల్లో పెళ్లి సంబంధం కుదిరే అవకాశం ఉంది. ముఖ్యమైన వ్యవహారాలు ఊపందుకుంటాయి. నిరుద్యోగులు, ఉద్యోగులకు ఊహించని కొత్త ఉద్యోగావకాశాలు అందుతాయి.

**వృషభం:**
సర్వత్రా మీ మాటకు విలువ పెరుగుతుంది. ఉద్యోగంలో అధికారుల ఆదరణ, ప్రోత్సాహం లభిస్తాయి. కొత్త బాధ్యతలను చేపట్టడం జరుగుతుంది. వృత్తి జీవితంలో ఆశించిన గుర్తింపు లభిస్తుంది. వ్యాపారాలు బాగా కలిసి వస్తాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు చాలావరకు సఫలం అవుతాయి. ప్రయాణాలు ఇబ్బంది పెడతాయి. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి.

**మిథునం:**
వ్యక్తిగత, ఆర్థిక సమస్యలు పరిష్కారమై ఊరట లభిస్తుంది. ఆస్తి వివాదాలు రాజీమార్గంలో పరిష్కారమయ్యే అవకాశం ఉంది. ఆరోగ్యానికి ఇబ్బందేమీ ఉండదు. ఆదాయం కొద్దిగా పెరిగే అవకాశం ఉంది. ఎదురు చూస్తున్న శుభవార్తలు వింటారు. వ్యక్తిగత జీవితం బాగా బిజీగా సాగుతుంది. ఆర్థిక ప్రయోజనాలు చేకూరుతాయి. వృత్తి, ఉద్యోగాల్లో మీ మాటకు, చేతకు విలువ పెరుగుతుంది. వ్యాపారాలు జోరందుకుంటాయి.

**కర్కాటకం:**
రావలసిన సొమ్ము, బాకీలు పూర్తిగా చేతికి అందుతాయి. తక్కువ శ్రమతో ఎక్కువ లాభాలు పొందుతారు. ఆరోగ్యం బాగానే ఉంటుంది. కుటుంబ సభ్యుల మీద ఖర్చులు పెరుగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలను పట్టుదలగా పూర్తి చేస్తారు. వృత్తి, ఉద్యోగాలలో ప్రోత్సాహకాలు అందుకుంటారు. వ్యాపార లావాదేవీలు చాలా వరకు లాభాల బాటలో సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది.

**సింహం:**
ఉద్యోగపరంగా శుభవార్తలు అందుతాయి. ప్రతిష్ఠాత్మక కంపెనీలతో పాటు, విదేశీ ఆఫర్లు అందే అవకాశం కూడా ఉంది. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. కొద్దిగా శ్రమ, తిప్పట ఉన్నప్పటికీ ముఖ్యమైన ఆస్తి, ఆర్థిక వ్యవహారాలు సంతృప్తికరంగా చక్కబడతాయి. అనుకున్న పనులు అనుకున్నట్టు పూర్తవుతాయి. ఆర్థికంగా మంచి అదృష్టం పట్టే అవకాశం ఉంది. వ్యాపారాల్లో అంచనాలకు మించి రాబడి పెరుగుతుంది.

**కన్య:**
ఆర్థిక బలం బాగా పెరుగుతుంది. అనేక విధాలుగా కలిసి వచ్చే అవకాశం ఉంది. ముఖ్యమైన కుటుంబ వ్యవహారాలను చక్కబెడతారు. వ్యక్తిగత సమస్యలు చాలావరకు పరిష్కారం అవుతాయి. ఉద్యోగంలో బరువు బాధ్యతలు పెరిగే సూచనలున్నాయి. అధికారులు మీ పని తీరును బాగా మెచ్చుకుంటారు. వృత్తి, వ్యాపారాల్లో అనుకూల పరిస్థితులుంటాయి.

**తుల:**
అనేక విధాలుగా ఆదాయం వృద్ధి చెందుతుంది. షేర్లు, స్పెక్యులేషన్ల వంటివి బాగా లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ఇదివరకటి కంటే బాగా మెరుగ్గా ఉంటుంది. ఉద్యోగంలో ప్రాధాన్యం పెరుగుతుంది. అధికార యోగం పట్టే అవకాశం కూడా ఉంది. తోబుట్టువుల సహాయ సహకారాలతో ఆస్తి వివాదం పరిష్కారం అవుతుంది. ప్రముఖుల నుంచి గౌరవ మర్యాదలు లభిస్తాయి. వృత్తి, వ్యాపారాలు ఆశా జనకంగా సాగిపోతాయి.

**వృశ్చికం:**
ఆదాయం వృద్ధి చెందుతుంది. వృత్తి, వ్యాపారాల్లో రాబడి పెరుగుతుంది. ఆర్థిక లావాదేవీలు లాభిస్తాయి. ఉద్యోగ జీవితం సానుకూలంగా సాగిపోతుంది. కుటుంబ వ్యవహారాల్లో బంధువుల్ని తలదూర్చనివ్వవద్దు. ఆర్థికసాయం అందించడంలో ఆచితూచి వ్యవహరించడం మంచిది. కొందరు మిత్రుల వల్ల నష్టపోయే అవకాశం ఉంది.

**ధనస్సు:**
సమాజంలోని ముఖ్యమైన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. ఆర్థిక పరిస్థితి బాగా మెరుగు పడుతుంది. ముఖ్యమైన ఆస్తి, ఆర్థిక వ్యవహారాలను పట్టుదలగా పూర్తి చేస్తారు. పిల్లల చదువులకు సంబంధించి సంతృప్తికరమైన సమాచారం అందుకుంటారు. ఉద్యోగంలో ప్రాధాన్యం, ప్రాభవం పెరుగుతాయి. వృత్తి, వ్యాపారాల్లో పెట్టుబడులకు తగిన లాభాలు అందుకుంటారు.

**మకరం:**
కొత్త ఆదాయ మార్గాలు ఏర్పడతాయి. ఆర్థిక పరిస్థితి మరింతగా అనుకూలంగా ఉంటుంది. ఆదాయానికి మించి కుటుంబ ఖర్చులు పెరిగే అవకాశం ఉంది. వృత్తి, వ్యాపారాల్లో సొంత ఆలోచనల మీద ఆధారపడడం మంచిది. కుటుంబ సభ్యుల నుంచి సహకారం లభిస్తుంది. ప్రేమ వ్యవహారాల్లో కాస్తంత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉంది. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలు బాగా తగ్గుతాయి. ఆస్తి వివాదం ఒకటి పరిష్కారం అవుతుంది.

**కుంభం:**
ఆదాయానికి లోటుండదు కానీ ఖర్చులు బాగా పెరుగుతాయి. ఉద్యోగంలో ఓర్పు, సహనాలతో వ్యవహరించడం మంచిది. ఆర్థిక విషయాల్లో ఎవరినీ గుడ్డిగా నమ్మవద్దు. ఎవరితోనూ ఆర్థిక లావాదేవీలు పెట్టుకోవద్దు. ఆదాయ మార్గాలు తగ్గే అవకాశం ఉంది. ఆర్థిక పరిస్థితి నిలకడగా ఉంటుంది.

**మీనం:**
ఆశించిన శుభవార్తలు వింటారు. వృత్తి, ఉద్యోగాలపరంగానూ, ఆర్థికంగానూ స్థిరపడే అవకాశం ఉంది. అనేక మార్గాల్లో ఆదాయం వృద్ధి చెందుతుంది. ఇతరులకు మేలు జరిగే పనులు చేస్తారు. లాభదాయక పరిచయాలు ఏర్పడతాయి. ఎటు వంటి ప్రయత్నం తలపెట్టినా విజయం సాధిస్తారు.

# కనకదుర్గమ్మ చీరల పేరుతో సైబర్ మోసాలు

**విజయవాడ (ఏడీఎన్ఎన్) :**



విజయవాడలోని కనకదుర్గమ్మ ఆలయం పేరుతో సైబర్ నేరగాళ్లు భక్తులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్నారు. ఆలయం నుంచి మాట్లాడుతున్నామని చెప్పి ఫోన్ కాల్స్ చేసి, అమ్మవారి పట్టు చీరలు ఇంటికి పంపిస్తామని, భక్తుల పేరు-గోత్రనామాలతో ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని నమ్మబలికి డబ్బులు వసూలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ఈ విషయం భక్తుల ఫిర్యాదుల ద్వారా ఆలయ అధికారుల దృష్టికి రావడంతో వారు అప్రమత్తమయ్యారు. దేవస్థానం తరపున ఎవరూ వ్యక్తిగతంగా ఫోన్ చేసి వివరాలు, చెల్లింపులు లేదా బ్యాంకు సమాచారం అడగరని ఆలయ ఈవో శీనా నాయక్ స్పష్టం చేశారు. దర్శనాలు, ఆర్జిత సేవలు, ప్రత్యేక పూజల వివరాలు దేశంలో ఉన్నా.. విదేశాల్లో ఉన్నా కేవలం ఆలయ అధికారిక వెబ్‌సైట్, సమాచార కేంద్రం లేదా 'మన మిత్ర' వాట్సాప్ సేవల ద్వారానే తెలుసుకోవాలని సూచించారు. డబ్బులు చెల్లిస్తే అమ్మవారి చీరలు పంపిస్తామని లేదా ప్రత్యేక పూజలు చేస్తామని చెప్పే ఫోన్ కాల్స్ పూర్తిగా సైబర్ మోసగాళ్లవేనని ఈవో తెలిపారు. ఇటువంటి ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో భక్తులకు అవగాహన కల్పించేందుకు ఆలయ ప్రాంగణంలో మైక్ ద్వారా హెచ్చరికలు, సూచనల బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే దర్శనం, ఆర్జిత సేవల టికెట్ల బుకింగ్ ఆలయ అధికారిక వెబ్‌సైట్‌లో మాత్రమే ఉంటుందని, ఫోన్ ద్వారా ఎలాంటి బుకింగ్ సదుపాయం లేదని స్పష్టం చేశారు. అపరిచిత వ్యక్తులు ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు లేదా యూపీఐ లింకులు అడిగితే ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మవద్దని భక్తులకు అధికారులు హెచ్చరిక జారీ చేశారు. అనుమానాస్పద కాల్స్ లేదా మెసేజ్‌లు వస్తే వెంటనే పోలీసులకు లేదా దేవస్థానం అధికారులకు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# అరసవల్లిలో వైభవంగా రథసప్తమి వేడుకలు

**అరసవల్లి (ఏడీఎన్ఎన్) :**

శ్రీకాకుళం జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో శనివారం రాత్రి నుండి ప్రారంభమైన రథసప్తమి వేడుకలు సాంప్రదాయ భక్తి, ఆధ్యాత్మిక శోభతో కొనసాగుతున్నాయి. సూర్యభగవానుని ఆరాధన దినంగా జ్ఞాన, ఆరోగ్య, శ్రేయస్సుకు ఉపకారకంగా భావించే వేడుక. ఇలా సంవత్సరంలో ఈ పుణ్యదినం భక్తులు ప్రత్యేక స్నానం, సూర్యనమస్కారాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమం ప్రత్యేక పూజలు, ఆరాధనలతో పాటు సాంస్కృతిక ప్రదర్శనలు, వినోద కార్యక్రమాల అవకాశాలతో భారీగా రూపుదిద్దుకుంటోంది. శనివారం అర్ధరాత్రి 12:05 గంటలకు తొలి పూజలు వైభవంగా ప్రారంభమయ్యాయి. అనంతరం ఆదివారం ఉదయం 7:30 వరకు శాస్త్రోక్త విధానంలో ప్రత్యేక క్షీరాభిషేకం, మంత్రోచ్చారణలు జరిగాయి. రథసప్తమి సందర్భంగా స్వామి విశేష నిజరూప దర్శనం కల్పించారు. ఈ క్షేత్రంలో సూర్యభగవానుడు స్వర్ణాభరణ అలంకృతుడై భక్తులకు సాక్షాత్కరిస్తున్నారు. సూర్యోదయం వేళ భక్తులు సూర్యభగవానుని దర్శనాన్ని పొందారు. ఈ సందర్భంగా రాష్ట్రమంత్రి కింజరపు అచ్చెన్నాయుడు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సంవత్సరం వేడుకల్లో హెలికాప్టర్ రైడ్స్, హాట్ ఎయిర్ బెలూన్ ప్రయాణాలు వంటి ప్రత్యేక ఆకర్షణలు కూడా ఏర్పాటు చేశారు, ఇవి భక్తులు, సందర్శకులకు కొత్త అనుభవాలను అందిస్తున్నాయి. జిల్లా అధికారులు, అధికారులు అన్ని భద్రతా, క్యూలైన్, తాగునీటి సదుపాయాలతో పూర్తి ఏర్పాట్లు చేశారని పేర్కొంటున్నారు. రథసప్తమి సందర్భంగా ఉన్నత స్థాయిలో సాంస్కృతిక ప్రదర్శనలు కూడా నిర్వహిస్తున్నారు. వీటిలో ప్రజలు పాల్గొని పండుగ వేళ సంబరాల ఉత్సాహాన్ని పెంచుతున్నారు. అదేవిధంగా గ్రామీణ క్రీడలు, వంటి కార్యక్రమాలు కూడా నిర్వర్తించబడుతున్నాయి, ఇవి భక్తులను అలరిస్తున్నాయి.



ప్రతి సంవత్సరం రథసప్తమి నాడు ఆకర్షణీయంగా జరిపే ఈ పండుగకు ఈసారి కూడా లక్షలాది మంది భక్తులు తరలి వచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారులు కూడా ఈ వేడుకను విశేషంగా నిర్వహించేందుకు అన్ని భద్రతా పరమైన చర్యలను చేపట్టారు.

## రథసప్తమి రోజు చిన్నారులకు
# విశిష్ట స్నానంతో శుభఫలితాలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

సూర్యుడు దక్షిణాయణం ముగించి ఉత్తరాయణానికి ప్రయాణం ప్రారంభించే శుభముహూర్తాన రథసప్తమి పండుగ వస్తుంది. మాఘ మాసం శుక్లపక్ష సప్తమి తిథి రోజున వచ్చే ఈ పండుగను సూర్య జయంతిగా కూడా పిలుస్తారు. ఈ రోజున చిన్న పిల్లలకు స్నానం చేసే సమయంలో కొన్ని నియమాలు పాటిస్తే శుభప్రదమని పండితులు చెబుతారు. ఈరోజున సూర్యోదయానికి ఒక గంట ముందే స్నానం చేయించాలి. ఈ సమయంలో పిల్లలను తూర్పు ముఖంగా కూర్చోబెట్టి అర్క పత్రాలు అంటే జిల్లేడు ఆకులను తల, భుజాలు, ఛాతీ, మోచేతులు, మోకాళ్లు, అర చేతుల్లో మొత్తం 7 జిల్లేడు ఆకులను ఉంచి స్నానం చేయించాలి. అనంతరం సూర్యుడికి అర్ఘ్యం సమర్పించాలి. ఈ సమయంలో సూర్య మంత్రాలను పఠించడం ఎంతో శుభప్రదం. ఇలా చేయడం వల్ల ఆరోగ్యం, దీర్ఘాయుష్షు, సిరి



సంపదలు కలుగుతాయని పెద్దలు చెబుతారు. ఈ ఏడాది ఆదివారం, సప్తమి తిథి కలిసి రావడంతో ఆ పుణ్యం రెట్టింపవుతుందని భక్తులు నమ్ముతున్నారు. ఈ రోజున సూర్యుడికి అర్ఘ్యం ఇవ్వడం, పాలు పొంగించి పాయసం చేసి నైవేద్యంగా సమర్పించడం శుభప్రదం. ఈ రోజున ఉప్పు తినకూడదని, ఉప్పు దానం చేయడం శుభకరమని చెబుతారు. నువ్వుల నూనెతో దీపం వెలిగించి నీటిలో వదిలితే కుటుంబ జీవితం సుఖసంతోషాలతో సాగుతుందని విశ్వాసం. బెల్లం, ఆవు నెయ్యితో చేసిన పరమాన్నం నైవేద్యంగా సమర్పించడం, దానధర్మాలు చేయడం ద్వారా సూర్యగ్రహ బలం పెరుగుతుందని శాస్త్రోక్తి. రథసప్తమి సూర్యారాధనతో పాటు ఆరోగ్యం, శ్రేయస్సు, సకల శుభాలు ప్రసాదించే పుణ్యపర్వదినంగా భక్తులు విశ్వసిస్తున్నారు. ఈ మాఘ సప్తమి తిథి నుంచి రానున్న ఆరు మాసాలను ఉత్తరాయణ పుణ్యకాలంగా పరిగణిస్తారు.

# మున్సిపల్ పోరుకు బీఆర్ఎస్ సిద్ధం

**కార్పొరేషన్లు, మున్సిపాలిటీలకు ఇన్‌చార్జీలు**


**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

రాష్ట్రంలో త్వరలో జరగనున్న పురపాలక ఎన్నికల కోసం భారత రాష్ట్ర సమితి తన వ్యూహాలకు పదును పెట్టింది. ఎన్నికలు జరగనున్న కార్పొరేషన్లు, మున్సిపాలిటీల వారీగా సమన్వయ కర్తలను నియమిస్తూ ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌కు ఒక సీనియర్ నాయకుడిని బాధ్యుడిగా నియమించి, క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులను సమన్వయం చేసే బాధ్యతను వారికి అప్పగించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ముగిసే వరకు సమన్వయకర్తలు ఆయా ప్రాంతాల్లోనే అందుబాటులో ఉండి పార్టీ కార్యకలాపాలను పర్యవేక్షిస్తారని కేటీఆర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా గెలుపు గుర్రాలను గుర్తించి, అభ్యర్థుల ఎంపికలో ఈ ఇన్‌చార్జిలు కీలక పాత్ర పోషించనున్నారు. స్థానిక నాయకత్వంతో చర్చించి అభ్యర్థులపై నివేదికలను ఎప్పటికప్పుడు పార్టీ అధిష్ఠానానికి వీరు సమర్పిస్తారు. కేవలం అభ్యర్థుల ఎంపికకే పరిమితం కాకుండా, పార్టీ రూపొందించిన ప్రచార కార్యక్రమాలను సమర్థంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, బూత్ లెవల్ ఏజెంట్లను సమన్వయం చేయడం వంటి బాధ్యతలను కూడా వీరు పర్యవేక్షించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో మారుతున్న రాజకీయ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, పార్టీ కేంద్ర కార్యాలయానికి సమాచారం అందించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థను కూడా ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ వెల్లడించారు.

# చిన్నారిని బలిగొన్న జింక బొమ్మ

**పి. గన్నవరం (ఏడీఎన్ఎన్) :**





పాఠశాల ప్రాంగణం ఒక చిన్నారికి మృత్యుపాశమైంది. ఆడుకోవాల్సిన వయసులో, తోటి పిల్లలతో కలిసి గడుపుతున్న సమయంలో, ఒక జింక బొమ్మ బరువైన సిమెంట్ విగ్రహం రూపంలో చిన్నారి ప్రాణం బలిగొంది. అధికారుల బాధ్యతారాహిత్యం, కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం కలిసి ఈ విషాదానికి కారణమయ్యాయి. కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం జి.పెదపూడి ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న దివి జాహ్నవి శుక్రవారం మధ్యాహ్నం పాఠశాల ఆవరణలోని పార్కుకు వెళ్లింది. ఆ పార్కులో అందం కోసం ఏర్పాటు చేసిన సిమెంట్ జింక బొమ్మపై ఎక్కి కాసేపు ఆడుకుని, కిందకు దిగుతున్న సమయంలో హఠాత్తుగా 70 కిలోల బరువున్న ఆ బొమ్మ చిన్నారి ఛాతిపై పడింది. దీనితో అపస్మారక స్థితిలో చేరుకున్న చిన్నారి ఆసుపత్రికి వెళ్లేలోపే కన్నుమూసింది. అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కలిసి ఒక నిండు ప్రాణాన్ని బలితీసుకున్నాయి. ఈ ఘటన వెనుక ఉన్న కారణాలు పరిశీలిస్తే అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. బరువైన సిమెంట్ జింక బొమ్మలను కేవలం నేలపై ఉంచడమే తప్ప, వాటికి ఎలాంటి పటిష్టమైన పునాది లేదా భద్రతా ఏర్పాట్లు చేయలేదని అంటున్నారు. కనీస ఇంజినీరింగ్ ప్రమాణాలు పాటించకుండా విగ్రహాలను ఏర్పాటు చేయడమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని విమర్శిస్తున్నారు. గతంలో 'నాడు-నేడు' కార్యక్రమం కింద ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి లక్షల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, దాతలు ఇచ్చిన విగ్రహాల ఏర్పాటు విషయంలో అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం రంగులు, హంగులతో సరిపెట్టకుండా, పాఠశాల ఆవరణలో ఉన్న ప్రతి వస్తువు పిల్లలకు సురక్షితంగా ఉందో లేదో తనిఖీ చేయాల్సిన బాధ్యత విద్యాశాఖపై ఉందని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ దారుణ ఘటన ఒక యాదృచ్ఛిక ప్రమాదం మాత్రమే కాదని, వ్యవస్థలో అడుగడుగునా పేరుకుపోయిన అధికారుల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిల్లల భద్రత విషయంలో ఇకనైనా పాలకులు, అధికారులు కళ్లుతెరవాలని, పాఠశాలలు నిజంగా సురక్షితమైన ప్రదేశాలుగా మారాలని వారు కోరుతున్నారు.

## బ్రేకులు ఫెయిల్..
# డివైడర్ ఎక్కిన లారీ..



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**


హైదరాబాద్‌లోని అబ్దుల్లా పూర్‌మెట్ వద్ద హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారిపై బ్రేకులు ఫెయిలై ఓ లారీ డివైడర్‌పైకి ఎక్కింది. రోడ్డు మధ్యలో లారీ నిలిచిపోవడంతో ఆ మార్గంలో ట్రాఫిక్ జామ్ నెలకొంది. దీంతో హైవేపై వాహనాలు నెమ్మదిగా కొనసాగాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్రేన్ సాయంతో లారీని అక్కడి నుంచి తొలగించారు.



## మేడారం జాతర కోసం
# జాయ్ రైడ్స్

**మేడారం (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ కుంభమేళాగా పేరొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు వెళ్లే భక్తులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. జాతర సమయంలో భక్తులు వేగంగా గమ్యస్థానం చేరుకునేలా హెలికాప్టర్ సేవలను అందుబాటులోకి తెచ్చింది. అంతేకాదు మేడారం జాతర అందాలను ఆకాశం నుంచి వీక్షించాలనుకునే భక్తుల కోసం 'జాయ్ రైడ్స్'ను కూడా ఏర్పాటు చేశారు. తెలంగాణ పర్యాటక శాఖ, తుంబి ఎయిర్‌లైన్స్ సంయుక్తంగా ఈ సేవలను శనివారం నుంచి ప్రారంభించాయి. భక్తుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్వాహకులు రెండు ప్రత్యేక ప్యాకేజీలను ప్రకటించారు. మొదటి ప్యాకేజీ కింద హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానం నుంచి నేరుగా మేడారం వెళ్లి తిరిగి వచ్చే రౌండ్ ట్రిప్ సౌకర్యం కల్పించారు. దీనికి ఒక్కో వ్యక్తికి రూ.35,999గా ఛార్జీ నిర్ణయించారు. అయితే జనవరి 23లోపు బుకింగ్ చేసుకున్న వారికి రూ.30,999కే ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఇక రెండో ప్యాకేజీగా, మేడారం సమీపంలోని పడిగాపూర్ హెలిప్యాడ్ నుంచి జాయ్ రైడ్స్ సర్వీసులు నడవనున్నాయి. సుమారు 7 నిమిషాల పాటు సాగే గగన విహారానికి ఒక్కొక్కరికి రూ.4,800గా రుసుము నిర్ణయించారు. ఈ హెలికాప్టర్ సేవలతో భక్తులు సమయం ఆదా చేసుకోవడంతో పాటు, మేడారం జాతరను విహంగ వీక్షణం చేసే అరుదైన అనుభూతిని పొందే అవకాశం లభించనుంది.



## భార్య కళ్లముందే
# భర్త , కుమారుడు మృతి

**మహబూబాబాద్ (ఏడీఎన్ఎన్) :**

సరదాగా సాగిన పొలం పనులు ఆ కుటుంబంలో తీరని విషాదాన్ని నింపాయి. భుజాల మీద ఉన్న కుమారుడు పొరపాటున విద్యుత్ తీగను తాకడంతో, తండ్రీకొడుకులు ఇద్దరూ విద్యుదాఘాతానికి గురై బావిలో పడి ప్రాణాలు కోల్పోయారు. ఈ హృదయ విదారక ఘటన మహబూబాబాద్ మండలం బలరాంతండాలో శనివారం చోటుచేసుకుంది. కళ్ల ముందే భర్త, కుమారుడు మృత్యువాత పడటంతో ఆ ఇల్లాలు పడుతున్న రోదనలు స్థానికులను కంటతడి పెట్టించాయి. బలరాంతండాకు చెందిన కేలోత్ మదన్ (32), తన భార్య అనిత , నాలుగేళ్ల చిన్న కుమారుడు లక్షిత్‌తో కలిసి శనివారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లారు. మదన్ ట్రాక్టర్‌తో దుక్కి దున్నిన తర్వాత అందరూ కలిసి భోజనం చేశారు. ఆ తర్వాత కుమారుడిని భార్యకు అప్పగించేందుకు మదన్ తన భుజాలపై ఎత్తుకుని నడుస్తుండగా, బాలుడు లక్షిత్ పక్కనే ఉన్న వ్యవసాయ మోటార్ విద్యుత్ తీగను అనుకోకుండా పట్టుకున్నాడు. దీంతో ఇద్దరూ ఒక్కసారిగా షాక్‌కు గురై అదుపు తప్పి పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో పడిపోయారు. ప్రమాదాన్ని గమనించిన అనిత గట్టిగా కేకలు వేయడంతో సమీపంలోని రైతులు పరుగున వచ్చారు. అయితే అప్పటికే ఇద్దరూ బావిలో మునిగిపోయారు. స్థానికులు వెంటనే బావిలోకి దిగి మదన్ మృతదేహాన్ని వెలికితీశారు. చిన్నారి లక్షిత్ ఆచూకీ కోసం స్థానికులు, అగ్నిమాపక సిబ్బంది గాలించి మృతదేహాన్ని బయటకు తీశారు. చేతికి అందివచ్చిన కొడుకు, తోడుగా ఉన్న భర్త మృత్యువు ఒడిలోకి వెళ్లడంతో అనిత గుండెవిసేలా విలపిస్తోంది. ఈ ఘటనతో తండాలో విషాద ఛాయలు అలముకున్నాయి.



## యూరియా కోసం
# రైతుల జాగారం

**బిజినేపల్లి (ఏడీఎన్ఎన్) :**

నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండల కేంద్రంలో యూరియా బస్తాల కోసం రైతులు రాత్రంతా చలిలో జాగారం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. శుక్రవారం మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు రైతు వేదిక వద్దకు చేరుకుని క్యూ కట్టారు. స్వెట్టర్లు, దుప్పట్లు కప్పుకుని రాత్రిపూట క్యూలో పడిగాపులు కాస్తున్న రైతుల వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ప్రభుత్వం, అధికారులు యూరియాకు కొరత లేదని ప్రకటిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం ఎక్కడా అందుబాటులో లేదని రైతులు ఆరోపిస్తున్నారు. రెండు మూడు బస్తాల కోసం రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. చివరకు యూరియా దక్కుతుందనే ఆశతో రైతు వేదిక వద్ద రాత్రి నుంచి శనివారం ఉదయం వరకు క్యూలో ఉన్నామని తెలిపారు. ఈ జాగారంలో మహిళా రైతులు, యువకులు కూడా పాల్గొనడం గమనార్హం. యూరియా సరఫరాలోని అసమానతలను వెంటనే సరిదిద్దాలని, సాగు కాలంలో ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుబాటులో ఉంచాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



# టీ20 వరల్డ్ కప్‌కు అనిరుధ్ స్వరం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

రానున్న టీ20 ప్రపంచకప్‌కు అధికారిక గీతాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ స్వరపరచనున్నారు. ఈ మెగా టోర్నీలో భాగస్వామిగా నిలవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని ఆయన తెలిపారు. క్రికెట్ తనకు ఒక ఆటకే పరిమితం కాదని, కోట్లాది మంది అభిమానుల హృదయాలతో ముడిపడి ఉన్న భావోద్వేగమని వ్యాఖ్యానించారు. ఇలాంటి ప్రపంచ స్థాయి టోర్నీకి పాట అందించే అవకాశం రావడం తన కెరీర్‌లో ప్రత్యేక ఘట్టమని, ఈ గీతం అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపేలా ఉండేలా రూపకల్పన చేస్తున్నామని వెల్లడించారు. అధికారిక గీతాన్ని త్వరలోనే విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 7 నుంచి భారత్-శ్రీలంక సంయుక్తంగా టీ20 ప్రపంచకప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్నాయి. గత సీజన్‌లో విజేతగా నిలిచిన టీమిండియా, ఈసారి స్వదేశంలో ఆడనుండటంతో మరోసారి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో సన్నద్ధమవుతోంది. సొంత మైదానాల్లో అభిమానుల మద్దతుతో బరిలోకి దిగనున్న సూర్య సేనపై భారీ అంచనాలు నెలకొన్నాయి. అనిరుధ్ అందించే శక్తివంతమైన సంగీతం టోర్నీ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చనుందని క్రికెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.



# అండర్ -19లో భారత్ హ్యాట్రిక్ విజయం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అండర్19 ప్రపంచ కప్‌లో భారత యువ జట్టు విజయ విహారం చేస్తోంది. బులావాయో వేదికగా న్యూజిలాండ్‌తో జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 7 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి, హ్యాట్రిక్ విజయాలను నమోదు చేసింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ జట్టును భారత బౌలర్లు ఆరంభం నుంచే ఒత్తిడిలోకి నెట్టారు. వర్షం కారణంగా ఈ మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించారు. ఒక దశలో న్యూజిలాండ్ 22 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. జాకబ్ కాటర్ (23), జస్కరణ్ సంధు (18) కొద్దిసేపు పోరాడినా, వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో అవుట్ కావడంతో కీవీస్ 69 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. చివర్లో కల్లమ్ శాంసన్ (37*), సెల్విన్ సంజయ్ (28) ఆదుకోవడంతో న్యూజిలాండ్ 36.2 ఓవర్లలో 135 పరుగులకు ఆలౌటైంది. భారత బౌలర్లలో ఆర్.ఎస్ అంబరీష్ 4/29తో చెలరేగగా, హెనిల్ పటేల్ 3/23తో ఆకట్టుకున్నాడు. ఖిలాన్ పటేల్, మహ్మద్ ఎనాన్, కనిష్క్ చౌహాన్ చెరో వికెట్ తీశారు. లక్ష్య ఛేదనలో కెప్టెన్ ఆయుష్, వైభవ్ సూర్యవంశీ అదరగొట్టారు. డక్ వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్ ముందు 136 పరుగుల లక్ష్యాన్ని ఉంచారు. భారత ఓపెనర్లు ఆది నుంచే ధాటిగా ఆడటంతో కేవలం 13.3 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి భారత్ లక్ష్యాన్ని చేరుకుంది. కెప్టెన్ ఆయుష్ మాత్రే 53 పరుగులతో హాఫ్ సెంచరీ చేయగా, వైభవ్ సూర్యవంశీ 40 పరుగులతో మెరిశాడు. లీగ్ స్టేజ్‌లో తిరుగులేని ప్రదర్శన చేస్తున్న టీమిండియా, ఈ విజయంతో తన ఆధిపత్యాన్ని చాటుకుంది.



# 23 రోజుల్లో రూ.1 లక్ష పెరిగిన వెండి

**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్) :**

దేశీయంగా, అంతర్జాతీయంగా వెండి ధరలు రికార్డు స్థాయికి చేరాయి. 2025లో కూడా ఎప్పుడూ లేనంతగా 2026 జనవరి నెలలో వెండి ధరలు భారీ ఎగబాకాయి. కేవలం 23 రోజుల్లో వెండి ధరలు కిలోకు రూ.లక్షకు పైగా పెరగడం దేశీయ కమోడిటీ మార్కెట్ చరిత్రలో తొలిసారి నమోదైంది. దేశ ఫ్యూచర్స్ మార్కెట్ అయిన మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో శుక్రవారం ట్రేడింగ్ సెషన్‌లో వెండి ధరలు కిలోగ్రాముకు రూ.3,39,927 అనే ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరాయి. చివరికి మార్కెట్ ముగిసే సరికి వెండి ధరలు రూ.3,34,699 వద్ద స్థిరపడ్డాయి. ఒక్కరోజులోనే కిలోపై రూ.7,410 పెరుగుదల నమోదైంది. గత ఏడాది చివరి ట్రేడింగ్ రోజున వెండి ధర రూ.2,35,701గా ఉండగా, జనవరి 23 నాటికి రూ.3,39,927కు చేరింది. అంటే 23 రోజుల్లో రూ.1,04,226 లేదా 44.22 శాతం పెరుగుదల చోటు చేసుకుంది. రోజుకు సగటున రూ.4,500కు పైగా పెరుగుదల కనిపించింది. ఢిల్లీ బులియన్ మార్కెట్‌లో శుక్రవారం వెండి ధర కిలోగ్రాముకు రూ.9,500 పెరిగి రూ.3,29,500కు చేరింది. ఈ నెలలోనే ఢిల్లీలో వెండి ధరలు రూ.90,500 పెరగడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్లలోనూ వెండి ధరలు సంచలనం సృష్టించాయి. న్యూయార్క్ కామెక్స్ మార్కెట్‌లో వెండి ఔన్సుకు 100 డాలర్ల మైలురాయిని దాటి 101.33 డాలర్లకు చేరగా, స్పాట్ వెండి ధర 103.19 డాలర్లుగా నమోదైంది. యూరప్, బ్రిటన్ మార్కెట్లలోనూ భారీ లాభాలు కనిపించాయి. ప్రస్తుతం జనవరి 24 నాటికి హైదరాబాద్‌లో వెండి ధర కిలోగ్రాముకు రూ.3,60,100గా ఉండగా, ఢిల్లీ, ముంబై మార్కెట్లలో రూ.3,35,000 వద్ద ట్రేడవుతోంది. రాబోయే రోజుల్లో వెండి ధరల్లో భారీ హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు.



# ఆర్సీబీకి కొత్త ఓనర్.. పోటీలో అనుష్కశర్మ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఐపీఎల్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన జట్లలో ఒకటైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు త్వరలోనే కొత్త యజమాన్యం చేతుల్లోకి వెళ్లనుంది. ప్రస్తుతం ఫ్రాంఛైజీ ఓనర్‌గా ఉన్న డియాజియో సంస్థ, ఆర్సీబీ విక్రయ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించనుంది. ఈ కొనుగోలు ప్రక్రియ మార్చి 31 నాటికి పూర్తికానున్నట్లు సంస్థ స్పష్టం చేసింది. సుమారు రెండు బిలియన్ డాలర్లు (దాదాపు రూ.16 వేల కోట్లకు పైగా)గా అంచనా వేయబడుతున్న ఆర్సీబీ విలువకు అనుగుణంగా భారత్‌తో పాటు విదేశీ సంస్థలు కూడా బిడ్‌కు ఆసక్తి చూపిస్తున్నాయి. ఆర్సీబీ స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ భార్య, బాలీవుడ్ నటి అనుష్క శర్మ కూడా ఫ్రాంఛైజీలో 3 శాతం వాటా కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. జట్టుతో కొత్త ప్రయాణాన్ని ప్రారంభించాలనే ఉద్దేశంతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా బెంగళూరు జట్టును కొనుగోలు చేసేందుకు బిడ్ వేశానని 'ఎక్స్' వేదికగా ప్రకటించడం సంచలనంగా మారింది. 18 సంవత్సరాల నిరీక్షణకు ముగింపు పలికుతూ ఇటీవలే ఐపీఎల్ కప్ గెలిచిన టీమ్, మైదానంలోనే కాదు.. బ్రాండింగ్‌లోనూ దూసుకెళ్తోంది. టైటిల్ విజయం తర్వాత ఆర్సీబీ బ్రాండ్ విలువ 18.5 శాతం పెరిగి రూ.2,327 కోట్లకు చేరింది. మార్కెటింగ్ పరంగా ఇప్పటికే డియాజియోకు భారీ ఆదాయం తెచ్చిపెట్టిన ఈ ఫ్రాంఛైజీ, ఇప్పుడు కొత్త యజమాని చేతుల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతోంది. 2008లో ఐపీఎల్ ప్రారంభ సమయంలో విజయ్ మాల్యా బెంగళూరు జట్టును కొనుగోలు చేయగా, ఆర్థిక ఇబ్బందుల కారణంగా అనంతరం యునైటెడ్ స్పిరిట్స్ వాటాలను డియాజియోకు విక్రయించారు.

# ఐదు ప్రపంచ రికార్డులు బద్దలు కొట్టిన టీమిండియా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



రాయ్‌పూర్ వేదికగా జరిగిన రెండో టీ20లో టీమిండియా అద్భుత ప్రదర్శనతో న్యూజిలాండ్‌పై ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. అయితే ఈ మ్యాచ్ గెలుపుతో పాటు ఏకంగా ఐదు కీలక రికార్డులు బద్దలయ్యాయి.

1. భారత యువ బ్యాటర్ ఇషాన్ కిషన్ కేవలం 21 బంతుల్లోనే అర్ధశతకం సాధించి, టీ20ల్లో న్యూజిలాండ్‌పై అత్యంత వేగంగా హాఫ్ సెంచరీ చేసిన భారత ఆటగాడిగా రికార్డు నెలకొల్పాడు.
2. పవర్‌ప్లేలో వన్‌డౌన్‌గా వచ్చి యాభై పరుగులు పూర్తి చేసి, పవర్‌ప్లేలో హాఫ్ సెంచరీ సాధించిన తొలి నాన్ ఓపెనర్గా కూడా చరిత్ర సృష్టించాడు.
3. టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లో 200కు పైగా లక్ష్యాన్ని అత్యంత వేగంగా ఛేదించిన జట్టుగా భారత్ నిలిచింది. 209 పరుగుల లక్ష్యాన్ని 28 బంతులు మిగిలి ఉండగానే పూర్తి చేసి, పాకిస్థాన్ పేరిట ఉన్న రికార్డును చెరిపేసింది.
4. ఈ మ్యాచ్ కివీస్ బౌలర్లకు పీడకలగా మారింది. న్యూజిలాండ్ బౌలర్ జాక్ ఫౌల్క్స్ 3 ఓవర్లలో 67 పరుగులు ఇచ్చి అవాంఛనీయ రికార్డు నెలకొల్పాడు.
5. ఇక భారత పేసర్ అర్షదీప్ సింగ్ తొలి ఓవర్‌లోనే 18 పరుగులు ఇచ్చి, టీ20ల్లో మొదటి ఓవర్‌లో అత్యధిక పరుగులు ఇచ్చిన భారత బౌలర్‌గా నిలిచాడు.

కివీస్ నిర్దేశించిన 209 పరుగుల భారీ లక్ష్యాన్ని కేవలం 15.2 ఓవర్లలోనే ఛేదించి సంచలనం సృష్టించింది. సూర్యకుమార్ యాదవ్, ఇషాన్ కిషన్ బ్యాట్‌లతో విరుచుకుపడటంతో మైదానమంతా పరుగుల వరద పారింది.




# మీడియా దిగ్గజ సంస్థను కొనుగోలు చేసిన అదానీ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

అదానీ గ్రూప్ అధినేత గౌతమ్ అదానీ మరో కీలక కొనుగోలుతో వార్తల్లో నిలిచారు. మీడియా రంగంలో తన ఆధిపత్యాన్ని మరింత బలోపేతం చేసుకుంటూ, ఇండో ఏషియన్ న్యూస్ సర్వీసెస్ (IANS)లో మిగిలిన 24 శాతం వాటాను కూడా కొనుగోలు చేశారు. దీంతో ఐఏఎన్ఎస్ ఇప్పుడు అదానీ గ్రూప్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థగా మారింది. అదానీ గ్రూప్ తన మీడియా విభాగమైన ఏఎంజీ మీడియా నెట్‌వర్క్స్ ద్వారా దశలవారీగా ఐఏఎన్ఎస్‌లో వాటాలు దక్కించుకుంది. 2023 డిసెంబరులో 50.50 శాతం మెజార్టీ వాటా కొనుగోలు చేయగా, 2024 జనవరిలో వాటాను 76 శాతానికి పెంచుకుంది. తాజాగా మిగిలిన షేర్లను కూడా సొంతం చేసుకుని 100 శాతం నియంత్రణ సాధించింది. ఇంతకుముందే బీక్యూ ప్రైమ్, ఎన్‌డీటీవీ వంటి సంస్థల్లో పెట్టుబడులు పెట్టిన అదానీ, ఇప్పుడు ఐఏఎన్ఎస్‌తో మీడియా రంగంలో తన పట్టు మరింత బలపర్చుకున్నారు. పోర్టులు, ఇంధనం, సిమెంట్, ఎయిర్‌పోర్ట్స్ తర్వాత సమాచార రంగంలోనూ కీలక శక్తిగా ఎదగడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. గతంలో అమెరికన్ షార్ట్ సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ సంచలన ఆరోపణలు చేయగా.. కొన్నాళ్లు అదానీ గ్రూప్ వ్యాపారం నెమ్మదించింది. తర్వాత మళ్లీ పుంజుకున్నారు అదానీ. వరుసగా దిగ్గజ కంపెనీల్ని కొనుగోలు చేశారు. ఇంకొన్ని కంపెనీల్లో మెజార్టీ వాటాల్ని దక్కించుకున్నారు. దీంతో అదానీ గ్రూప్ కింద చాలా కంపెనీలు అయ్యాయి. దీంతో ఇప్పుడు ఐఏఎన్ఎస్.. అదానీ గ్రూప్ పూర్తి అనుబంధ సంస్థగా మారింది. పోర్టులు, ఇంధన రంగాల నుంచి.. మీడియా రంగంవైపు అదానీ వేగంగా అడుగులు వేస్తున్న క్రమంలో ఈ పరిణామం చోటు చేసుకుంది. ఈ కొనుగోలు విలువను గోప్యంగా ఉంచినప్పటికీ.. స్టాక్ ఎక్స్ఛేంజి ఫైలింగ్‌లో దీనిని ధ్రువీకరించింది అదానీ గ్రూప్.

# ఏజెంటిక్ ఏఐ నైపుణ్యాలకు భారీ డిమాండ్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**




దేశీయ ఐటీ రంగంలో ఏజెంటిక్ ఏఐ నైపుణ్యాలకు డిమాండ్ వేగంగా పెరుగుతోంది. కానీ అవసరానికి తగిన నైపుణ్యం గల మానవ వనరులు అందుబాటులో లేవని ప్రముఖ స్టాఫింగ్ సంస్థ క్వెస్ కార్ప్ విడుదల చేసిన తాజా నివేదిక వెల్లడించింది. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న డిమాండ్‌తో పోలిస్తే, ఏజెంటిక్ ఏఐ స్కిల్స్ సరఫరా 50 శాతానికి పైగా తక్కువగా ఉందని ఆ నివేదిక స్పష్టం చేసింది. ఈ నివేదిక ప్రకారం, ఏజెంటిక్ ఏఐ, జనరేటివ్ ఏఐ (GenAI), ఆటోమేషన్‌కు సంబంధించిన ప్రత్యేక నైపుణ్యాల అవసరం ఏడాదికి 40 శాతం వరకు పెరుగుతోంది. అయితే, ఈ స్థాయి వృద్ధికి అనుగుణంగా స్కిల్డ్ టాలెంట్ తయారుకావడం లేదని క్వెస్ కార్ప్ పేర్కొంది. దీంతో సంస్థలు సరైన నిపుణులను నియమించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఏజెంటిక్ ఏఐ అనేది స్వయంచాలకంగా నిర్ణయాలు తీసుకుని, పనులను నిర్వహించే ఆధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విధానం. ఇది కేవలం సూచనలు అమలు చేయడమే కాకుండా, పరిస్థితులకు అనుగుణంగా స్వతంత్రంగా పనిచేయగల సామర్థ్యం కలిగి ఉంటుంది. ప్రస్తుతం బ్యాంకింగ్, ఫైనాన్స్, ఈకామర్స్, హెల్త్‌కేర్, ఐటీ సేవల రంగాల్లో ఈ టెక్నాలజీకి విస్తృతంగా వినియోగం పెరుగుతోంది. నివేదికలో మరో కీలక అంశంగా జీతాల పెరుగుదలను ప్రస్తావించారు. ఏజెంటిక్ ఏఐ, డేటా ఇంజినీరింగ్, ఏఐ ఆర్కిటెక్చర్ వంటి కీలక పాత్రలలో ఉన్న నిపుణులకు సాధారణ ఉద్యోగాల కంటే 20 నుండి 28 శాతం వరకు అధిక వేతనాలు చెల్లిస్తున్నట్లు వెల్లడైంది. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు ఈ నైపుణ్యాల నియామకాల్లో ముందంజలో ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే, భారత్‌లో ఏఐ ఆధారిత ఉద్యోగాలు ప్రధానంగా బెంగళూరు, హైదరాబాద్, పుణె, చెన్నై వంటి నగరాల్లో కేంద్రీకృతమవుతున్నాయని నివేదిక తెలిపింది. రానున్న సంవత్సరాల్లో ఏఐ నైపుణ్యాల అభివృద్ధిపై సంస్థలు మరింత పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఏజెంటిక్ ఏఐ భవిష్యత్ ఉద్యోగ విపణిలో కీలక పాత్ర పోషించనుందని, విద్యా సంస్థలు, ట్రైనింగ్ సెంటర్లు, కంపెనీలు కలిసి స్కిల్స్ గ్యాప్‌ను తగ్గించే దిశగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని క్వెస్ కార్ప్ నివేదిక సూచిస్తోంది.

# ఎయిర్ ఇండియాకు బీమా పరిహారం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



గత ఏడాది జూన్ 12న సంచలనం సృష్టించిన అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాదానికి సంబంధించిన బీమా పరిహార ప్రక్రియ పూర్తయింది. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ప్రయాణికుల కుటుంబాలకు, గాయపడిన బాధితులకు బీమా సంస్థలు నిర్ణీత పరిహారాన్ని అందించాయి. అలాగే, ప్రమాదానికి గురైన విమానం నష్టానికి సంబంధించి ఎయిర్ ఇండియా సంస్థకూ భారీగా బీమా పరిహారం అందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. ప్రమాదంలో ప్రభావితమైన ప్రయాణికుల విషయంలో అంతర్జాతీయ విమానయాన నిబంధనల ప్రకారం పరిహారం చెల్లించినట్లు సమాచారం. ప్రయాణికుల బీమా కవరేజ్ కింద మృతుల కుటుంబాలకు, గాయపడిన వారికి విడివిడిగా పరిహారం అందజేశారు. ఈ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఎయిర్ ఇండియా యాజమాన్యం బీమా సంస్థలతో సమన్వయం చేసిందని తెలుస్తోంది. ఇక ప్రమాదానికి గురైన విమానం విలువ సుమారు రూ.1,100 కోట్లుగా అంచనా వేయగా, ఆ మొత్తానికి అనుగుణంగా ఎయిర్ ఇండియాకు బీమా క్లెయిమ్ మంజూరైంది. విమానం పూర్తిగా దెబ్బతినడంతో 'టోటల్ లాస్' కింద బీమా పరిహారం చెల్లించినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటామని ఎయిర్ ఇండియా ఇప్పటికే హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. బీమా పరిహారం అందడంతో బాధితులకు కొంతమేర ఆర్థిక భరోసా లభించిందని అధికారులు తెలిపారు. ఈ పరిహార ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, ఆ మొత్తం పెరిగే అవకాశం ఉందని బీమా కంపెనీలు వెల్లడించాయి. అదే సమయంలో, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా భద్రతా ప్రమాణాలను మరింత కఠినంగా అమలు చేస్తామని ఎయిర్ ఇండియా సంస్థ స్పష్టం చేసింది.




# బీసీబీ మొండితనం వెనుక రాజకీయ కారణాలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భారత్ ఆతిథ్యమివ్వనున్న టీ20 ప్రపంచకప్ మ్యాచ్‌లను భద్రతా కారణాలతో ఇండియాలో ఆడలేమంటూ బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) తీసుకుంటున్న నిర్ణయాలు ఆ దేశ క్రికెట్ భవిష్యత్తును ప్రమాదంలో పడేస్తున్నాయి. దీని వెనుక రాజకీయ కారణాలున్నాయనే నిజం కాదనలేనిది. భారత్ వ్యతిరేకిగా పేరున్న బంగ్లాదేశ్ క్రీడల మంత్రి ఆసిఫ్ నజ్రుల్ ప్రభావంతోనే బీసీబీ ఈ దారిలో నడుస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఐసీసీ స్వతంత్ర భద్రతా సంస్థ విచారణలో భారత్‌లో ఎలాంటి ముప్పు లేదని తేలినా, బంగ్లాదేశ్ తన వైఖరిని మార్చుకోవడం లేదు. ఈ అంశంపై ఐసీసీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్లు 14-2 మెజారిటీతో భారత్‌లోనే మ్యాచ్‌లు జరుగుతాయని స్పష్టం చేసినప్పటికీ, బీసీబీ అంతర్గత వివాదాల పరిష్కార కమిటీ (DRC)ని ఆశ్రయించింది. అయితే ఐసీసీ రాజ్యాంగం ప్రకారం, బోర్డ్ నిర్ణయాలను ప్రశ్నించే అధికారం ఈ కమిటీకి లేదని తెలుస్తోంది. దీంతో బంగ్లాదేశ్ అప్పీల్ స్వీకరణకే నోచుకోకపోవచ్చని సమాచారం. సమయం మించిపోతుండటంతో ఐసీసీ కఠిన నిర్ణయాలకు సిద్ధమైంది. ఐసీసీ ఛైర్మన్ జై షా దుబాయ్‌లో ఉండగా, బంగ్లాదేశ్ స్థానంలో స్కాట్లాండ్‌ను అధికారికంగా ఖరారు చేసే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే స్టాండ్‌బైలో ఉన్న స్కాట్లాండ్ జట్టు సన్నాహాలు ప్రారంభించినట్లు సమాచారం. ప్రస్తుత పరిస్థితుల్లో బంగ్లాదేశ్ మొండితనాన్ని వీడకపోతే, టీ20 ప్రపంచకప్‌లో పాల్గొనే అవకాశాన్ని కోల్పోయే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఐసీసీ త్వరలో తుది నిర్ణయం తీసుకుని బంగ్లాదేశ్‌కు గట్టి షాక్ ఇవ్వడం ఖాయమని క్రీడా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

# టోర్నీలను గెలిపించేది బౌలర్లే

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



భారత మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ క్రికెట్‌లో బౌలర్ల ప్రాధాన్యతపై కీలక వ్యాఖ్యలు చేశారు. "బ్యాట్స్ మన్‌లు మ్యాచ్‌లు గెలిపించగలుగుతారు. కానీ టోర్నమెంట్లు గెలిపించేది మాత్రం బౌలర్లే" అని స్పష్టం చేశారు. టీ20 వంటి ఫార్మాట్‌లో భారీ స్కోర్లు సాధించడం సాధ్యమైనప్పటికీ, కీలక సమయాల్లో వికెట్లు తీసే బౌలర్లు లేకపోతే జట్టు ముందుకు సాగలేదని హర్భజన్ అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా ప్రపంచకప్‌లాంటి మెగా టోర్నీల్లో బలమైన, సమతుల్య బౌలింగ్ విభాగం ఉంటేనే టైటిల్ సాధ్యమవుతుందన్నారు. టీమిండియా వద్ద బ్యాటింగ్ బలంగా ఉన్నప్పటికీ, మ్యాచ్ దిశను మార్చే బౌలర్ల ఎంపికపై జట్టు యాజమాన్యం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. బౌలింగ్‌లో లోతు ఉంటేనే పెద్ద టోర్నీల్లో విజయాలు సాధ్యమని హర్భజన్ వ్యాఖ్యానించారు. 2007లో భారత జట్టు టీ20 ప్రపంచకప్ గెలిచినప్పుడు హర్భజన్ సింగ్ బంతితో కీలక పాత్ర పోషించాడు. అదే సమయంలో, హర్భజన్ సింగ్ కూడా 2011 ODI ప్రపంచకప్ గెలిచిన జట్టులో సభ్యుడిగా ఉన్న సంగతి తెలిసిందే.




# అర్హత కోల్పోయిన బంగ్లాదేశ్.. స్కాట్లాండ్ కే ఛాన్స్

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

భద్రతా కారణాల వల్ల భారత్‌లో టీ ట్వంటీ ప్రపంచకప్ ఆడటానికి నిరాకరించిన బంగ్లాదేశ్ విషయంలో క్లారిటీ వచ్చేసింది. 2026 టీ20 ప్రపంచ కప్ నుండి బంగ్లాదేశ్ అధికారికంగా తప్పుకుంది. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్ ప్రపంచ కప్‌లో ఆడుతుందని ఐసీసీ ప్రకటించింది. తమ మ్యాచ్‌లను భారత్ నుండి శ్రీలంకకు లేదా మరో వేదికకు మార్చాలని బంగ్లాదేశ్ కోరింది. కానీ, ఐసీసీ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. భారత్‌కు రావడానికి బంగ్లాదేశ్ నిరాకరించడంతో, ఐసీసీ కఠిన నిర్ణయం తీసుకుంది. టోర్నీలో పాల్గొనడంపై నిర్ణయం తీసుకోవడానికి ఐసీసీ బంగ్లాదేశ్‌కు కొంత గడువు ఇచ్చింది. ఆ సమయం ముగిసినా బంగ్లాదేశ్ నుండి సానుకూల స్పందన రాకపోవడంతో వారిని టోర్నీ నుండి తొలగించింది. నిబంధనల ప్రకారం, బంగ్లాదేశ్ స్థానంలో అర్హత కలిగిన అసోసియేట్ దేశమైన స్కాట్లాండ్‌ను ఎంపిక చేసింది. స్కాట్లాండ్ ఇప్పుడు గ్రూప్‌సి లో చేరింది. ఈ గ్రూప్‌లో ఇంగ్లాండ్, వెస్టిండీస్, ఇటలీ, నేపాల్ జట్లు ఉన్నాయి. ఫిబ్రవరి 7న వెస్టిండీస్‌తో స్కాట్లాండ్ తన మొదటి మ్యాచ్ ఆడుతుంది.



# భారతీయుల ప్రతిభకు ఇక్కడే అవకాశాలు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రఖ్యాత భారతీయ సాఫ్ట్ వేర్ కంపెనీ జోహో కోఫౌండర్, చీఫ్ సైంటిస్ట్ శ్రీధర్ వేంబు ఇటీవల భారత టెక్ ప్రతిభపై మాట్లాడారు. ప్రపంచ వాణిజ్యం, వీసా నియంత్రణల ఉద్రిక్తతల కారణంగా విదేశాల్లో పనిని ఆశిస్తున్న యువతకు ప్రత్యామ్నాయంగా భారతదేశంలోనే అనేక అవకాశాలను అందిస్తున్నదని ఆయన స్పష్టం చేశారు. వెంబు మాట్లాడుతూ, భారత్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ విస్తరిస్తున్నాయి. పెద్ద అంతర్జాతీయ సంస్థలు సామర్థ్యాలను నిర్మిస్తూ విస్తరణ ప్రకటనలు చేస్తున్నాయని తెలిపారు. అందువల్ల భారత్‌లోని ప్రతిభ గ్లోబల్ మార్కెట్‌లో ఉన్న అవకాశాలను వదలకుండా ఇక్కడే పని చేసి, దేశానికే సేవ చేయాలని ఆయన యువతకు పిలుపునిచ్చారు. అంతేకాక, భారత టాలెంట్‌కి అంతర్జాతీయ కంపెనీలు కూడా పెద్ద మద్దతు ఇస్తున్నాయని పేర్కొన్నారు. దేశ అభివృద్ధికి కీలకంగా వ్యవహరించగలదని ఆయన నమ్మకం వ్యక్తం చేశారు. వెంబు అభిప్రాయం ప్రకారం, టెక్ పరిశ్రమలో ఉన్న అస్థిరతను భారత్ ఓ అవకాశంగా మార్చుకోవాలని, దేశీయ ప్రతిభను పక్కన పెట్టకుండా ముందుకు సాగాలని చెప్పారు.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
ఆదివారం | హైదరాబాద్
25.01.2026
www.manasarkar.com



# మరో సాలిడ్ ట్రీట్!?

మెగాస్టార్ చిరంజీవి నటించిన తాజా చిత్రం 'మన శంకర వరప్రసాద్ గారు' భారీ విజయాన్ని అందుకున్న సంగతి తెలిసిందే. మరి ఈ సినిమా తర్వాత తన నుంచి రానున్న అవైటెడ్ చిత్రమే 'విశ్వంభర'. దర్శకుడు వశిష్ఠ తెరకెక్కించిన ఈ గ్రాండ్ విజువల్ ట్రీట్ నిజానికి ముందే విడుదల కావాల్సిన సినిమా కానీ.. ఆలస్యమయింది. మేకర్స్ కంటెంట్ విజువల్స్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకూడదు అని బలంగా ఫిక్స్ అయ్యారట. అందుకే ఈ ఆలస్యం. అయితే ఈ సినిమాపై ఇప్పుడు ఓ ఆసక్తికరమైన విషయం ట్రేడ్ వర్గాల్లో ..సోషల్ మీడియాలో విశేషంగా చక్కర్లు కొడుతోంది. దీని ప్రకారం 'విశ్వంభర' నుంచి మేకర్స్ మరో సాలిడ్ ట్రీట్ ని అందించనున్నారని సమాచారం. మరో వీడియో టీజర్ ని అద్భుతమైన విజువల్స్ తో కూడిన కట్ ని రిలీజ్ చేస్తారని వినిపిస్తోంది. దీనితో డెఫినెట్ గా మెగా ప్రేక్షకుల్లో మరింత అంచనాలు అందుకుంటుంది అనే నమ్మకంతో మేకర్స్ ఫిక్సయ్యారట. సక్రమంగా ప్లాన్ చేస్తే మెగాస్టార్ ఫాంటసీ సినిమాలకి సాలిడ్ రీచ్ ఉంటుంది. మరి ఈ సినిమా వాటిని అందుకుంటుందో లేదో చూడాలి. ఇక ఈ సినిమాలో త్రిష హీరోయిన్ గా నటిస్తుండగా యూవీ క్రియేషన్స్ నిర్మిస్తోన్న విషయం తెలిసిందే.



# ఏప్రిల్ 10న స్వయంభు

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

పాన్ఇండియా బ్లాక్‌బస్టర్ 'కార్తికేయ 2'తో దేశవ్యాప్తంగా ప్రశంసలు పొందిన నిఖిల్, ఇప్పుడు తన ప్రతిష్టాత్మక 20వ చిత్రం 'స్వయంభు'తో ప్రేక్షకులను అలరించబోతున్నారు. భారీ స్థాయిలో నిర్మించబడిన ఈ హిస్టారికల్ యాక్షన్ ఎపిక్ కి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహించారు. సంయుక్త, నభా నటేష్ హీరోయిన్స్. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్ పై భువన్, శ్రీకర్ నిర్మించారు. ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. టాప్ క్లాస్ నిర్మాణ విలువలు, పవర్ ఫుల్ పాన్ఇండియా విజన్ తో వస్తున్న స్వయంభు నిఖిల్ అత్యంత ప్రతిష్టాత్మక వెంచర్లలో ఒకటిగా నిలుస్తుంది. స్వయంభు ఏప్రిల్ 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. సమ్మర్ రిలీజ్ కి ఇది పర్ఫెక్ట్ డేట్. స్వయంభు విఎఫ్ఎక్స్ అద్భుతంగా వుండబోతున్నాయి. ఇండియాలో టాప్ విఎఫ్ఎక్స్ కంపెనీలు ఈ సినిమా కోసం వర్క్ చేస్తున్నాయి. విజువల్ వండర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం కోసం కావాల్సినంత సమయం తీసుకొని, వరల్డ్ క్లాస్ అవుట్‌పుట్ అందించేందుకు మేకర్స్ పూర్తి కమిట్‌మెంట్‌తో పని చేస్తున్నారు. స్వయంభు నిఖిల్ కెరియర్ లో హైయెస్ట్ బడ్జెట్ సినిమా. కార్తికేయ 2 తర్వాత పాన్ ఇండియా స్థాయిలో హ్యూజ్ బజ్ వున్న సినిమా. ఇందులో తన పాత్ర కోసం నిఖిల్ పూర్తిగా ఫిజికల్ ట్రాన్స్ ఫర్మేషన్ అవ్వడంతో పాటు ఇంటెన్స్ ట్రైనింగ్ తీసుకున్నారు. ఇప్పటివరకు రిలీజ్ చేసిన ప్రమోషన్ కంటెంట్ సినిమా మీద భారీ అంచనాలను పెంచింది. టాప్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తోంది. రాజమౌళితో ఐకానిక్ సినిమాలు అందించిన KK సెంథిల్ కుమార్ సినిమాకి డిఓపి గా పనిచేయడం విశేషం. కేజీఎఫ్, సలార్ ఫేం రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ఎం. ప్రభాహరన్, రవీంద్ర ప్రొడక్షన్ డిజైనర్స్.



## రిపబ్లిక్ డే సందర్భంగా...

# వీడీ 14 టైటిల్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా రాహుల్ సంకృత్యన్ దర్శకత్వంలో ప్రెస్టీజియస్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న "వీడీ 14" మూవీ నుంచి క్రేజీ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ నెల 26న రిపబ్లిక్ డే సందర్భంగా ఈ సినిమా టైటిల్ అనౌన్స్ చేయబోతున్నట్లు ప్రకటించారు. "వీడీ 14" చిత్రాన్ని టీ సిరీస్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. ఈ సినిమా బ్రిటీష్ కాలం నేపథ్యంతో పీరియాడిక్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనుంది. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా భారీ పాన్ ఇండియా ప్రాజెక్ట్ గా "వీడీ 14" సినిమా రూపొందుతోంది. 'డియర్ కామ్రేడ్', 'ఖుషి' వంటి సక్సెస్ ఫుల్ సినిమాల తర్వాత మైత్రీ మూవీ మేకర్స్, విజయ్ కలిసి చేస్తున్న మూడో చిత్రమిది. 'టాక్సీవాలా' లాంటి సూపర్ హిట్ తర్వాత విజయ్ దేవరకొండ, రాహుల్ సంకృత్యన్ ఈ సినిమాతో మరోసారి కలిసి పనిచేస్తున్నారు. 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత "వీడీ 14"లో మూడోసారి రష్మిక, విజయ్ జంటగా కనిపించనున్నారు.



# రాకాస గ్లింప్స్

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

సక్సెస్‌ఫుల్ ప్రొడ్యూసర్‌గా దూసుకుపోతోన్న నిహారిక కొణిదెల 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో జాతీయ స్థాయిలో నిర్మాతగా మంచి గుర్తింపుని సాధించిన సంగతి తెలిసిందే. ఇక ఇప్పుడు జీ స్టూడియోస్ సమర్పణలో తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి నిహారిక నిర్మిస్తోన్న చిత్రం 'రాకాస'. మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాల్లో అద్భుతమైన నటనతో ఆకట్టుకున్న యంగ్ టాలెంటెడ్ హీరో సంగీత్ శోభన్ ఈ చిత్రంతో మొదటి సారి సోలో హీరోగా తెరపైకి రాబోతోన్నారు. ఈ సినిమాకి మానస శర్మ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ మూవీని ఏప్రిల్ 3న విడుదల చేయబోతోన్నారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన టైటిల్ మోషన్ పోస్టర్ అందరినీ ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో తాజాగా 'రాకాస' గ్లింప్స్ వదిలి అందరిలోనూ చిత్రం మీద ఆసక్తిని రేకెత్తించారు. 'యుగయుగాలుగా ప్రతీ కథలో ఒక సమస్య.. ఆ సమస్యను ఛేదించడానికి ఓ వీరుడు పుడతాడు.. ఆ వీరుడు ఎవరో అని తెలిసేలోపే నిశ్శబ్దంగా పని ముగిస్తాడు.. ఈ కథలో ఆ వీరుడు నేనే' అంటూ ఓ రేంజ్ లెవెల్ ఎలివేషన్ ఇస్తూ గ్లింప్స్ సాగింది. అయితే ఆ తరువాత ఒక్కసారిగా అది కామెడీ, సెటైరికల్ టర్న్ ఇచ్చుకుంది. ఇక ఇందులో సంగీత్ శోభన్ తన కామెడీ టైమింగ్‌తో మళ్లీ మెప్పిస్తాడని, అందరినీ ఆకట్టుకుంటాడని ఈ గ్లింప్స్‌తోనే చెప్పేశారు. ఈ ట్రెండ్‌కి తగ్గట్టుగా కొత్త కథతోనే మరో ప్రయోగం చేస్తున్నట్టుగా ఈ గ్లింప్స్ చెబుతోంది. ఇక ఇందులో సంగీత్ శోభన్ తనలోని మరో కోణాన్ని చూపించేలా కనిపిస్తున్నారు. ఈ చిత్రానికి కామెడీనే ప్రధాన బలం అని ఈ గ్లింప్స్ చెప్పకనే చెబుతోంది. కామెడీతో పాటుగా ఓ కొత్త పాయింట్‌ను, కొత్తదనాన్ని చూపించేలా కనిపిస్తోంది. అనుదీప్ దేవ్ సంగీత సారథ్యం వహిస్తోన్న ఈ చిత్రానికి రాజు ఎదురోలు సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు.



# చాయ్ వాలా సాంగ్...

ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

శివ కందుకూరి హీరోగా హర్షిక ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాధా వి పాపుడిప్పు నిర్మించిన చిత్రం 'చాయ్ వాలా'. ఈ చిత్రంలో రాజీవ్ కనకాల, తేజు అశ్విని, రాజ్‌కుమార్ కసిరెడ్డి, చైతన్య కృష్ణ, వడ్లమాని శ్రీనివాస్ వంటి వారు ముఖ్య పాత్రల్ని పోషించారు. ప్రమోద్ హర్ష ఈ మూవీకి దర్శకత్వం వహించారు. వెంకట్ ఆర్ పాపుడిప్పు సహ నిర్మాతగా వస్తున్న ఈ సినిమాకి ప్రశాంత్ ఆర్ విహారి సంగీతమందించారు. ఈ మూవీని ఫిబ్రవరి 6న విడుదల చేయబోతోన్నారు. ఈ క్రమంలో టైటిల్ సాంగ్‌ను శుక్రవారం నాడు విడుదల చేశారు. ఈ మేరకు నిర్వహించిన కార్యక్రమంలో సిటీ కమిషనర్ సజ్జనార్, నీలోఫర్ ఫౌండర్ బాబురావు, కిమ్స్ ఎండీ రవి కిరణ్ వర్మ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో.. సిటీ కమిషనర్ సజ్జనార్ మాట్లాడుతూ .. 'మన జీవితంలో చాయ్ అనేది ఎంతో ముఖ్యమైనదిగా మారింది. ఈ 'చాయ్ వాలా' టైటిల్ సాంగ్ చాలా బాగుంది. శివ కందుకూరి లాంటి యంగ్ హీరో, రాజీవ్ కనకాల లాంటి సీనియర్ యాక్టర్స్ ఇందులో నటించారు. నీలోఫర్ బాబుగారు అందరికీ స్ఫూర్తి. ఆయన ఈ మూవీని ఎక్కువగా ప్రమోట్ చేయాలి. ఫిబ్రవరి 6న ఈ చిత్రం రాబోతోంది. అందరూ ఈ మూవీని చూసి హిట్ చేసి, యంగ్ టీంని ఆశీర్వదించాలి. ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం నాకుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో నీలోఫర్ ఫౌండర్ బాబురావు, సత్యనారాయణ, కిమ్స్ ఎండీ రవి కిరణ్ వర్మ , నీలోఫర్ కేఫ్ ఎండీ శశాంక్, రాజ్ కందుకూరి , శివ కందుకూరి, ప్రమోద్ హర్ష, రాజీవ్ కనకాల, సహ నిర్మాత వెంకట్ , కెమెరామెన్ క్రాంతి వర్ల, ప్రశాంత్ ఆర్ విహారి, స్క్రీన్ ప్లే రైటర్ ఇమ్రాన్ తదితరులు మాట్లాడారు.

# చీకటిలోకు ప్రశంసలు



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

శోభిత ధూళిపాళ, విశ్వదేవ్ రచకొండ ప్రధాన పాత్రలలో నటించిన క్రైమ్ థ్రిల్లర్ 'చీకటిలో' ఇటీవల ప్రైమ్ వీడియోలో విడుదలైంది. ప్రైమ్ వీడియో చాలా కాలంగా భారతదేశంలో వినోదానికి వేదికగా ఉంది. వివిధ జానర్‌లలో అనేక ఐకానిక్ షోలు, సినిమాలతో ప్రేక్షకులను కట్టిపడేస్తూ ఓటీటీలో ఆధిపత్యం చెలాయిస్తోంది ప్రేమ్ వీడియో. తన అద్భుతమైన లైనప్‌కు జోడిస్తూ, ఈ ప్లాట్‌ఫారమ్ ఇటీవల మరో ఉత్కంఠభరితమైన తెలుగు క్రైమ్ థ్రిల్లర్ 'చీకటిలో'ను తీసుకు వచ్చింది. ఇది ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తుందని చెప్పినట్లుగానే ఆ స్థాయిలో ప్రశంసలు అందుకుంటుంది. ప్రేక్షకులతో పాటు ప్రముఖుల చేత ఒకే విధంగా ఆసక్తిని రేకెత్తించిన దాని ట్రైలర్ ఆ తర్వాత జనవరి 23న ప్రైమ్ వీడియోలో విడుదలైంది. శోభిత ధూళిపాళ, విశ్వదేవ్ రచకొండ ప్రధాన పాత్రలలో నటించిన 'చీకటిలో' ఒక సరికొత్త విభిన్నమైన కథను అందిస్తుంది. ఈ ఉత్కంఠభరితమైన క్రైమ్ థ్రిల్లర్ ప్రేక్షకులనే కాకుండా ప్రముఖుల హృదయాలను కూడా గెలుచుకుంటోంది. రానా దగ్గుబాటి, అభినవ్ గోమటం వంటి ప్రముఖులు సోషల్ మీడియాలో ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూ, దాని గురించి ప్రస్తావించారు.



# 'ఇస్మార్ట్' బ్యూటీకి ఈ ఏడాది కలిసొచ్చేనా?

తెలుగు చిత్ర సీమలోకి ఎప్పటికప్పుడు నవతరం మెచ్చేలా అందాల భామలు రివ్వున దూసుకొస్తూ తమ అందంతోనే కాదు.. నటనతోనూ రాణిస్తున్నారు. మన హీరోయిన్స్ మాత్రమే కాకుండా ఇతర బాషల నుంచి వచ్చిన బ్యూటీస్ కూడా మన సినిమాలు చేస్తూ ప్రేక్షకులను మెప్పిస్తున్నారు. అయితే.. వారి పోటీని కొంతమంది తట్టుకోలేకపోతున్నారు. స్టార్ హీరోయిన్స్ బడా సినిమాలు చేస్తుంటే కుర్ర హీరోయిన్స్ చిన్న సినిమాలతో హిట్స్ అందుకుంటున్నారు. మరికొందరు భామలు మాత్రం అవకాశాల కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. వారిలో నభా నటేష్ ఒకరు. నిత్యం సోషల్ మీడియాలో అందాలతో కవ్వించే ఈ ముద్దుగుమ్మకు మంచి క్రేజ్ ఉన్న విషయం తెలిసిందే. నభా నటేష్ చేసింది తక్కువ సినిమాలే అయినా కానీ.. తన అందంతో అభిమానులను తన వైపునకు చూసేలా చేసుకుంది. 'నన్నుదోచుకుందువటే' సినిమాతో కథానాయికగా టాలీవుడ్ ప్రేక్షకులను పలకరించిది ఈ భామ. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేసి ఆకట్టుకుంది. 'ఇస్మార్ట్ శంకర్'తో భారీ విజయాన్ని అందుకుంది. ఈ సినిమాలో తన అందంతో పాటు నటనతోనూ కవ్వించింది. ఆ తర్వాత వరుసగా డిస్కో రాజా, అదుగో, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో తదితర సినిమాల్లో అవకాశాలు అందుకుంది. నభా అభినయానికి మంచి మార్కులే పడ్డా కానీ.. ఆ సినిమాలేవీ పెద్దగా విజయం సాధించలేదు. ఫలితంగా ఈ అమ్మడికి అవకాశాలు తగ్గిపోయాయి. అదే సమయంలో ప్రమాదానికి గురవ్వడంతో సినిమాలకు కాస్త బ్రేక్ ఇచ్చింది. ఇక ఇప్పుడు తిరిగి కోలుకొని వరుసగా సినిమాలను లైనప్ చేసింది. కానీ ఈ ముద్దుగుమ్మ ఆశించిన స్థాయిలో మాత్రం గుర్తింపు దక్కించుకోలేకపోతోంది. ఇకనైనా కాలం కలిసిరాకపోతుందా .. కెరీర్ గాడిన పడకపోతుందా..? అంటూ గంపెడాశతో ఎదురుచూస్తోంది. ఫ్చ్..నభా నటేష్!!

# 100 డేస్ లవ్‌స్టోరీ ట్రైలర్



ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):

శ్రీ సాయి శివ ప్రియ క్రియేషన్స్ పతాకంపై పురిపండ .వి. వెంకటరమణ మూర్తి శర్మ నిర్మాతగా.. విజయమిత్ర దర్శకత్వంలో '100 డేస్ లవ్ స్టోరీ'అనే చిత్రం రూపుదిద్దుకుంటోంది. 'అతి ప్రేమ భయానకం' అనేది క్యాప్షన్. ఈ చిత్రానికి సంబంధించిన ట్రైలర్ రిలీజ్ శుక్రవారం ప్రసాద్ ల్యాబ్ లో నిర్మాత సాయి వెంకట్ చేతుల మీదుగా ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ '100 డేస్ లవ్ స్టోరీ' చిత్రం ట్రైలర్ అత్యంత అద్భుతంగా ఉంది. ట్రైలర్ ని చూస్తే చక్కటి ప్రేమకథలా అనిపిస్తుంది. ఈ చిత్రానికి క్యాప్షన్ గా 'అతి ప్రేమ భయానకం'ని పెట్టడంలోనే సినిమా ఎలా ఉండబోతోందో అంచనా వేయొచ్చు అన్నారు. ప్రస్తుతం ప్రేమ పేరుతో సమాజంలో ఎన్నో మోసాలు జరుగుతున్నాయి. యువత ప్రేమ మోజులో జీవితాలను కోల్పోతున్నారు. ఈ విషయంలో ఎంతో జాగ్రత్తగా ఉండాల్సిన యువతరం విచ్చలవిడి అలవాట్లకు బానిసలుగా మారిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో యువత మేల్కోవాల్సిన అవసరం ఉంది అని నిర్మాత సాయి వెంకట్ పేర్కొన్నారు. హీరో జయ శివ సూర్య మాట్లాడుతూ.. నన్ను చూసిన అందరూ పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ లా ఉన్నానని చెబుతుంటే ఎంతో ఆనందమేస్తోంది. నన్ను పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ తో పోల్చడం నా అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. ఈ సినిమా నాకు హీరోగా మంచి పేరును తీసుకొస్తుందని భావిస్తున్నాను అని అన్నారు. ఈ సినిమాకు కథ, మాటలు, స్క్రీన్ ప్లే, దర్శకత్వం వహించిన విజయ్ మిత్ర మాట్లాడుతూ... ప్రస్తుతం టాలీవుడ్ లో వస్తోన్న చిత్రాలకు భిన్నంగా ఈ '100 డేస్ లవ్ స్టోరీ' తెరకెక్కింది. అన్ని వర్గాల ప్రేక్షలు మెచ్చే అంశాలు మనకు ఈ సినిమాలో ప్రతీ ఫ్రేమ్ లోనూ కనిపించి హృదయాలను హత్తుకుంటాయి. సన్నివేశాలన్నీ ఆద్యంత ప్రేక్షకులు మనసులను దోచుకుంటాయన్న నమ్మకం నాకుంది. ఈ సినిమా దర్శకుడిగా నాకు, హీరోగా జయ శివ సూర్య, నిర్మాతగా పురిపండ .వి. వెంకటరమణ మూర్తి శర్మ గార్లకు మంచి పేరుని తెచ్చిపెడుతుందన్న నమ్మకం నాలో బలంగా ఉందన్నారు. నిర్మాత పురిపండ .వి. వెంకటరమణ మూర్తి శర్మ మాట్లాడుతూ.. ఈ చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 13న లవర్స్ డేకు ఒకరోజు ముందే విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు. చిత్రాన్ని ఎక్కడా రాజీ పడకుండా అన్ని వర్గాలను ఆకట్టుకునేలా తీర్చిదిద్దినట్టు తెలిపారు. హీరోయిన్ నిఖిత శ్రీ మాట్లాడుతూ.. కథానాయికగా ఈ సినిమాలో నటించే అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రంలో ఇంకో హీరోయిన్ గా ఇషా మనోహరి ప్రియ, ఖబర్దస్ట్ అప్పారావు, ఆకెళ్ళ గోపాల క్రిష్ణ, కుమరన్ శేతురామన్, పి.వి.ఆర్ శర్మ తదితరులు నటించారు. ఈ చిత్రానికి డీఓపీ : శేషు డి.నాయుడు, సంగీతం : తరుణ్ రాణాప్రతాప్, ఎడిటింగ్ : ఎస్.ఎఫ్.ఎక్స్ : శ్యామ్ కుమార్, డిజైన్స్, గ్రాఫిక్స్ :ఖ్యాతి విజ్యువల్స్ పీఆర్వో : బాబు నాయక్.

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**